thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు
## సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 342 కరీంనగర్ మంగళవారం, 17 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పది ఉపగ్రహాలతో నిత్యం పహారా: ఇస్రో

ఇంఫాల్ : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో దేశ ప్రజల భద్రత, రక్షణ నిమిత్తం కనీసం పది ఉపగ్రహాలు ఆకాశంలో నిరంతరం పహారా కాస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల మధ్య దేశ భద్రత కోసం ఇస్రో చేస్తున్న కృషిని వివరించారు. 'మన ఇరుగు పొరుగు దేశాల గురించి అందరికీ తెలుసు. మన దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ఉపగ్ర హాలతో నిత్యం నిఘా పెట్టాలి. 7 వేల కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీర ప్రాంతాలను పర్యవేక్షించాలి. మన ఉత్తర భాగాన్నం తా నిరంతరం పరిశీలించాలి. ఉపగ్రహాలు, డ్రోన్ల సాయం లేకుండా దాన్ని సాధించలేం' అని నారాయణన్ అన్నారు.



## కొలువుదీరిన కొత్త పాలకవర్గాలు

హైదరాబాద్ : తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కొత్త పాలకవర్గాలు ఏర్పడి అధికార బాధ్యతలు చేపట్టాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వెల్లడించిన తాజా వివరాల ప్రకారం స్థానిక సంస్థలపై పార్టీల ఆధిపత్యం స్పష్టమైంది. ఈ వివరాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఖాతాలో 82 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్లు చేరగా, బీఆర్ఎస్‌కు 17 మున్సిపాలిటీలు దక్కాయి. బీజేపీ ఒక మున్సిపాలిటీతో పాటు ఒక కార్పొరేషన్‌ను కైవసం చేసుకుంది. ఇక సీపీఐ ఖాతాలో ఒక కార్పొరేషన్ చేరగా, ఇండిపెండెంట్లు నాలుగు మున్సిపాలిటీల్లో విజయం సాధించారు. తెలంగాణలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. కాంగ్రెస్ పార్టీ ఐదు కార్పొరేషన్లలో ఆధిపత్యం చాటుకోగా, కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ విజయం సాధించింది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు సమానంగా స్థానాలు రావడంతో రెండు పార్టీలు పరస్పర అవగాహనకు వచ్చాయి. ఒప్పందం ప్రకారం తొలి రెండున్నరేళ్లు మేయర్ పదవి సీపీఐకి, డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు ఇవ్వాలని నిర్ణయించారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ మజ్లిస్ మద్దతుతో మేయర్ పదవిని గెలుచుకుంది. మొదటి నుంచే ఉత్కంఠ రేపిన కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీకి దక్కడం ప్రత్యేకంగా నిలిచింది. మొత్తం మీద తెలంగాణలో స్థానిక సంస్థలపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించగా, కీలక నగరాల్లో బీజేపీ, సీపీఐలు కూడా తమ ముద్ర వేయగలిగాయి. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో స్థానిక సంస్థల సమీకరణలు మరింత ఆసక్తికరంగా మారాయి. కార్పొరేషన్ల వారీగా మేయర్లు – డిప్యూటీ మేయర్లు కరీంనగర్ కార్పొరేషన్ – మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ), డిప్యూటీ మేయర్: సునీల్ రావు (బీజేపీ) నిజామాబాద్ కార్పొరేషన్ – మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మా తహసీన్ (మజ్లిస్) రామగుండం కార్పొరేషన్ – మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపెల్లి ఎల్లయ్య (కాంగ్రెస్) కొత్తగూడెం కార్పొరేషన్ – మేయర్: మూడ్ గణేశ్ (సీపీఐ), డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారి (కాంగ్రెస్) నల్గొండ కార్పొరేషన్ – మేయర్: బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ మహబూబ్‌నగర్ కార్పొరేషన్ – మేయర్: గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) మంచిర్యాల కార్పొరేషన్ – మేయర్: మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: రమ్య మహేశ్ (కాంగ్రెస్)

# కరీంనగర్‌లో కమల వికాసం
## మేయర్ పీఠం దక్కించుకున్న బిజెపి
### – చక్రం తిప్పిన కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్



కరీంనగర్ : కరీంనగర్ కార్పొరేషన్‌లో కమలం వికసించింది. తెలంగాణలో తొలిసారి ఒక మున్సిపల్ కార్పొరేషన్‌లో 30 డివిజన్లను గెలుచుకోవడమేకాకుండా మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కూడా బీజేపీ కైవసం చేసుకున్నది. మేయర్, డిప్యూటీ పదవులు బీజేపీ దక్కకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కూటమి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యూహాత్మకంగా వేసిన అడుగులు ఆ పార్టీకి విజయాన్ని సాధించి పెట్టాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆపార్టీకి దక్కిన ఏకైక కార్పొరేషన్ ఇదే కావడంతో కరీంనగర్ బీజేపీకి కీలక కేంద్రంగా మారింది.

**– ఇవీ లెక్కలు..** కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 డివిజన్లు ఉన్నాయి. బీజేపీ 30 స్థానాలను, కాంగ్రెస్ 14 స్థానాలను, బీఆర్ఎస్ 9 స్థానాలను గెలుచుకున్నాయి. ఎంఐఎం 3 స్థానాల్లో, ఫార్వర్డ్‌బ్లాక్ 2 స్థానాల్లో, ఇండిపెండెంట్లు 8 స్థానాల్లో గెలుపొందారు. వీరితోపాటు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదై ఉన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకోవాలంటే మొత్తం సభ్యుల్లో సగానికంటే ఒకరు ఎక్కువగా ఓటు వేయాల్సి ఉంటుంది. మ్యాజిక్ ఫిగర్ 35 సాధించిన వారికి గెలుపు అవకాశాలు ఉంటాయి.

**– బీజేపీకి దక్కకుండా విశ్వప్రయత్నాలు...** బీజేపీకి 30 మంది కార్పొరేటర్లతోపాటు ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఓటుకూడా ఉండడంతో వారి బలం 31కి చేరింది. ముగ్గురు ఇండిపెండెంట్లు, ఒక ఫార్వర్డ్‌బ్లాక్ సభ్యురాలు బీజేపీకి మద్దతు తెలిపారు. దీంతో 35 సంఖ్యాబలంతో బీజేపీ గెలుపు ఖాయమని అందరూ భావించారు. ఆ సమయంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కరీంనగర్ కార్పొరేషన్‌ను ఎలాగైనా దక్కించుకోవలసిందేనని జిల్లాకు చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావుకు చెప్పడంతో వారు రంగంలోకి దిగారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, ఫార్వర్డ్‌బ్లాక్, ఇండిపెండెంట్ సభ్యులతో కలుపుకొని కూటమిగా మారి ఓటింగ్‌లో పాల్గొంటే 35 ఓట్ల సంఖ్యాబలాన్ని సాధించి గెలుపును సొంతం చేసుకోవచ్చని భావించారు. ఇది సాధ్యమైతే బీజేపీ సంఖ్యాబలం 34కు పడిపోతుందని వారు ప్రణాళిక రూపొందించుకొని ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఒక వైపు బీఆర్ఎస్‌తో చర్చలు జరుపుతూ మరోవైపు ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులతో టచ్‌లోకి వెళ్లారు. ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర, జిల్లా నాయకులు తమ ఇద్దరు సభ్యులకు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక సమావేశానికి హాజరుకావాలని విప్ జారీ చేశారు. అప్పటికే వారిద్దరిలో ఒకరు బీజేపీ క్యాంపులో, మరొకరు కాంగ్రెస్ క్యాంపులో ఉన్నారు. ఎవరికి ఓటు వేసే విషయాన్ని ఎన్నికకు ముందు విప్ ద్వారా పేర్కొంటామని వారు ప్రకటించారు. ఫార్వర్డ్‌బ్లాక్ విప్ జారీ చేయడంతో అంతవరకు బీజేపీకి మద్దతు తెలిపిన ఆ పార్టీ కార్పొరేటర్ సాయిజ్యోతి కాంగ్రెస్ శిబిరంలోకి వెళ్లారు. దీంతో బీజేపీ బలం 34కు పడిపోయింది. కాంగ్రెస్‌కు 14 మంది కార్పొరేటర్లు ఉండగా, బీఆర్ఎస్‌కు తొమ్మిది, ఎంఐఎంకు ముగ్గురు, ఫార్వర్డ్‌బ్లాక్‌కు ఇద్దరు, ఇండిపెండెంట్లు ఐదుగురు తోడయ్యారు. దీంతో వారి బలం 35కు చేరింది. అప్పుడు కాంగ్రెస్ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు ఎవరైతే బాగుంటుందో తన కార్పొరేటర్లను అడిగి అభిప్రాయ సేకరణ చేసింది. మంత్రుల సమక్షంలో కార్పొరేటర్ల నుంచి మూడు పేర్లు పరిశీలనకు వచ్చాయి. మల్లికార్జున రాజేందర్, వైద్యుల అంజన్‌కుమార్, ఆకుల నర్మద పేర్లు మేయర్ పదవి కావాలనడంతో ఎవరి పేరు ఖరారు చేయాలనే విషయంలో పార్టీ నేతల్లో తర్జనభర్జన జరిగింది. ఆదివారం రాత్రి 11 గంటల వరకు వారు ఎటూ తేల్చక పోవడంతో కాంగ్రెస్ శిబిరంలో గందరగోళ పరిస్థితి నెలకొన్నది.

**– చివరి నిమిషంలో మారిన సమీకరణాలు...** కాంగ్రెస్, బీఆర్ఎస్ కలయికపై సోషల్ మీడియాలో, రాజకీయవర్గాల్లో, ప్రజల్లో కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లలో కొందరు, పార్టీకి చెందిన సీనియర్ నేతలు కొందరు కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడాన్ని వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాన్ని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుకు తెలిపారు. ఆయన ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకవెళ్లడంతో బీఆర్ఎస్ నాయకులు పునరాలోచనలో పడ్డారు. కాంగ్రెస్ శిబిరంలో మేయర్, డిప్యూటీ మేయర్లు ఎవరన్న విషయంలో ఏకాభిప్రాయం రాకపోవడం, మరోవైపు ప్రజల్లో కూటమిపై వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు దూరంగా ఉండడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చిందని సమాచారం.

**– ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్....** బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉండగా కాంగ్రెస్ ముందుగా చర్చకు వచ్చిన అభ్యర్థులందరిని కాదని కొత్తగా ఆకుల నర్మదను మేయర్ అభ్యర్థిగా, హీనా ఆఫ్రీన్‌ను డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రతిపాదించింది. వీరివురికి 21, 22 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థులకు 34 చొప్పున ఓట్లు వచ్చాయి. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ తన ఓటు హక్కును వినియోగించుకోగా మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఓటింగ్‌లో పాల్గొనలేదు. మరో ఎక్స్ అఫీషియో సభ్యుడు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమావేశానికి హాజరుకాలేదు.

## శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ ముందడుగు: ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: భారత్ ఆతిథ్యమిస్తున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' దేశ యువతలోని ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో ప్రపంచ దేశాలన్నీ భాగస్వాములు కావాలంటూ సోమవారం ఆయన పిలుపునిచ్చారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్ ఎంత వేగంగా పురోగమిస్తోందో చెప్పడానికి ఈ సదస్సే నిదర్శనమని, ఈ రంగంలో దేశం సాధిస్తున్న వృద్ధిని ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు భారత్‌కు రావడం మనందరికీ గర్వకారణం. ఇది మన దేశ యువత శక్తిసామర్థ్యాలను ప్రతిబింబిస్తోంది' అని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ అగ్రగామిగా ఎదుగుతూ, ప్రపంచ అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తోందనడానికి ఈ సందర్భమే ఒక గొప్ప నిదర్శనమని ఆయన కొనియాడారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఫిబ్రవరి 16 నుండి 19 వరకు ఈ సదస్సు జరగనుంది. ప్రధాని మోదీ దీనిని ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సులో సుమారు 600 స్టార్టప్‌లు, వివిధ సంస్థలు పాల్గొంటున్నాయి. ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాంఢ్‌వరల్డ్, సెర్బియా, ఎస్టోనియా, తజికిస్తాన్, ఆఫ్రికా తదితర 13 దేశాలు ఈ ప్రదర్శనలో తమ ప్రత్యేక పెవిలియన్లను ఏర్పాటు చేయడం విశేషం.




లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాను తొలగించే అవిశ్వాస తీర్మానంపై మార్చి 9న చర్చ జరగనుంది, ఆ తర్వాత ఓటింగ్ ఉంటుంది. బడ్జెట్ సమావేశాల రెండో విడత ప్రారంభమైన రోజునే ఇది ఉంటుందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తన నియోజకవర్గం తవాంగ్ లో పర్యటించిన రిజిజు మీడియాతో మాట్లాడారు. బడ్జెట్ సెషన్ రెండో భాగం మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉంటుందన్నారు. రెండో సెషన్ చాలా ఆసక్తికరంగా ఉంటుందని.. పలు బిల్లులతో పాటు ఒక కీలక బిల్లు పార్లమెంట్‌లో చర్చకు వస్తుందన్నారు. ప్రతిపక్షాలు మొదటి సెషన్‌లోలా నిరసనలు చేస్తే, అది వారికే నష్టమన్నారు. ప్రతిపక్షాలు హౌస్ నడవనివ్వకపోతే, గిలటిన్ పద్ధతిలో ముందుకు వెళ్తామని రిజిజు చెప్పారు. ప్రతిపక్షాలలో ఐక్యత లేదని పేర్కొన్నారు.



# రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..
# శంషాబాద్‌లో హైస్పీడ్ రైల్వే టెర్మినల్!
## హైదరాబాద్ ముఖచిత్రాన్ని మరింత మార్చేలా ప్రణాళిక..

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుల్లెట్ రైళ్ల హబ్‌గా శంషాబాద్ బహదూర్‌గూడలో హైస్పీడ్ రైల్వే టెర్మినల్ ఇటీవలే హద్దులు గుర్తించిన అధికారులు తెలంగాణ రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. శంషాబాద్ ప్రాంతాన్ని హైస్పీడ్ రైళ్ల హబ్‌గా మార్చాలని భావిస్తోంది. ఈ మేరకు అధికారులు చకచకా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ ముఖచిత్రాన్ని మరింత మార్చే హైస్పీడ్ (బుల్లెట్) రైళ్ల టెర్మినల్‌ను శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకుని ఉన్న బహదూర్‌గూడ భూముల్లో ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. ఇందుకు సంబంధించిన భూసేకరణపై కూడా అధికారులు దృష్టి కేంద్రీకరించారు. దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో మూడు కారిడార్లు హైదరాబాద్‌తో అనుసంధానం అవుతున్నాయి. హైదరాబాద్ నుంచి పుణె, బెంగళూరు, చెన్నై మార్గాల్లో ఈ హైస్పీడ్ రైలు కారిడార్లు నిర్మించనున్నారు. అయితే, ఇటీవల ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి రైల్వే మంత్రిని కలిశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే హైస్పీడ్ రైలు మార్గాలను ప్రారంభించాలని కోరారు. ఈ కారిడార్ కోసం శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 500 ఎకరాలు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేంద్రం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. శంషాబాద్ ప్రాంతంలోని బహదూర్‌గూడలోని సర్వే నంబరు 28, 62లోని 650 ఎకరాల ప్రభుత్వ భూములకు సంబంధించిన హద్దులను ఇటీవలే ప్రభుత్వం గుర్తించింది. వీటిని మరోసారి సర్వే చేయనున్నట్లు తెలిసింది. ఈ భూములను స్థానికులు కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఆయా రైతులకు కొంత పరిహారం అందించి భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. హైస్పీడ్ రైల్ కారిడార్లతో మధ్య, దక్షిణ భారతాన్ని అనుసంధానించే కేంద్రంగా హైదరాబాద్ మారనుంది. దేశ మౌలిక సదుపాయాల రంగంలో అత్యంత కీలక రాష్ట్రంగా తెలంగాణ అవసరిస్తుందని, తద్వారా దేశ రాజకీయాల్లో కూడా తెలంగాణ ప్రాధాన్యం పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మరోవైపు.. ఈ ప్రాంతం అంతర్జాతీయ బిజినెస్‌కు గేట్‌వేగా అభివృద్ధి చెందే అవకాశముంది. హైస్పీడ్ కారిడార్‌లో నడిచే బుల్లెట్ రైళ్లు గంటకు 300 నుంచి 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. దీంతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రోడ్డు లేదా రైలు మార్గాల్లో ప్రయాణం చేసేందుకు ప్రస్తుతం 8 నుంచి 11 గంటల సమయం పడుతుంది. అదే.. హైదరాబాద్ – బెంగళూరు మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ అందుబాటులోకి వస్తే కేవలం రెండు గంటల్లోనే గమ్యస్థానాలకు చేరుకొనే అవకాశం ఉంటుంది.




## తెలంగాణ రైతాంగానికి గుడ్‌న్యూస్.. పెండింగ్ బకాయిలు క్లియర్..

హైదరాబాద్, ఫిబ్రవరి 16: ధాన్యం రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఖరీఫ్‌లో సన్న వడ్ల కొనుగోలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను క్లియర్ చేస్తూ రూ.514.36 కోట్ల నిధులను విడుదల చేసింది. క్వింటల్‌కు రూ.500 చొప్పున బోనస్ రూపంలో రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయి. దీని ద్వారా సుమారు 2.17 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొత్తం 1,939.58 కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించింది. రాష్ట్రంలో సన్న బియ్యం సాగును ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రాధాన్యంగా .. ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులు, ఎమ్ఎస్‌పీతో పాటు అదనపు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నిధుల విడుదలతో పెండింగ్ బకాయిలు దాదాపు పూర్తిగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు, సివిల్ సప్లైస్ శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు. పెండింగ్ బకాయిలు విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## తొర్రూర్‌లో తీవ్ర ఉద్రిక్తత.. మాజీ మంత్రి ఎర్రబెల్లి పీఏపై దాడి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రక్రియ కొనసాగుతోంది. స్పష్టమైన మెజారిటీ ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సజావుగా జరుగుతోంది. హంగ్ వచ్చిన పలు మున్సిపాలిటీల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాగా వేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. ఈ క్రమంలో పలు మున్సిపాలిటీల్లో ఘర్షణలు, ఆందోళనలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నాయి. దీంతో తోపులాట జరిగింది. అక్కడికి ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేరుకున్నారు. ఈ క్రమంలో ఎర్రబెల్లి పీఏపై కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి దిగారు. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 చోట్ల గెలుపొందాయి. ఇక్కడ ఎక్స్‌అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలిద్దరూ కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ బలాబలాలు సమానంగా మారడంతో డ్రా ద్వారా ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. మరోవైపు వరంగల్‌లో ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా కావ్య పేరు ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనిపై చట్టపరంగా ముందుకెళ్తామని ఆ పార్టీ చెబుతోంది. వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీలో ఛైర్మన్ ఎన్నికకు ఎక్స్ అఫీషియో ఓటు కీలకమైంది. ఈ నేపథ్యంలో ఒకటో వార్డుకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అక్కమ్మ కనిపించకపోవడంతో ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. పరిగి పీఎస్ వద్ద నిరసన చేపట్టారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత నుంచి అక్కమ్మ ఎక్కడున్నారో తెలియడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ నేతలే ఆమెను తీసుకెళ్లారని వారు ఆరోపిస్తున్నారు.

## బీజేపీ ఓట్ల శాతం పెరిగింది: రామచందర్‌రావు



హైదరాబాద్: తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 15 మున్సిపాలిటీల్లో బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఇది రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదానికి నిదర్శనమని రామచందర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీకి ఉత్సాహాన్ని నింపాయని రామచందర్ రావు పేర్కొన్నారు.




## కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ ఎందుకు కాపాడుతున్నారో అర్థమైంది: ఎంపీ అర్వింద్

నిజామాబాద్, ఫిబ్రవరి 16: నిజామాబాద్ నగర మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడంతో స్థానిక ఎంపీ, బీజేపీ సీనియర్ నేత ధర్మపురి అర్వింద్ సోమవారం స్పందించారు. మూడు ఓట్ల తేడాతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ పార్టీ గెల్చుకుందన్నారు. బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని మండిపడ్డారు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ తదితర కేసుల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారో ఈ రోజు అర్థమైందమన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు.

**అసలు ఏం జరిగిందంటే..?...** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ 17, ఎంఐఎం 14, బీఆర్ఎస్ పార్టీ 1 గెలుచుకున్నాయి. నగర మేయర్ పీఠం దక్కాలంటే.. మ్యాజిక్ ఫిగర్ 31 రావాల్సి ఉంటుంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్‌కు మూడు అడుగుల దూరంలో బీజేపీ నిలిచిపోయింది. అలాంటి వేళ అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఎంఐఎంను తమ దారికి తెచ్చుకున్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఒక అభ్యర్థి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దాంతో నిజామాబాద్ మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడింది. దాంతో నగర మేయర్‌గా ఉమారాణి పేరును ఖరారు చేశారు.




## హస్తం ఖాతాలో నిజామాబాద్ మేయర్ పీఠం

నిజామాబాద్, ఫిబ్రవరి 10: నిజామాబాద్ నగర మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే దానిపై ఏర్పడిన ఉత్కంఠ ఎట్టకేలకు సోమవారం వీడింది. నిజామాబాద్ మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఆ నగర మేయర్‌గా ఉమారాణిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. నిజామాబాద్ నగరంలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో నగర ఓటరు బీజేపీకి 28, కాంగ్రెస్‌కు 17, ఎంఐఎంకు 14, బీఆర్ఎస్ పార్టీకు 1 కట్టబెట్టాడు. అయితే మేయర్ పీఠం దక్కాలంటే.. మ్యాజిక్ ఫిగర్ 31 రావాల్సి ఉంటుంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్‌కు మూడు అడుగుల దూరంలో బీజేపీ నిలిచిపోయింది. అలాంటి వేళ.. మేయర్ పీఠం కోసం అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేపట్టింది. దాంతో ఎంఐఎంను తన దారికి తెచ్చుకొంది. దాంతో ఈ రెండు పార్టీలు కలిస్తే.. 31 సీట్లు వచ్చినట్లు అయింది.

అలాగే ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు కూడా కలిసి.. మరో రెండు ఓట్లు ఆ పార్టీకి వచ్చి చేరాయి. అలాగే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఒక్క అభ్యర్థి సైతం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోయాడు. దాంతో ఈ పీఠం సులువుగా కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడింది. అదీకాక పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సొంత జిల్లా కావడంతో.. నిజామాబాద్ నగర మేయర్ పీఠాన్ని ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దాంతో ఆ పీఠం కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది.



## 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా

హైదరాబాద్: వివిధ కారణాల వల్ల 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా పడింది.

ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలో ఎన్నిక వాయిదా పడినట్లు అధికారులు వెల్లడించారు. తిరిగి ఎప్పుడు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## నిజామాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఉత్తమ్‌కుమార్ రెడ్డి



నిజామాబాద్: నిజామాబాద్ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అందుకోసం నిధులు ప్రత్యేక కేటాయించనున్నట్లు చెప్పారు. నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రహదారులు, అభివృద్ధి విషయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వబోతోందని చెప్పారు. తెలంగాణలో నిజామాబాద్ ఓ గొప్ప నగరంగా అభివృద్ధి చెందాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు కృషి చేస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గూండాగిరి: కేటీఆర్

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గూండాగిరి చేసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కిడ్నాప్‌లు, దాడులు, అక్రమ ఓట్లతో పదవులు పొందిందని ఆరోపించారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు ఇవాల్టి పరిణామాలే నిదర్శనమన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఎక్స్ అఫీషియో ఓట్ల పేరుతో దొంగ ఓట్లను నమోదు చేశారు. కాంగ్రెస్ తొత్తులుగా మారిన పోలీసులపై డీజీపీ చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ నేతల ఒత్తిడి మేరకు ఛైర్‌పర్సన్ల ఎన్నికను కొన్ని చోట్ల వాయిదా వేశారు. సంబంధిత అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు హంగ్ వచ్చిన మున్సిపాలిటీలపై భారాస దృష్టి సారించింది. 8 పట్టణాలకు సీనియర్ నేతలను ఇన్‌ఛార్జిలుగా నియమించింది.






## ఈ మున్సిపాలిటీలో దంపతులదే ఆధిపత్యం..

నిర్మల్: నిర్మల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు భార్యాభర్తలకే దక్కడం విశేషంగా మారింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అప్పాల కావ్య ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా ఆమె భర్త అప్పాల గణేష్ చక్రవర్తి కూడా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికల్లో ఏకగ్రీవ నిర్ణయం తీసుకోవడంతో మున్సిపల్ పాలనలో భార్యాభర్తలు కలిసి బాధ్యతలు నిర్వహించనున్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీంతో నిర్మల్ మున్సిపాలిటీలో కొత్త నాయకత్వంపై ఆసక్తి నెలకొంది. అశ్వారావుపేట మున్సిపాలిటీలో.. ఇదిలా ఉండగా, అశ్వారావుపేట మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. చైర్‌పర్సన్‌గా శశికళ ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా ఆమె భర్త రమేష్ ఎన్నికయ్యారు. భార్యాభర్తలే మున్సిపల్ పీఠాలను అధిష్టించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.






## అమరావతిలో బిల్‌గేట్స్.. సీఎం చంద్రబాబుతో భేటీ

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబుతో గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ భేటీ అయ్యారు. సోమవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన అనంతరం ఆయన నేరుగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. బిల్‌గేట్స్‌కు చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారితో బిల్‌గేట్స్ బృందం సమావేశమైంది. ఆ తర్వాత సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) కేంద్రాన్ని బిల్‌గేట్స్ సందర్శించారు. ఆర్టీజీఎస్ విధానాలు, సాధిస్తున్న ఫలితాల్ని గేట్స్‌కు చంద్రబాబు వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై బిల్‌గేట్స్‌తో సీఎం చర్చించారు. ప్రత్యేకించి గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి వివరించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు రావడానికి దారి తీసిన పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యమంత్రితో పాటు.. గేట్స్ కూడా నాటి ఢిల్లీ సమావేశం, సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు, అమెరికా వెలుపల తొలి డెవలప్‌మెంట్ సెంటర్ హైదరాబాద్‌లో ఏర్పాటు కావడం గురించి సమావేశంలో ఉన్న మంత్రులు, సెక్రటరీలకు వివరించారు బిల్‌గేట్స్. తొలి భేటీలోనే చంద్రబాబు విజనరీ ఆలోచనలను తాను గమనించానని బిల్‌గేట్స్ చెప్పుకొచ్చారు. అక్కడి నుంచి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన బిల్‌గేట్స్ బృందం.. సాగులో టెక్నాలజీ అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించి ప్రశంసించారు. ప్రకృతి సాగు గురించి రైతులు, అధికారులతో చర్చించారు బిల్‌గేట్స్. అలాగే పంట ఉత్పత్తులను పరిశీలించారు. చీడపీడలకు సంబంధించిన వివరాలు అందించేఫూా-చా×మీా (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం) మొబైల్ యాప్ పనితీరును పరిశీలించారు బిల్‌గేట్స్. రైతు ఫోన్ ద్వారా ఈ యాప్‌ను ఉపయోగించి పంటకు వచ్చిన తెగులును గుర్తించడమే కాకుండా... డ్రోన్ ద్వారా మందుల పిచికారీ చేసే విధానాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు బిల్‌గేట్స్. వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన బిల్ గేట్స్‌కు.. రైతులు స్థానిక వంటకాలను రుచిచూపించారు.

## ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు..

అమరావతి, ఫిబ్రవరి16 : గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. 'నైస్, గుడ్, గ్రేట్ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలంటూ గేట్స్ కొనియాడారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో మంత్రి నారా లోకేశ్‌తో సహా నలుగురు మంత్రులను సీఎం చంద్రబాబు గన్నవరం విమానాశ్రయానికి పంపించి స్వాగతం పలికారు. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ'.. అంటూ ముఖ్యమంత్రిని పలకరించారు గేట్స్. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు పరిచయం చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్‌లోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్‌కు వివరించారు సీఎం. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్‌కు గేట్స్‌ను తీసుకెళ్లారు ముఖ్యమంత్రి. తర్వాత ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాలు, విపత్తుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకుంటున్నామనే అంశాన్ని ఉదాహరణలతో సహా వివరించారు ముఖ్యమంత్రి. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి వివరించగా.. దట్స్ నైస్ అంటూ మెచ్చుకున్నారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై గ్రేట్ అంటూ గేట్స్ అభినందనలు తెలిపారు. డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడంపై బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే.. పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అమరావతి రాజధాని ప్రణాళికలను.. బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్‌ను, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. గ్రేట్‌వర్క్ అంటూ రాజధాని మాస్టర్ ప్లాన్‌ను మెచ్చుకున్నారాయన. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలతో రాజధాని నిర్మిస్తున్నామనే విషయాన్ని వివరించారు సీఎం. రాజధాని ప్రాంతంలో మొత్తంగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించే దిశగా.. ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు బిల్ గేట్స్‌కు చెప్పారు సీఎం. అనంతరం మంత్రులు, సెక్రటరీల సమావేశానికి గేట్స్‌ను తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, లక్ష్యాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.




## సంజీవని ప్రాజెక్టు, ఆర్టీజీఎస్, అమరావతిపై బిల్ గేట్స్ ప్రశంసలు

అమరావతి, ఫిబ్రవరి 16: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రాన్ని గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ సందర్శించారు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించారు బిల్ గేట్స్. రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, రాజధాని అమరావతి ప్రాజెక్టుల గురించి బిల్ గేట్స్ తెలుసుకున్నారు. ఆర్టీజీఎస్‌లోని డిస్ ప్లే వాల్స్‌పై ప్రజెంటేషన్లను పరిశీలించారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానించామని సీఎం వివరించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందన్నారు గేట్స్. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు గేట్స్‌కు సీఎం తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న తీరును గేట్స్ పరిశీలించారు. కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్డీపీ పెరుగుదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్ గేట్స్ ప్రశ్నించారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని... అలాగే, భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. ట్యాక్స్ కలెక్షన్ ప్రక్రియ అద్భుతంగా ఉందని గేట్స్ కొనియాడారు. జీఎస్టీ విధానంతో దేశంలో పన్నుల వసూళ్లు కూడా గణనీయంగా పెరిగిందని సీఎం చంద్రబాబు తెలిపారు. తమ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలు గురించి బిల్ గేట్స్ అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి పరీక్షల వివరాలను ఎలా నమోదు చేస్తున్నారని తెలుసుకున్నారు. కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు చాలా చక్కగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తూ దట్స్ నైస్ అంటూ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్, ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగుపరిచేలా చూస్తున్నామని సీఎం తెలుపగా.. గ్రేట్ అంటూ కితాబిచ్చారు బిల్ గేట్స్. బయో డిజైన్ ద్వారా వైద్య సేవలు అందించే విధానాలను గేట్స్ అడిగి తెలుసుకున్నారు. డయాగ్నోస్టిక్ సేవలు తక్కువ వ్యయానికే అందితే పేదలకు వెసులుబాటు ఉంటుందని గేట్స్ తెలిపారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందంటూ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణ తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించగా.. 'గ్రేట్ వర్క్' అంటూ బిల్ గేట్స్ కితాబిచ్చారు.

## గేట్స్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యానికి ఏపీ సిద్ధం: మంత్రి లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 16: గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బిల్ గేట్స్‌కు అమరావతి హృదయపూర్వక స్వాగతం పలుకుతోందని ఆయన పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను సహచర మంత్రులతో కలిసి సాదరంగా స్వాగతించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్‌తో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పరిపాలన రంగాల్లో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సచివాలయంలో చర్చిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రజలకు పటిష్టమైన, అత్యంత ప్రభావం కలిగించే పరిష్కారాలను అందించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోందని మంత్రి లోకేశ్ తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టులో సహచర మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌లతో కలిసి బిల్ గేట్స్‌ను మంత్రి లోకేశ్ స్వాగతించారు.






## యువత క్రీడల్లో రాణించేందుకు శాప్ లీగ్ గొప్ప వేదిక: పీవీ సింధూ

విజయవాడ, ఫిబ్రవరి16 : యువత క్రీడల్లో రాణించేందుకు శాప్ లీగ్ గొప్ప వేదిక అని భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధూ వ్యాఖ్యానించారు. శాప్ లీగ్ మ్యాచ్‌లు ద్వారా యువతకు సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి శాప్ ఆధ్వర్యంలో లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మొత్తం 14 క్రీడలతో లీగ్ మ్యాచ్‌లు నిర్వహించడనికి ప్లాన్ చేశారు. ఇందుకు సంబంధించిన ట్రోఫీని సోమవారం విజయవాడలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీవీ సింధూ, కోనేరు హంపీ, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, శాప్ ఎంపీ భరణి పాల్గొన్నారు. చిన్నారులతో చెస్ ఆడి సందడి చేశారు కోనేరు హంపి. ఈ సంధ్బరంగా పీవీ సింధూ మాట్లాడారు. శాప్ లీగ్ నిర్వహించడం వల్ల యువతలో క్రీడలపై ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. స్పోర్ట్స్ అనేది ప్రతి వ్యక్తికి ముఖ్యమని చెప్పుకొచ్చారు. చాలామంది యువతి, యువకులకు శాప్ లీగ్ ఒక మంచి అవకాశమని వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పీవీ సింధూ సూచించారు.

## చంద్రబాబును చూడగానే.. బిల్ గేట్స్ ఏమన్నారో తెలుసా



అమరావతి, ఫిబ్రవరి 16: గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మీయ స్వాగతం పలికారు. సోమవారం ఏపీ పర్యటనకు వచ్చిన బిల్ గేట్స్.. అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయం మొదటి బ్లాక్ వద్ద సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ బిల్ గేట్స్‌ను ఆహ్వానించారు. చంద్రబాబును చూడగానే బిల్ గేట్స్ ఆత్మీయంగా పలకరించారు. 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..?' అంటూ సీఎం చంద్రబాబును అడిగారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి.. తన మంత్రివర్గ సహచరులను, సీఎస్ విజయానంద్‌ను బిల్ గేట్స్‌కు పరిచయం చేశారు. ఆపై రియల్ టైమ్ గవర్నెన్స్ సేవలను బిల్ గేట్స్ పరిశీలించారు. ఆపై బిల్ గేట్స్ సహా గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి, మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు సమావేశమయ్యారు. రాష్ట్రంలో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సాంకేతిక సాగు సహా తదితర ప్రాజెక్టుల గురించి వివరించనున్నారు సీఎం, అధికారులు. ప్రత్యేకించి గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి సర్కార్ వివరించనుంది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, సవిత, అనిత, కొల్లు రవీంద్ర, కందులు దుర్గేశ్, కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్య కుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యారాణి, పొంగూరు నారాయణ హాజరయ్యారు. అలాగే, వివిధ శాఖల విభాగాధిపతులు వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు.

## ఏపీ అభివృద్ధికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం కీలక మలుపు: పవన్ కల్యాణ్





అమరావతి, ఫిబ్రవరి16 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ట్విట్టర్(ఎక్స్)లో ట్వీట్ పెట్టారు. అమరావతి పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్‌కు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు విశేషమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యానికి చూపుతున్న నిబద్ధతను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. విద్యారంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంలో సహాయపడుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వంటి విధానాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించబోతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

గేట్స్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించడం, టెక్నాలజీ ఆధారిత ఆరోగ్య సేవలను అందించడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కీలకమని అన్నారు. వ్యవసాయ రంగంలో కూడా గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం, డ్రోన్ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పంటల విశ్లేషణ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడతాయని చెప్పుకొచ్చారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడంలో ఈ భాగస్వామ్యం ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. బిల్‌గేట్స్ అమరావతి పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో అమలు చేస్తున్న టెక్నాలజీ ఆధారిత పాలన, అభివృద్ధి కార్యక్రమాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర, స్థిర అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ప్రజల జీవితాల్లో ఆర్టీజీఎస్ మార్పు తీసుకొస్తోంది: చంద్రబాబు



ఉండవల్లి: మానవజీవనాన్ని మెరుగుపరిచేందుకు సేవ చేయాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. పరిపాలనలో వేగాన్ని, వ్యాపార సౌలభ్యాన్ని ఆర్టీజీఎస్ అందిస్తోందని చెప్పారు. ప్రత్యక్షంగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. " 1990లో బిల్ గేట్స్‌ను కలిసినప్పుడు సాంకేతికత ద్వారా పౌరసాధికారత సాధ్యమనే స్ఫూర్తి వచ్చింది. నాటి ఆలోచనలే ఇవాళ టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు బాటలు వేశాయి. ఆర్టీజీఎస్ ద్వారా ఇవాళ పలు కార్యక్రమాల ప్రదర్శన సంతోషంగా ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి గేట్స్ ఫౌండేషన్ చూపుతున్న నిబద్ధతకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల బలోపేతానికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం సంతోషంగా ఉందన్నారు. సమగ్ర స్థిర అభివృద్ధి కోసం ఫౌండేషన్ సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోందని పవన్ తెలిపారు. సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించిన సంగతి తెలిసిందే. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆయన పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు.

# చురకలు

## సంపాదకీయం

### కొత్త ప్రభుత్వం కోరుతోంది... షేక్ హసీనాను అప్పగిస్తారా ?

బంగ్లాదేశ్ తో సంబంధాలను పునరుద్ధరించుకోవాలని భారత ప్రభుత్వం భావిస్తోంది. ఎవరికైనా ఇరుగూ పొరుగూ బాగుండాలి. చెవిలో జోరీగల వారు తినేస్తూంటే అనుకున్నది సాగదు, పైగా ఇరుగు పొరుగులతో శతృత్వం ఉంటే రక్షణ పరంగానూ ఇబ్బందులు వస్తాయి. భారత్ గత ఎనిమిది దశాబ్దాలుగా పాకిస్థాన్ తో పడుతూ వస్తోంది. దాయాది చేసే చేష్టలు పెట్టే ఇబ్బందులు చాలవు అన్నట్లుగా ఇపుడు కొత్తగా బంగ్లా దేశ్ వచ్చి చేరింది. 2024 ఆగస్టు నుంచి అక్కడ షేక్ హసీనా ప్రభుత్వం కుప్ప కూలి తాత్కాలిక ప్రభుత్వం రావడంతో బంగ్లా మంటలు పరోక్షంగా భారత్ మీద సెగలు పొగలు రేపాయి. ఇదే అదనుగా పాక్ మరో వైపు చైనా బంగ్లాతో చెలిమికి చేతులు కలపడం కూడా భారత్ కి వ్యూహాత్మకంగా ఇరకాటంలోకి నెట్టేదే అయింది.

**గ్రీట్ చేసిన మోడీ :** ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ లో బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ బీఎన్ఎస్ గెలిచింది. ఆ పార్టీ తరపున తారిఖ్ రెహమాన్ కొత్త ప్రధాని కానున్నారు. ఫలితాలు వెలువడగానే భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ఆయనకు గ్రీట్ చేశారు. ఇక బీఎన్ఎస్ నేతలు కూడా భారత్ సహా అన్ని దేశాలతో తమ సంబంధాలను స్నేహపూర్వకంగా కొనసాగిస్తామని చెబుతూ వస్తున్నారు మరో వైపు తారిఖ్ రెహమాన్ ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రధాని కి ఆహ్వానం అందుతుంది అని అంటున్నారు. అందితే వెళ్ళడానికి పూర్వ సంబంధాలు నెలకొల్పడానికి భారత్ సిద్ధంగా ఉంది అని వార్తలు వస్తున్నాయి.

**అప్పగించాల్సిందే :** ఇదిలా ఉంటే బీఎన్ఎస్ నాయకులు ఐతే షేక్ హసీనాను తమకు అప్పగించాల్సిందే అన్న డిమాండ్ ని మరోసారి చేశారు. బీఎన్ ఎస్ సీనియర్ నాయకుడు సలావుద్దీన్ అహ్మద్ దీని మీద మాట్లాడుతూ హసీనాను అప్పగించే విషయం గురించి విదేశాంగ మంత్రి ఇప్పటికే ప్రస్తావించారని తాము సమర్ధిస్తున్నామని చెప్పడం విశేషం. చట్ట ప్రకారమే తాము ఈ డిమాండ్ చేస్తున్నామని ఆయన అన్నారు రెండు దేశాల మధ్య విదేశాంగ శాఖకు సంబంధించిన విషయంగా కూడా పేర్కొన్నారు.

**మరణ శిక్షను ఎదుర్కొంటున్న హసీనా :** ఇదిలా ఉంటే షేక్ హసీనా 2024 ఆగస్టు నుంచి భారత్ లో ఉంటున్నారు. భారత్ ఆమెకు ఆశ్రయం కల్పించింది. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ అయితే గత ఏడాది ఆమె పాలనలో జరిగిన అరాచకాల మీద విచారణ జరిపి ఏకంగా మరణ శిక్షనే విధించింది. అమానవీయ నేరాలకు హసీనా పాల్పడ్డారు అని ట్రిబ్యునల్ వ్యాఖ్యలు చేయడం విశేషం. అయితే ట్రిబ్యునల్ తీర్పుని చట్ట వ్యతిరేకం అని షేక్ హసీనా అంటున్నారు. తన వాదనలు వినకుండానే ఈ తీర్పు వెలువరించారు అన్నది ఆమె మాటగా ఉంది.

**ఎన్నికలు ఫార్స్ అంటూ :** ఇక బంగ్లాదేశ్ లో తాజాగా జరిగిన ఎన్నికలు ఫార్స్ అని షేక్ హసీనా ఘాటుగా విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఈ ఎన్నికలు జరగలేదని ఆమె నిందించారు. ఇక షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీని ఎన్నికల్లో పాల్గొనకుండా తాత్కాలిక ప్రభుత్వ సారధి మహమ్మద్ యూనస్ బహిష్కరించారు. దాని మీద కూడా షేక్ హసీనా ఫైర్ అయ్యారు.

**భారత్ ఏమి చేస్తుంది :** ఇక అవామీ లీగ్ అన్న పార్టీతో ఆ పార్టీ నేతలతో భారత్ కి సుదీర్ఘమైన అనుబంధం ఉంది. తొలి బంగ్లా ప్రధాని ఆ దేశ జాతి పిత బంగ్లా దేశ్ కోసం పోరాడిన ముజఫర్ రెహమాన్ కాలం నుంచి ఈ అనుబంధం కొనసాగుతోంది. ఆయన కుమార్తె బంగ్లాదేశ్ లో అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా ఉన్న షేక్ హసీనా కూడా భారత్ తో ఎంతో మితృత్వం నెరిపారు. దానిని దృష్టిలో ఉంచుకునే భారత్ ఆమెకు ఆశ్రయం ఇచ్చింది. ఇక బంగ్లా ఎన్నికల్లో అవామీ లీగ్ కి కూడా పాల్గొనేలా చూడాలని భారత్ అయితే అభిప్రాయపడింది. కానీ ఇపుడు బంగ్లా దేశ్ తో భారత్ తన సంబంధాలను పునరుద్ధరించుకోవాలని అనుకుంటోంది. కానీ షేక్ హసీనా విషయం తేల్చాలని కొత్త ప్రభుత్వం అంటోంది. దాంతో భారత్ ఏమి చేస్తుంది అన్నది పెద్ద చర్చగా ఉంది. ఇరాకాటంగానే : భారత్ కి శరణార్ధిగా షేక్ హసీనా వచ్చారు. ఆమెకు ఆశ్రయం ఇచ్చింది భారత్. ఆ సమయంలో బంగ్లా దేశ్ అల్లర్లు తొందరలో సమసిపోయి తిరిగి ఆమె అక్కడికి వెళ్ళి తన పార్టీతో కలసి పాలన చేస్తారు అని భావించారు. కానీ జరిగింది పూర్తి భిన్నం. ఏకంగా అవామీ లీగ్ నే తప్పించేశారు. షేక్ హసీనాకు మరణ శిక్ష విధించారు. ఇపుడు కొత్త ప్రభుత్వంతో సంబంధాలు బాగుండాలీ అంటే హసీనాను అప్పగించాలి. అలా చేయడం భారత్ కి దౌత్యపరంగా మేలు గా ఉండొచ్చు. బంగ్లా పాలకులు కూడా హర్షం వ్యక్తం చేయవచ్చు. రిలేషన్స్ బాగుండొచ్చు కానీ అదే సమయంలో శరణార్ధిగా వచ్చిన ఒక మాజీ ప్రధానిని మహిళా నేతను అప్పగిస్తే అక్కడ ఆమెకు మరణదండన విధిస్తే అది మరో రకంగా ఇబ్బందికరం అవుతుందా అన్న చర్చ కూడా ఉంది. మొత్తానికి దౌత్యపరంగా ఈ వ్యవహారం ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారు అన్నది చూడాల్సి ఉంది.

## తెలుగు కథకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన పాలగుమ్మి - ఫిబ్రవరి 17... పాలగుమ్మి పద్మరాజు వర్ధంతి



తెలుగు కథా సాహిత్యంలో ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు. అయన తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించారు. పాలగుమ్మి పద్మరాజు 2915 జూన్ 24న పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలంలోని తిరుపతిపురంలో జన్మించారు. విద్యాభ్యాసం స్వస్థలంలోనూ, ఇతర ప్రాంతాల లోనూ పూర్తి చేసుకున్న ఆయన 1939వ సంవత్సరం నుండి 1952 వరకు కాకినాడలోని పీ.ఆర్. ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. తన పంతొమ్మిదో యేట నుంచే రచనలు మొదలు పెట్టారు. మొదట ఛందోబద్ధంగా పద్యాలు రాసి తర్వాత వచనంలోకి వచ్చారు. పాలగుమ్మి పద్మరాజు తన సాహిత్య జీవన యానంలో 60 కథలు, ఎనిమిది నవలలు, 30 కవితలు... ఇంకా లెక్కలేనన్ని నాటికలు మరియు నాటకాలను రచించారు. ఆయన రాసిన 60 కథలలో గాలివాన, పడవ ప్రయాణం, ఎదురు చూసిన ముహూర్తం అనే మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. తెలుగు మీద ఎంత పట్టు ఉందో ఇంగ్లిష్ మీద కూడా అంతే అధికారం ఉంది. అందుకే తాను రాసిన కథానికలను తానే ఆంగ్లంలోకి తర్జుమా చేసుకునే వారు. ఆ క్రమంలోనే 1958లో అంతర్జాతీయ కథానికల పోటీలో 'గాలివాన' కథ రాసి పంపితే బహుమతి వచ్చింది. "గాలివాన" తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఈ కథను ప్రపంచం లోని అనేక బాషలలోకి అనువదించారంటే ఆ నవల సాహితీ ప్రపంచంలో ఎంతగా పేరు తెచ్చుకుందో అర్థం అవుతుంది. అయన మొదటి కథ "సుబ్బి". ఎన్నో కథలు రాసినప్పటికీ వాటిలో ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చిన కథ ''గాలివాన'' మాత్రమే. ఈ కథ 1952వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని "హెరాల్డ్ ట్రిబ్యూన్"వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలలో రెండువ బహుమతిని గెలుచుకుంది. ఈ పోటీలకు మొత్తం 23 దేశాల నుంచి 59 కథలు ఎంపిక కాగా, అందులో భారత దేశం నుంచి మూడు కథలు ఎంపికవగా.. అందులో గాలివాన ఒకటి. అలా తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఈయన రాసిన నవలలో బతికిన కాలేజీ, నల్లరేగడి, రామరాజ్యానికి రహదారి, రెండో అశోకుడి మూన్నాళ్ల పాలన మొదలైన రచనలు ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. ఆయన రాసిన కవితలు, పద్యాలు, పాటలు, కథానికలు, నవలలు. రేడియో నాటకాల గురించి అందరికీ తెలిసినా సినిమా రచనల గురించి చాలా మందికి తెలియదు. సినిమా ప్రవేశం కృష్ణశాస్త్రి ద్వారా జరిగింది. నాటికే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సినిమాలకు పాటలు రాస్తున్నారు. బిఎన్‌రెడ్డి సినిమా తీయాలనుకున్న సంగతి తెలిసి పద్మరాజు కు కబురు చేస్తే మద్రాసు వెళ్లారు. 1954వ సంవత్సరంలో ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, తాను వాహినీ పతాకం కింద నిర్మించిన "బంగారు పాప" అనే చిత్రానికి మాటలు రాయమని పద్మరాజును కోరారు. అప్పటి నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక సినిమాలకు కథలు, పాటలు పాలగుమ్మి కలంనుంచి జాలు వారాయి. 'బంగారుపాప' సినిమాలో కోటయ్య పాత్ర ఎస్వి రంగారావుకు చాలా పేరు వచ్చింది. 'ఇటువంటి పాత్ర మళ్లీ నాకు దొరకలేదు' అని ఎన్నోసార్లు చాలామందితో సంబరంగా అనేవారట. ఆ తరవాత 'రంగుల రాట్నం' చిత్రానికి కథ మాటలు రాశారు. ఆ కథకు నంది అవార్డు వచ్చింది. రంగుల రాట్నం నటుడు చంద్రమోహన్ పాత్రకు ప్రాణం పోసి, ఆయనను చిత్ర సీమలో నిలబెట్టింది. తర్వాత భావ నారాయణ తీసిన 'గోపాలుడు భూపాలుడు' జానపద చిత్రానికి కథ, మాటలు అందించారు. మురారి నిర్మాణంలో వచ్చిన 'సీతామాలక్ష్మి' చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. సినిమా అంటే అవగాహన ఉండి పాటలు, మాటలు, కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, సంగీతం,.. అన్ని శాఖల లోనూ పని చేశారు. దేవుడిచ్చిన భర్త, బికారి రాముడు... చిత్రాలకు దర్శకత్వం వహించారు. మొత్తం 30కి పైగా సినిమాలకు పని చేశారు. ఎడిటింగ్, ప్రాసెసింగ్, బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ దాకా అన్నీ చూసి నేర్చుకున్నారు. శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ సినిమాకు పాటలు రాయడానికి కృష్ణశాస్త్రి రావడం కొంచెం ఆలస్యం అయితే పద్మరాజు తో ఒక పాట రాయించారు, అదే 'రాకోయీ అనకోని అతిథి'. అంతకు ముందే 'భక్త ప్రహ్లాద' చిత్రానికి 'జననీ వర దాయనీ భవానీ' అనే గీతం కూడా రచించారు. దాసరిగారితో చాలా సినిమాలు చేశారు. దాసరి, పద్మరాజు ను 'మా గురువుగారు' అనే వారు. దాసరి, పద్మరాజు వద్ద రైటర్‌గా పని చేశారు. దాసరి ఒకేసారి నాలుగైదు సినిమాలు తీయడం వల్ల పద్మరాజు సలహాలను ఎక్కువగా అడిగేవారు. తరువాత భక్త శబరి, బంగారు పంజరం లాంటి అనేక సినిమాలలో పాలగుమ్మి పనిచేసినా... తన సినిమాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, వ్యాపారపరంగా నష్టాలను చవి చూశాయి. పాలగుమ్మి దర్శకుడిగా "బికారి రాముడు" అనే సినిమాను తీసినా అది కూడా విజయవంతం కాలేదు. ఆ తరువాత పాలగుమ్మి నవల "నల్లరేగడి"ని "మాఊరి కథ" అనే పేరుతోనూ, "పడవ ప్రయాణం" అనే కథను "స్త్రీ" పేరు తోనూ సినిమాలు తీశారు. సాహితీ వినీలాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ, ప్రత్యేక గుర్తింపు పొందిన అచ్చ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు 1983 ఫిబ్రవరి 27న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

## ధూమపానం... ఆరోగ్యానికి హానికరం




సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ద్వారా తయారీ వల్ల పొగ విడుదల అవుతున్నందు వలన దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయో గిస్తున్నారు. క్రీస్తు పూర్వం 1400 ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వేడుకల్లో పొగ తాగేవారు. పొగాకు చుట్టల నుంచి వెలువడే ధూమ మేఘాల ద్వారా తమ ప్రార్ధనలు భగవంతుని చేరుకుంటాయని వారు నమ్మేవారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభ మయ్యాక క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారత దేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారత దేశంలో ఎక్కువగా గంజాయి తోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటు లోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఔషధంగా పరిగణించే వారు. సిగరెట్ల కంపెనీలు వైద్యులతో వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే గడిచింది. పొగాకు వల్ల క్యాన్సర్ వంటి అనర్థాలు తలెత్తు తున్నట్లు గుర్తించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. బొలీవియా మరియు పెరూ పొగాకు జన్మస్థలంగా పరిగణించ బడతాయి. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకు రాబడినట్లు, అలా పొగాకు సాగు క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యుఎస్ ఎస్ఆర్ భూభాగంలో, ట్రాన్స్‌కా కాసియా, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, మోల్డోవా, ఉక్రెయిన్, క్రిమియా మరియు క్రాస్నోదర్ భూభాగంలో పెంచడం క్రమానుగతంగా జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పొగ తాగుతున్నారని, ఏటా పొగాకు కారణంగా 70లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ప్రపంచం లోనే అత్యధిక శాతం కిరిబాటి దీవిలో మూడులో రెండొంతుల మంది మగవాళ్లు ధూమపానానికి అలవాటు పడ్డారు. మూడొంతుల మంది ఆడవాళ్లు కూడా పొగ తాగుతున్నారు. యూరప్‌లోని మాంటెనెగ్రో దేశంలో 46శాతం మంది ప్రజలకు పొగతాగే అలవాటుంది. గ్రీస్‌లో 50శాతం మంది మగవాళ్లు, 35శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80శాతం మంది మగవాళ్లు పొగ తాగుతారు. కానీ 6శాతం మంది ఆడవాళ్లకు మాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15ఏళ్లు పైబడిన మగవాళ్లలో 60శాతం మంది పొగ తాగుతున్నారు. 23శాతం మంది మహిళలకు ఆ అలవాటుంది. ఇక తక్కువగా పొగ తాగేవారు ఉండే దేశాలు...ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా... ఈ ఐదు దేశాలూ అతి తక్కువగా పొగ తాగే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఆఫ్రికాలో 14శాతం మంది మాత్రమే పొగ తాగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇటీవలి కాలంలో అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారత దేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును వివిధ రకాలుగా విక్రయిస్తారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం. ఇది ధూమపానం వ్యసనానికి దారితీస్తుంది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరి తిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న కేన్సర్‌లు, గుండె జబ్బులు, నాన్-కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్‌సిడిలు) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తాయి. పొగాకు తాగేవారు శ్వాస సంబంధిత సమస్యలను కలిగి ఉంటారు ఎందుకంటే, పొగాకు ఊపిరి తిత్తులను పూర్తిగా ప్రమాదానికి గురి చేస్తుంది. అంతేకాకుండా, వీరిలో అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు కూడా వస్తుంది.

80% కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానం కారణమని తెలింది. సిగరెట్లలో 70కి పైగా హానికరమైన క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి. కో విడ్ మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో పొగ త్రాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం నేరుగా ఊపిరి తిత్తుల పై ప్రభావం చూపే విషయం వల్ల భయం ప్రధాన కారణం అయితే, లాక్ డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు ఎక్కువ సమయం మూసి ఉండడం, ఇళ్లనుండి బయటికి వెళ్ళలేక పోవడం ధూమపానానికి ప్రతిబంధకాలుగా మారడం పొగాకు వాడకం తగ్గడానికి కొన్ని కారణాలు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

## భారత సాయుధ తిరుగుబాటు పితామహుడు ఫడ్కే - ఫిబ్రవరి 17...వాసుదేవ బల్వంత ఫడ్కే వర్ధంతి



వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే.. దేశంలో చాలా మందికి తెలియని, విని ఉండని పేరు. ఆ త్యాగ ధనుని గురించి చరిత్ర పుస్తకాలలో కూడా ఎక్కడా కనిపించదు. భారత దేశంలో సాయుధ తిరుగుబాటుకు బీజం వేసిన వ్యక్తి ఆయనే అని, తొలి దేశద్రోహం కేసు నమోదు కాబడింది ఆ ఉద్యమ కారుని మీదే అన్న విషయం తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఆంగ్లేయుల దురాగతాలను ఎదిరించి, శ్వేత జాతీయులపై తుపాకీ ఎక్కుబెట్టిన వీరుడు. బల ప్రయోగం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుండి తరిమి వేయాలని తీర్మానించి, అమలులో ప్రాణాలు అర్పించిన వీర యోధు డు. శక్తివంతమైన బ్రిటిష్ సామ్రా జ్యాన్ని ఒంటిచేత్తో ఎదిరించి, సాయుధ తిరుగు బాటును రేకెత్తిం చి, భారత్‌లో బ్రిటిష్ అధికారాన్ని నాశనం చేసి హిందూ రాజ్యాన్ని పునః స్థాపిస్తా నని ప్రతిజ్ఞ చేసిన మేరు నగ ధీరుడు. 1879 అక్టోబర్ 22న ఆంగ్ల ప్రభుత్వం మొదటి రాజద్రోహ నేరం మోపబడింది ఈ వీరుడి పైనే కావడం గమనార్హం. వాసుదేవ బల్వంత ఫడ్కే (4 నవం బర్ 1845 -- 17 ఫిబ్రవరి 1883) బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయ స్వాతంత్ర్య సమర యోధుడు. ఫడ్కే 1845 నవంబర్ 4న ప్రస్తుతం మహారాష్ట్ర లోని రాయ్‌గఢ్ జిల్లాలో ఉన్న పన్వెల్ తాలూకాలోని షిర్ధోన్ గ్రామంలో మరాఠీ చిత్పవన్ బ్రాహ్మణ రైతుకుటుంబంలో కుటుంబంలో జన్మించిన వాసుదేవ్, ప్రాథమిక విద్య తన గ్రామమైన షిర్డోన్ లోనే పూర్తి చేశాడు. హైస్కూల్ విద్యకు పూనాకు వెళ్ళగా ఆంగ్లేయులకు వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడు తున్నాడని 9 వ తరగతి లో బడి నుండి బయటకు పంపారు. పుణే నగరం చేరుకుని మిలటరీ అక్కౌంట్స్ డిపార్టుమెంటులో గుమాస్తాగా 15 సంవత్సరాల పాటు పని చేశాడు. సొంత గడ్డపై వ్యవసాయం చేస్తూ, రైతులపై అధిక పన్నులు విధిస్తున్న ఆంగ్లేయు లకు ఎదురు తిరిగాడు. వలస పాలన నుండి భారత స్వాతంత్ర్యం పొందే లక్ష్యంతో కోలి, బిల్లు, దంగర్ ఆదిగా సుమారు 300 మంది ఆదివాసీ యువకుల సహాయంతో 'రామోషి' అనే విప్లవ తిరుగుబాటు బృందాన్ని రూపొందించి, వారికి యుద్ధ విద్యలపై శిక్షణ నిర్వహిం చాడు. వాసుదేవ్ మొదట ప్రభుత్వ ఖజా నాలపై దాడి చేయడం మొదలు పెట్టాడు. అలా కొల్లగొట్టిన డబ్బును రైతులకు, ఆదివాసీలకు పంచే వాడు. ఆయుధాలు సమకూర్చు కొనేవాడు. బ్రిటీష్ సైనికులపై హఠాత్తుగా జరిపిన గెరిల్లా దాడుల వల్ల ఏకంగా పుణె నగరం పైనే ఫడ్కే పట్టు సాధించి, పూనాలో బలవంతు డైన తిరుగుబాటు నాయకుడైనాడు. దానితో ఆంగ్లే యులు పెద్దసైన్యం పంపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకకాలంలో అనేక దాడులను నిర్వహించడానికి వాసుదేవ బల్వంత ఫడ్కే ప్రణాళికలు రచించినా పరిమిత విజయాన్నే అందించాయి. ఒకసారి ఘనూరు గ్రామంలో సైన్యంతో నేరుగా తలప డ్డాడు. వాసుదేవ్ ను పట్టుకుంటే బ్రిటిష్ ప్రభుత్వం బహుమానం ప్రకటిస్తే... బొంబాయి గవర్నర్‌ను పట్టుకున్నందుకు ఫడ్కే ఎదురు బహుమానం ప్రకటించాడు. ప్రతి యూరోపియన్‌ని చంపినందుకు బహుమతిని ప్రకటించాడు. కొన్ని రోజులు పూనాను వదిలి హైదరాబాద్ కు వచ్చాడు. అప్పుడు హైదరాబాద్ పై రోహిల్లాల తిరుగు బాటు జరుగుతున్నది. వాసుదేవ్ వారితో జత కట్టి నిజాంపై తిరుగుబాటు చేసాడు. రోహిల్లా లతో పాటు అరబ్బులు కూడా ఆయనతో చేతులు కలపారు. కాని ఆంగ్లేయుల గూఢ చారులు వాసుదేవ్ ఆచూకీ తెలుసు కున్నారు. బ్రిటిష్ మేజర్ హెన్రీ విలియం డేనియల్, హైదరాబాద్ నిజాం పోలీసు కమిషనర్ అబ్దుల్ హక్ తదతరులు అవిశ్రాంతంగా ఆయన అచూకి కోసం వెతికారు. 20 జూలై 1879న పండార్‌పూర్ వెళ్తున్న పుడు కలడ్గి జిల్లాలో జరిగిన తీవ్రమైన పోరాటంలో వాసుదేవ్ ను ఒక దేవాలయంలో బంధించారు. ఫడ్కేని విచారణ నిమిత్తం పూణేకు తీసుకెళ్లారు. సర్వజనిక్ కాకా అని పిలువబడే గణేష్ వాసుదేవ్ జోషి ఆయన కేసును వాదించాడు. ఫడ్కేకి జీవిత ఖైదు విధించారు. ఆయన భారత్‌లో ఉంటే ప్రమాద కరమని గ్రహించి, జీవితాంతం ఏడెన్‌లోని జైలుకు తరలించారు. అతనికి సంకెళ్లు వేసి ఏకాంత నిర్బంధంలో ఉంచారు. అక్కడ 13 ఫిబ్రవరి 1883న జైలు నుండి అతను తప్పించుకున్నా మళ్ళీ వెంటనే తిరిగి స్వాధీనం చేసు కున్నారు బ్రిటీష్ పోలీసులు. అప్పటి నుంచి నిరహార దీక్ష చేస్తూ 17 ఫిబ్రవరి 1883న వాసుదేవ బల్వంత ఫడ్కే తుది శ్వాస విడిచాడు. ఫడ్కే భారత సాయుధ తిరుగు బాటు పితామహుడిగా పేరు పొందాడు. స్వతంత్ర ఉద్యమంలో సహ సభ్యులకు స్ఫూర్తిని అందించాడు. ఈ సమయంలో ఆయన కార్య కలాపాలను బంకిం చంద్ర చటో పాధ్యాయ్ రచించిన దేశభక్తి నవల ఆనంద్ మఠ్ లో పొందు పరిచారు. కానీ అప్పటి బ్రిటీష్ వలస ప్రభుత్వం దీన్ని ఆమోదించ లేదు. అందుకని ఈ అంశాలు తొలగించి పుస్తకాన్ని కుదించి ముద్రించాల్సి వచ్చింది. 1984 లో, భారతీయ పోస్టల్ సర్వీస్ ఫడ్కే గౌరవార్థం 50 పైసల స్టాంపును విడుదల చేసింది. ఆయన గౌరవార్థం దక్షిణ ముంబై లోని మెట్రో సినిమా సమీపంలో ఒక చౌక్ పేరు పెట్టారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు



# కొవ్వూరు నుంచి ఖమ్మానికి

ఖమ్మం : ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు గోదావరి రేవు నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కొవ్వూరు నుంచి దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి మీదుగా భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట నుంచి ఈ ఇసుక సత్తుపల్లి, వైరా, ఖమ్మం ప్రాంతాలకు చేరుతోంది. పెద్ద ఎత్తున టిప్పర్లు, 20 టైర్ల లారీల్లో పగలు, రాత్రి తేడా లేకుండా దందా నడుస్తోంది. ఏపీలో నామమాత్ర ధరకు దొరుకుతున్న ఇసుకను ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడక్కడా పోలీస్, రెవెన్యూ, అటవీ అధికారులు కేసులు నమోదుచేస్తున్నా.. ఎక్కువ శాతం పైరవీలతో ముందుకు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. పట్టుబడిన ఇసుక లారీకి రూ.లక్ష జరిమానా విధిస్తుండగా, వాటిని చెల్లించి, ఇసుక వదిలేసి లారీలను తీసుకెళ్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పెద్దఎత్తున భవన నిర్మాణాలు సాగుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లకూ భారీగా ఇసుక అవసరం ఏర్పడింది. స్థానికంగా ఉన్న వాగులు, వంకల్లోని రీచ్‌ల నుంచి ఉచితంగా తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. అశ్వారావుపేట, సతుపల్లి నియోజకవర్గాల్లోని అధిక శాతం ఇసుక రీచ్‌లు లేవు. అక్కడ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇసుక కొరతను ఎదుర్కొంటున్నారు. మైనింగ్ అభివృద్ధి సంస్థ ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఇసుక బజార్‌లు ఏర్పాటు చేసినా అవసరానికి తగినంత అందించలేకపోతున్నారు. అందుకే ఏపీ నుంచి అక్రమంగా రవాణా అవుతున్న ఇసుకను లబ్ధిదారులు కొంటున్నారు. స్థానిక రీచ్‌ల్లో నాణ్యత తక్కువైనా టన్ను రూ.1,200 చెల్లించాల్సి వస్తుంది. అదే ఏపీ నుంచి వచ్చేదానికి టన్ను



రూ.600 నుంచి రూ.800కే దొరుకుతుంది.

**ముఠా నీడన..**

ఇసుక రవాణా వెనుక ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు చెందిన పెద్ద ముఠా చక్రం తిప్పుతుంది. ఏపీలోని ఇసుక రేవు నుంచి ఖమ్మం వరకు సుమారు 200 కిలోమీటర్ల పొడవునా.. గ్రామాల్లో, పట్టణాల్లో దళారులను ఏర్పాటు చేసుకుని దందా సాగిస్తున్నారు. టిప్పర్లు, లారీల ముందు, వెనుకా ఎస్కార్ట్‌గా కార్లలో ఈ ముఠా వ్యక్తులు తిరుగుతుంటారు. ఎక్కడైనా లారీలను అడ్డగిస్తే సామదాన భేద దండోపాయాలతో విడిపించి తీసుకెళ్తున్నారు. ఈ ముఠాకు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఖమ్మం జిల్లాలోకి అక్రమంగా ప్రవేశించే ఇసుకను రెవెన్యూ, పోలీస్, అటవీ అధికారులు నిలువరిస్తున్నారు. ఇటీవల ఆ ప్రభావం తగ్గింది. ప్రతి నియోజకవర్గంలో ఇసుక బజార్లు ఏర్పాటుచేశాం. అందరికీ ఇసుకను అందుబాటులో ఉంచుతున్నాం.

సాయినాథ్, మైనింగ్ ఏడీ, ఖమ్మం

# పూడిక తీస్తే.. జలసిరి

చర్ల: తాలిపేరు మధ్యతరహా జలాశయంలో పూడిక మట్టి తొలగిస్తే నిల్వ సామర్థ్యం పెరగనుంది. ప్రాజెక్టు నిర్మించి నప్పటి నుంచి రిజర్వాయర్‌లో పేరుకున్న మట్టిని తొలగించలేదు. సాంకేతికంగా అలా చేయాల్సిన అవసరం లేకున్నా.. తవ్వకాలు మరింత నీటి నిల్వలకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు. మధ్యతరహా ప్రాజెక్టుల్లో అత్యధిక క్యాచ్‌మెంట్ ఏరియా కలిగిన వాటిలో తాలిపేరు ఒకటి. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్‌లో 1,234 మైళ్ల మేర పరీవాహకం దీని సొంతం నిల్వ సామర్థ్యం కేవలం 0.5 టీఎంసీ మాత్రమే. ఖరీఫ్‌లో వచ్చిన నీటిని వచ్చినట్లే కాల్వల ద్వారా విడుదల చేస్తున్నారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో 24,700 ఎకరాల స్థిరీకరణ ఆయకట్టు ఉంది. ఐదు దశాబ్దాలుగా పేరుకుపోయిన మట్టిని తొలగించలేదు. నీటి సామర్థ్యం తగ్గి యాసంగిలో సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి.

**బహుళ ప్రయోజనాలు**

జలాశయం సిల్ లెవల్ 69 మీటర్లు కావటంతో అంతకన్నా లోతు తవ్వినా ప్రయోజనం ఉండదు. ఎగువ నుంచి కొట్టుకొచ్చిన మట్టి దాదాపు గేట్ల ద్వారా వెళ్లిపోతుంది. జలాశయం ప్రధాన ఎడమ, కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్ల వైపుగా చేరుకున్న మట్టిని తొలగిస్తే మేలు జరుగుతుంది. జలాశయంలో ద్వీపకల్పంలా ఉన్న మట్టిని తొలగిస్తే మరింత నీటి సామర్థ్యం పెరుగుతుంది. ఇలా చేస్తే దాదాపు 0.14 టీఎంసీల మేర నీటి సామర్థ్యం పెరుగుతుందని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. లోతు పెరిగి బోటింగ్ సౌకర్యానికి మార్గం



సుగమమవుతుంది. పర్యాటక కేంద్రంగా మారుతుంది. చేపల పెంపకానికి మరింత అనువుగా మారుతుంది.

ప్రధాన కాల్వలపై స్ట్రక్చర్ల నిర్మాణ పనులతో పాటు మరమ్మతులు జరగనున్నాయి. యాసంగి సాగుకు రైతులు విరామం పలికారు. జలాశయంలో నీరు ఉండదు. గ్రావెల్, మట్టి తవ్వకాలకు అవకాశం ఏర్పడుతుంది.రెండేళ్ల క్రితం జలాశయం నుంచి 40 లక్షల ఘనపు మీటర్ల మేర మట్టి, గ్రావెల్ తీయాలని ప్రతిపాదించారు. తీరా సీతమ్మ ప్రాజెక్టు పనులు నిలిచిపోవటంతో కార్యరూపం దాల్చలేదు. ప్రాజెక్టు పనుల కోసం వేచి చూసే బదులు మట్టి తొలగింపునకు నిధులు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

లైవ్ కెపాసిటీ 0.50 టీఎంసీ

ఎఫ్‌ఆర్‌ఎల్: 74 మీటర్లు

ఉపయోగించుకోవాల్సిన నీటి సామర్థ్యం: 5 టీఎంసీలు

వాడుకుంటున్న నీళ్లు: 2.50 టీఎంసీలు

# రోడ్డు పక్క ఇళ్లు.. గుండె గుబిల్లు



మామడ : జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న ఇళ్లపైకి ఈ మధ్యకాలంలో లారీలు దూసుకెళ్తున్నాయి. అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగకపోయినా ఆ దృశ్యాలను చూస్తే ఆందోళనకరంగా ఉన్నాయి.గత నెల 22న నర్సాపూర్(జి) మండలం రాంపూర్ గ్రామంలో జాతీయ రహదారి 61పై రాత్రి పూట లారీ వేగంగా వచ్చి ఓ ఇంటి ప్రహరీలోకి దూసుకొచ్చింది. ఇళ్లంతా పగుళ్లు తేలింది. చక్కగా ఉన్న నిర్మాణం శిథిలమైంది. నిద్రలో ఉన్న కుటుంబ సభ్యులపై ఇటుకలు పడి గాయాలపాలయ్యారు.

ఈ నెల 6న రాత్రి అదే గ్రామంలో మరో ఇంటిని లారీ ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఇల్లంతా పగుళ్లు బారింది. మెట్లు కూలిపోయాయి. త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది.

జాతీయ రహదారిపై నిర్మల్ మండలం కొండాపూర్ సమీపంలో ఓ లారీ అతివేగంగా వెళ్తూ అదుపు తప్పి కింద ఉన్న సర్వీసు రోడ్డుపై పడింది. రాత్రి సమయం కావడంతో ఆ దారిలో ఎవరూ లేనందున పెద్ద ప్రమాదం తప్పింది. తాజాగా జాతీయ రహదారి 44 పక్కన సోన్ మండలం గంజాల్ గ్రామం వద్ద పెద్ద లారీ రోడ్డు మీద నుంచి పది అడుగులు కిందకు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఓ ఇంటి శౌచాలయం ధ్వంసమైంది. ఇంకో నివాసం ప్రహరీ, విద్యుత్తు స్తంభం, రేకుల షెడ్డు కూలింది.

**అతి వేగం, నిద్ర మత్తు..**

ఈ ప్రమాదాలు ఎక్కువగా రాత్రిపూట జరుగుతున్నాయి. దూరప్రాంతాలనుంచి వచ్చే వాహనాల చోదకులు విశ్రాంతి తీసుకోకుండా రాత్రి ఎక్కువ దూరం ప్రయాణం చేస్తుండడంతో నిద్ర మత్తులో ప్రమాదాలకు కారకులవుతున్నట్లు తెలుస్తోంది. అతి వేగంగా వెళ్తూ అకస్మాత్తుగా రహదారిపై ఏమైనా అడ్డుగా ఉన్న విషయాన్ని గమనించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

**చోదకుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు..**

మహేందర్, ఎంవీఐ

సుదూర ప్రాంతం నుంచి వస్తున్న వాహనచోదకులు నిరంతరం వాహనాలను నడపడంతో ఏకాగ్రత కోల్పోతారు. రెప్పపాటు నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతాయి. ఇలాంటి వాహనాలకు ఇద్దరు చోదకులను ఏర్పాటు చేసుకోవాలి. రోడ్డు వాహన నిబంధనలపై అవగాహక కల్పిస్తున్నాం.

**రెయిలింగ్ లేకుంటే ఇబ్బందే..**

తరచూ ప్రమాదాలు జరుగుతున్న జాతీయ రహదారి 61 మీద గ్రామాల సమీపంలో రెయిలింగ్ పెట్టాల్సిన అవసరముంది. ఈ దారిలో మూలమలుపులు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనాలు తక్కువ వేగంతో వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలి.

# పసుపు బంగారం మెరిసె..



నిజామాబాద్ : సీజన్‌లో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు పసుపు పోటెత్తుతుంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఆదిలాబాద్, నిర్మల్, కరీంనగర్‌తో పాటు మహారాష్ట్రలోని సరిహద్దు జిల్లాల నుంచి రైతులు పసుపును విక్రయానికి తీసుకొస్తుంటారు. మున్సిపల్ ఎన్నికల కారణంగా ఈనెల 10, 11వ తేదీల్లో యార్డును బంద్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం 36,000 బస్తాల పంటను తీసుకురావటంతో యార్డు పసుపుమయమైంది. ఈ సీజన్‌లో 5600 కుప్పల్లో సరకు అమ్మకానికి పెట్టడం ఇదే ప్రథమం. వచ్చే సోమవారం తర్వాత పంట మరింత వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ధరలు ఆశాజనకం:** గతేడాది ఫిబ్రవరి 9వ తేదీ వరకు మార్కెట్‌కు 56,676 క్వింటాళ్ల పసుపు వచ్చింది. ధర అత్యధికంగా రూ.13347 పలికింది. ఈ ఏడాది అదే వ్యవధిలోపు 42,723 క్వింటాళ్ల పంట వచ్చింది. గతేడాదితో పోల్చితే ఇది తక్కువ. మార్కెట్‌కు వరుస సెలవులు రావడమే దీనికి కారణం. కానీ ధర మాత్రం అత్యధికంగా రూ.15 వేల వరకు పలకడం విశేషం.

**అక్కడే నాణ్యత పరీక్షిస్తూ..:** మంచి ధర రావాలంటే తేమ 13 శాతం లోపే ఉండాలి. అధికారులు ఈ విషయంపై ప్రచారం చేస్తున్నారు. కానీ, వంద మందిలో ఒకరిద్దరు మాత్రమే నాణ్యత కచ్చిత స్థాయిలో ఉండేలా ఎండబెట్టుకుని తీసుకొస్తున్నారు. మిగతా వారికి గిట్టుబాటు ధర దక్కే అవకాశాలు తక్కువ. పంటను వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత కేంద్రంలో పరీక్షిస్తున్నారు. 90 శాతం సరకు 20 శాతంగా తేమ ఉంటోంది. కర్క్యుమిన్ (రంగు, నాణ్యతా ప్రమాణం) 2.5 శాతం లోపే ఉంటోంది. ఇది 7 శాతం ఉంటే మెరుగైన ధర లభిస్తుంది.

పసుపు రైతులకు మార్కెట్‌లో ఏ ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వారు సేదతీరడానికి 93 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందిరా మహిళ పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో క్యాంటీన్ అందుబాటులో ఉంది. అల్పాహారం, భోజనం ఇక్కడ ఉంటుంది. ఎవరైనా అస్వస్థతకు గురైతే చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంటి వద్దే తగిన తేమ వచ్చే వరకు పంట ఎండబెట్టాలని కోరుతున్నాం. దీనివల్ల సమయం ఆదా, మంచి ధర లభిస్తాయి. **అపర్ణ, జిల్లా మార్కెట్ అధికారిణి**

# కోర్సులు పదుల్లో.. ఉపాధి ఎందరికో..



డిచ్‌పల్లి : పదులు, వందల సంఖ్యలో కాదు.. వేల సంఖ్యలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ అండగా నిలుస్తోంది 2014లో డిచ్‌పల్లిలో ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ. గత 12 ఏళ్లల్లో 9749 మంది నిరుద్యోగులు ఇక్కడ వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందారు. వీరిలో 7238 మంది ఉపాధి పొందుతూ జీవితంలో స్థిరపడ్డారు. ఈ సంస్థ చేయూతతో పేద కుటుంబాల్లోని 4038 మంది యువత స్వయం ఉపాధి పొంది ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

**బ్యాంకు ద్వారా రుణం..**

ఏటా గ్రామాల్లో వందకు పైగా చైతన్య సభలు నిర్వహిస్తున్నారు. సంస్థలో శిక్షణ పొంది జీవితంలో స్థిరపడిన వారితో తమ అనుభవాలను తెలియజేస్తూ నిరుద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. సంస్థ డైరెక్టర్ ఎం.రవికుమార్, ఫ్యాకల్టీ రామకృష్ణ, భాగ్యలక్ష్మి శిక్షణ తరగతుల నిర్వహణ బాధ్యతలను చూస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు వివిధ బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు 2501 మంది రుణాలు పొందారు.పురుషులకు..

కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ అండ్ శానిటరీ, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మరమ్మతులు, గొర్రెల పెంపకం, పాడి పరిశ్రమ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు.

శిక్షణలో చేరాలంటే..

ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 19 నుంచి 45 ఏళ్లు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు, మహిళల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, పాన్, విద్యార్హత ధ్రువపత్రం(పది పాస్/ఫెయిల్), ఆరు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జతచేయాల్సి ఉంటుంది. మిగిలిన వివరాలకు ఫోన్ నెంబర్ 08461–295428లో సంప్రదించవచ్చు.


యువతులు, మహిళలకు..

బ్యూటీపార్లర్, కుట్టు, జ్యూట్, పేపర్ బ్యాగులు, అగరుబత్తుల తయారీ, ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, పాడి పరిశ్రమ, కరాటే, కంప్యూటర్ శిక్షణతోపాటు జీవితంలో స్థిరపడేందుకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.మూడేళ్లు పర్యవేక్షిస్తాం.. – రవికుమార్, ఎస్‌బీఐ శిక్షణ సంస్థ డైరెక్టర్ప్రభుత్వ ఆదేశం మేరకు ఏటా లక్ష్యానికి మించి యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. కోర్సు నేర్చుకోవడానికి వచ్చిన వారికి ఉచిత వసతితో పాటు భోజనం, టూల్స్‌కిట్స్ అందిస్తాం. ఇక్కడ శిక్షణ పొందిన వారి పనితీరును మూడేళ్లపాటు పరిశీలిస్తాం. ఒక్కో బ్యాచ్ శిక్షణకు రూ.4.50 లక్షలకు పైగా వెచ్చిస్తున్నాం. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

# వంద ఎకరాల ఆక్రమణ!

జడ్చర్ల : రెండు జాతీయ రహదారులు వెళ్తున్న జడ్చర్ల పట్టణ పరిసరాల్లో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. పట్టణ శివారులోని సర్వే నెం. 102, 117లో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొంతం చేసుకున్నారు. ఆ భూముల్లో వెంచర్లు, నిర్మాణాలు వెలిసినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు గత నెల 29న జడ్చర్ల తహసీల్దారు నర్సింగ్‌రావు బాధ్యులకు తాఖీదులు జారీ చేశారు. 10 ఏళ్ల క్రితం ఇలాగే నోటీసులు ఇస్తున్నా.. రాజకీయ ఒత్తిడితో చర్యలు తీసుకోలేదు. ఇప్పుడైనా ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటారో లేదో చూడాలి.

రెండు సర్వే నంబర్లలో..: జడ్చర్ల మండలం బురెడ్డిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 102లో 201 ఎకరాల భూమి ఉంది. ఇందులో 60 ఎకరాలు ప్రభుత్వ భూమి. మిగతాది పట్టా. నంబర్ 117లో 63 ఎకరాలు ఉండగా.. 10 ఎకరాలు మాత్రమే పట్టా. వీటి హద్దులు 44వ జాతీయ రహదారి, బురెడ్డిపల్లి శివారు, మల్లెబోయినపల్లి శివారు, 167వ జాతీయ రహదారి పక్కన నక్కలబండతండాను ఆనుకొని ఉ



న్నాయి.

ప్రైవేటుపరం: 2011 వరకు ఎలాంటి కబ్జాలు జరగలేదు. తర్వాత రియల్ ఎస్టేట్ పుంజుకోవడంతో భూముల విలువ రూ.కోట్లలో పెరిగింది. వ్యాపారులు తప్పుడు ఎన్‌వోసీలు సృష్టించి సమర్పిస్తే జిల్లా అధికారులు రిజిస్ట్రేషన్‌లు చేశారు. దాదాపు వంద ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళ్లింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి సారించింది. రెండు వారాల్లో వివరాలు సమర్పించాలని ఆదేశించింది.

చర్యలు తప్పవు..: ప్రభుత్వ భూములు చేతులు మారినట్లు తెలిసింది. రెండు సర్వే నంబర్లలో పట్టాదారులకు తాఖీదులు జారీ చేశాం. ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

నర్సింగ్‌రావు, తహసీల్దారు, జడ్చర్ల

# వాగులకు నాలా సొబగులు

కార్పొరేషన్ : నిత్యం దుర్గంధం వెదజల్లుతూ.. చెత్తాచెదారంతో కాలుష్య కారకంగా మారిన అంతర్గత వాగులు ఇకపై సిమెంటు నాలాలుగా రూపాంతరం చెందనున్నాయి. అమృత్ 2.0 పథకం నిధులు రూ.80 కోట్ల వ్యయంతో నగరం చుట్టూ విస్తరించిన ఈ వాగులను సీసీ నాలాలుగా మార్చేందుకు ప్రజారోగ్యశాఖ సిద్ధమైంది. ఈ ఆరు వాగులను విస్తరించి.. సీసీ నాలాలుగా మారిస్తే ముంపుముప్పు తప్పుతుందని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే చిక్కుడువాగు పనులు ప్రారంభమైనా.. ఆక్రమణదారులు అక్కడక్కడ అడ్డుకుంటుండటంతో ముందుకు సాగడం లేదు.

**ఎక్కడెక్కడ ఇబ్బందులంటే? :** నగరంలో అంతర్భగంగా ఉన్న పెద్దచెరువు, ఇమాంసాబ్‌కుంట, ఎర్రకుంట, కొత్త చెరువులు 25 ఎకరాల పైగానే ఎఫ్‌టీఎల్‌తో విస్తరించి ఉన్నాయి. వీటికి నీటిపారుదల శాఖ నిబంధనల ప్రకారం 9 మీ. వెడల్పుతో వాగులు విస్తరించి ఉన్నాయి. వీటికి ఇరువైపులా 30 మీ. వరకు బఫర్‌జోన్ ఉంది. గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో చిక్కుడు వాగు, ఇమాంసాబ్ వాగు, కొత్తచెరువు వాగు, ఎర్రకుంట వాగులను అక్రమార్కులు ఆక్రమించడంతో పిల్ల కాల్వలుగా మారిపోయాయి. దీంతో చిన్నపాటి వర్షాలకే వాగులు పొంగి కాలనీలు నీట మునుగుతున్నాయి. ప్రస్తుతం నగరంలో రూ.601 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. అంతకుముందే ఈ వాగులను సీసీ నాలాలుగా మార్చి.. భూగర్భ డ్రైనేజీని వీటితో అనుసంధానం చేస్తారు. ఈ పనులను పలుచోట్ల ఆక్రమణదారులు అడ్డుకుంటుండటంతో ప్రజారోగ్యశాఖ ఇంజినీర్లు, గుత్తేదారులు తలలు పట్టుకుంటున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టి సారించి రెవెన్యూ, నీటిపారుదల, టౌన్‌ప్లానింగ్ అధికారుల సాయంతో ఆక్రమణదారులపై దృష్టి సారిస్తే తప్ప.. పనులు వేగంగా ముందకు కదిలే పరిస్థితి లేదు.

**అభివృద్ధి చేయనున్న నాలాలు ఇవే..**

మౌలాలిగుట్టకు వెళ్లే మార్గంలో ఉన్న ఆర్వోబీ మొదలు లక్ష్మీనగర్, శ్రీనివాసకాలనీ మీదుగా పాలకొండ పెద్దచెరువుతో అనుసంధానమైన చిక్కుడువాగు పెద్దచెరువు రామయ్యబౌలి అలుగు మొదలు మేకలబండ, శివశక్తి నగర్, పాతపాలమూరు వంతెన మీదుగా ఇమాంసాబ్ కుంట వరకు అనుసంధానమైన ఇమాంసాబ్ వాగు

పెద్దచెరువు ఉన్న శేషాద్రినగర్ అలుగు మొదలు బీకేరెడ్డి, బీఎన్‌రెడ్డి కాలనీ, నాగేంద్రనగర్, ఫాతిమా స్కూల్, అయోధ్యనగర్ మీదుగా బైపాస్ దిగువన హస్నాపూర్ చెరువుకు అనుసంధానమైన హస్నాపూర్ వాగు ఇండస్ట్రీయల్ ఏరియా నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, జగదాంబ కాలనీ, నలంద ఆటోస్టాండు, షాషాబ్‌గుట్ట, మర్లు, ఎంప్లాయీస్ కాలనీ, దొంగలకుంట మీదుగా బైపాస్ నుంచి వెళ్లే పాలకొండతండా వాగు

కొత్తచెరువు అలుగు మొదలు మదుగునగర్, ఖలీల్‌చౌక్, టీడీగుట్ట, మొండిగేరి, పాతతోట, కిద్వాయిపేట, వేపూరిగేరి మీదుగా కొత్తచెరువుతో అనుసంధానమై ఉన్న కొత్తచెరువు వాగు

ఎర్రకుంట మొదలు వల్లభ్‌నగర్, గణేశ్ నగర్, రాయచూర్ రోడ్డు, మద్దూస్‌నగర్, పాతపాలమూరు మీదుగా ఇమాంసాబ్‌కుంట వరకు ఉన్న ఎర్రకుంట వాగు

# పర్యాటకానికి పడని అడుగులు

శ్రీరంగాపురం: ఉమ్మడి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో వనపర్తి జిల్లా శ్రీరంగాపురం శ్రీరంగనాయక దేవస్థానం ఒకటి. శిల్ప సంపదకు పుట్టినిల్లు. ఈ ఆలయాన్ని సందర్శించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా.. మౌలిక వసతులు కల్పించడం లేదు. ఆలయం పరిసరాలు, చెరువును పర్యాటక ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించింది. కానీ, అభివృద్ధి చేయడానికి అడుగులు పడటం లేదు.

నిలిచిన పనులు: ఆలయ సమీపంలో రూ.కోటి వెచ్చించి గతంలోనే అతిథి గృహం నిర్మించారు. నిరుపయోగంగా వదిలేశారు. దీని అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించినా ముందుకు సాగడం లేదు. పూర్తి చేసి అతిథి గృహాన్ని అందుబాటులోకి తెస్తే పర్యాటకులు, భక్తులకు ఉపయోగపడుతుంది.

మినీట్యాంక్ బండ్ నిర్మాణమెప్పుడో?: ఆలయం చుట్టూ 1.87 టీఎంసీల సామర్థ్యం గల రంగసముద్రం జలాశయం ఉంది. దాదాపు 3 కి.మీ. ఆనకట్టతోపాటు ఆలయానికి మూడు వైపుల నీరుంటుంది. కట్ట వెంట విద్యుద్దీపాలు, కూర్చోవడానికి బెంచీలు, మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తే మరింత ఆకర్షణీయంగా ఉంటుందని పర్యాటకులు అభిప్రాయపడుతున్నారు. ఇలా చేస్తే పలువురికి ఉపాధితో పాటు ఆలయానికి ఆదాయం పెరుగుతుంది.

సందర్శకుల నిరాశ జలాశయంలో బోటింగ్ సౌకర్యం లేకపోవడంతో దర్శనానికి వచ్చే పర్యాటకులు, భక్తులు నిరాశ చెందుతున్నారు. మూడేళ్ల కిందట టూరిజం శాఖ ప్రారంభించిన బోటింగ్ మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. కొన్ని రోజులకే బోటును వారు తీసుకెళ్లారు.

# అన్వేషణ.. ఆలంబన

జగిత్యాల : వ్యవసాయ కళాశాలలో అధ్యాపకులుగా పని చేస్తూనే సాగులో ఆధునిక సాంకేతికత వినియోగంపై దృష్టి సారించారు.. సగటు దిగుబడులు పెంచే మార్గాలను అన్వేషించడం ద్వారా అన్నదాతకు అండగా నిలిచారు.. వారి పరిశోధనలకు విశ్వవిద్యాలయ గుర్తింపు దక్కింది.. పొలాస వ్యవసాయ కళాశాలలో టీచింగ్ అసోసియేటసగా పని చేస్తున్న ముగ్గురు, గతంలో ఇక్కడ సహాయ ఆచార్యుడిగా పని చేసిన మరొకరు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఇటీవల పీహెచ్డీ పట్టాలు పొందారు. పరిశోధన అంశాలు, సాగులో రైతులకు ఉపకరించే విధానాలపై ప్రత్యేక కథనం.

**కృత్రిమ మేధతో సౌరశక్తి వినియోగం**

కోరుట్లకు చెందిన కె.భవిత పొలాస వ్యవసాయ కళాశాలలో టీచింగ్ అసోసియేట్గా పని చేస్తూ అగ్రానమీలో పీజీ, పీహెచ్డీ పూర్తి చేశారు. ఖర్చుతో కూడిన సాధారణ విద్యుత్తు వాడకాన్ని తగ్గించడం, అధిక నీటి తడులతో పంటల్లో వస్తున్న వ్యతిరేక ఫలితాలను తగ్గించడాన్ని ఆమె పరిశోధన అంశాలుగా ఎంచుకున్నారు. సౌరశక్తి పంపుసెట్ను ఏఐ ద్వారా షెడ్యూలింగ్ చేసి మిరప పంటకు అదనులో, తగిన మోతాదులో బిందుసేద్యం విధానంలో నీటిని అందించినపుడు సగటు దిగుబడులు గణనీయంగా పెరిగినట్లు గుర్తించారు.

**వాణిజ్య పంటలకు పోషకాల వినిమయం** సైదాపూర్ మండలం బొమ్మకల్కు చెందిన బి.రాణి జగిత్యాల వ్యవసాయ కళాశాలలో 2010 నుంచి 2014 వరకు డిగ్రీ చదివారు. రాజేంద్రనగర్లో సాయిల్ సైన్స్లో పీజీ, పీహెచ్డీ పూర్తి చేసి ప్రస్తుతం జగిత్యాల కళాశాలలో టీచింగ్ అసోసియేట్గా పని చేస్తున్నారు. మిరప, పుచ్చ సాగులో సూక్ష్మ సేద్యం విధానంలో పోషకాలను(ఫర్టిగేషన్) అందించడంపై పరిశోధనలు జరిపారు. ఈ పద్ధతిలో ఎరువుల వృథా 35 శాతం తగ్గడం, సగటు దిగుబడులు 20 శాతం పెరగడం విశేషం. ఈ విధానాలను రైతుల క్షేత్రాలకు విస్తరించడాన్ని వర్సిటీ గుర్తించిం దన్నారు.

**పీఎస్బీ వినియోగంతో భాస్వరం కరిగించేలా..**

కరీంనగర్కు చెందిన కల్వల శేఖర్ పొలాస వ్యవసాయ కళాశాలలో సేద్య విభాగం అధ్యాపకుడిగా పని చేస్తూనే ఉత్తర తెలంగాణలోని నేలల్లో భాస్వరం నిల్వలపై పరిశోధనలు చేశారు. 85 శాతానికి పైగా



నేలల్లో భాస్వరం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. భాస్వరాన్ని కరిగించేలా పీఎస్బీ(ఫాస్పరస్ సాల్యూడ్ బ్యాక్టీరియా) వినియోగం వంటి విధానాలు రూపొందించి నిరూపించారు. పసుపు, మిరప, కూరగాయల పంటల్లో ఎత్తు మడుల విధానం ద్వారా మురుగు నీటి నిల్వ సమస్య నివారణ, కలుపు తగ్గడం, సగటు దిగుబడుల పెంపు అంశాలతో పీహెచ్డీకి ఎంపికైనట్లు శేఖర్ తెలిపారు.

అధిక పోషకాల పుట్టగొడుగుల సృష్టి కరీంనగర్కు చెందిన జి.శృతి పొలాస కళాశాలలో వ్యవసాయ డిగ్రీ, రాజేంద్రనగర్లో ప్లాంట్ పాథాలజీలో పీజీ చేసి ప్రస్తుతం పొలాసలోనే టీచింగ్ అసోసియేట్గా పనిచేస్తున్నారు. అందుబాటులో ఉన్న పుట్టగొడుగుల్లో పోషకాలు తక్కువగా ఉండటంతో షిటాకే అనే కొత్త రకాన్ని సృష్టించారు. అధిక పోషకాలతో కూడిన ఈ రకం పెంపకంలో ఆధునిక సాంకేతికత, లాభాలు ఆర్జించే విధానాలు రూపొందించడాన్ని వర్సిటీ గుర్తించింది. సాగుకు అనుబంధంగా పుట్టగొడుగుల పెంపకం తో లాభాలు గడించవచ్చని, ఆసక్తి గల వారికి శిక్షణ ఇస్తామని శృతి తెలిపారు.

# పోలేపల్లి ఎల్లమ్మతల్లి.. భక్తుల కల్పవల్లి

బొంరాస్పేట: గ్రామీణ ఇలవేల్పు, భక్తుల పాలిట కొంగుబంగారంగా భాసిల్లుతున్న పోలేపల్లి ఎల్లమ్మ దేవత జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. నేడు నిర్వహించే సిరిమానోత్సవం ప్రత్యేకంగా నిలుస్తుంది. గ్రామదేవతలకు జరిగే జాతర ఉత్సవాల్లో వికారాబాద్ జిల్లాలో ఇదే అతిపెద్దది. దుద్యాల మండలం పోలేపల్లిలోని వందేళ్ల చరిత్ర గల ఈ ఆలయం ఏటేటా అభివృద్ధి చెందుతోంది.

1987లో దేవాదాయ శాఖ నిధుల నుంచి ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గతంలో పొడవాటి కర్రకు మహిళను కట్టి 'సిడే' కార్యక్రమం నిర్వహించేవారు. దీనిని వ్యతిరేకిస్తూ మహిళా సంఘాల వారు పోరాటం చేయగా 2002 నుంచి రద్దు చేశారు. ప్రస్తుతం సిరిమానోత్సవం నిర్వహించేందుకు భక్తులు సిడే యంత్రాన్ని కానుకగా ఇచ్చారు. ఇందులో తొట్టెలను కట్టి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సిరిమానోత్సవాన్ని జరిపిస్తున్నారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు సుమారుగా 2 లక్షలకు పైగా భక్తులు హాజరవుతారు. ఆలయ ప్రాంగణంలో కోనేరు తవ్వడంతో నీరు ఊటలా పైకి ఉబికి వస్తోంది.



**ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు**

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీరు, విద్యుత్తు, మొబైల్ టాయిలెట్స్, పారిశుధ్య పనులు చేపట్టారు. ఫైర్ ఇంజిన్, అంబులెన్సులు తెప్పించారు. మూడు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. గతేడాది ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఎల్లమ్మతల్లిని దర్శించుకొని ఆలయ అభివృద్ధి కోసం రూ.1.20 కోట్లు మంజూరు చేశారు. దీంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. జాతరలో దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిఘానేత్రాల మధ్య జాతర కొనసాగనుంది.

**పలు ప్రాంతాల నుంచి భక్తుల రాక**

నేటి సిరిమానోత్సవం తిలకించేందుకు తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం బీదర్, మహారాష్ట్ర షోలాపూర్, నాందేడ్, భీవండి వంటి ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలను ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. శనివారం రథోత్సవం, ఆది, సోమవారాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతాయి.

# 336 స్థానాల్లో పోటీ.. రెండు చోట్ల గెలుపు.. ఊహించని ఫలితాలతో జన సేనకు షాక్



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 100% స్ట్రైక్ రేట్తో ప్రభంజనం సృష్టించిన జనసేన పార్టీ.. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. భారీ ఆశలతో తెలంగాణ మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగిన జనసేనకు ఈ ఫలితాలు ఒక విధంగా షాక్ ఇస్తే మరోవైపు బోణీ కొట్టడం కొంత ఊరటనిచ్చింది. మొత్తం 336 వార్డుల్లో పోటీ చేసిన జనసేన, కేవలం రెండు స్థానాల్లో మాత్రమే విజయం సాధించగలిగింది. గెలుపు బావుటా ఎగురవేసిన నేరేడుచర్ల, మంచిర్యాల తెలంగాణలో పాగా వేయాలని భావించిన జనసేన ఖాతాలో రెండు కీలక విజయాలు చేరాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ 14వ వార్డులో జనసేన అభ్యర్థి ఆరూరి విజయలక్ష్మి 60 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి.. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి మొదటి విజయాన్ని అందించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 34వ డివిజన్లో జనసేన అభ్యర్థి అగ్గు సాగర్ 31 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపిలను తట్టుకుని ఈ ఇద్దరు అభ్యర్థులు గెలవడం స్థానిక స్థాయిలో జనసేన శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. పవన్ కళ్యాణ్ ప్రచారం లేకపోవడం మైనస్ అయిందా? జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రచారం చేస్తారని పార్టీ తొలుత ప్రకటించింది. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో ఆయన పర్యటనకు రూట్ మ్యాప్ కూడా సిద్ధమైంది. అయితే అనూహ్యంగా ఆరోగ్య కారణాల దృష్ట్యా ఆయన తన పర్యటనను రద్దు చేసుకున్నారు. "అధినేత వచ్చి ఉంటే ఫలితం మరోలా ఉండేది" అని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా యువతలో పవన్ కళ్యాణ్కు ఉన్న క్రేజ్ ఓట్లుగా మారుతుందని ఆశించిన అభ్యర్థులకు ఆయన గైర్హాజరు పెద్ద దెబ్బగా మారింది. హైపర్ ఆది, రామ్ తాళ్లూరి వంటి వారు ప్రచారం చేసినప్పటికీ అది క్షేత్రస్థాయిలో ఓటర్లను పెద్దగా ప్రభావితం చేయలేకపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు. వైరల్ అయిన 'ఒక్క ఓటు' ఉదంతం మరోవైపు సంగారెడ్డి మున్సిపాలిటీ 4వ వార్డులో జనసేన అభ్యర్థి జంగా కోమరయ్యకు కేవలం ఒక్క ఓటు మాత్రమే రావడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కనీసం కుటుంబ సభ్యులు కూడా ఓటు వేయలేదా అంటూ నెటిజన్లు ట్రోల్స్ చేస్తుండటం పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారింది. ఇది పార్టీ సంస్థాగత లోపాలను ఎత్తిచూపుతోంది. జనసేన నేర్చుకోవాల్సిన పాఠాలేంటి? ఈ ఫలితాలు తెలంగాణలో జనసేన భవిష్యత్తుపై పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. కేవలం స్టార్ పవర్తో ఎన్నికల్లో గెలవడం కష్టమని, బూత్ స్థాయి నుండి బలమైన క్యాడర్ అవసరమని ఈ ఎన్నికలు నిరూపించాయి. ఆంధ్రప్రదేశ్లో మాదిరిగా తెలంగాణలో ఇంకా జనసేనకు ఒక స్పష్టమైన ఓటు బ్యాంక్ ఏర్పడలేదు. కేవలం పవన్ కళ్యాణ్ ఇమేజ్పైనే కాకుండా ప్రజల్లో తిరిగే స్థానిక నాయకులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉంది. మొత్తానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు జనసేనకు ఒక హెచ్చరిక లాంటివి. ఈ ఫలితాల నుండి పాఠాలు నేర్చుకుని, భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో జనసేన ఎలా ముందుకు వెళ్తుందో వేచి చూడాలి.

# సాగుబడిలో నేల పాఠాలు!



ఆదిలాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులే ఉంటారు.. రైతులు పడే కష్టాలు తెలిసిన విద్యార్థులకు సాగులో కీలకమైన భూసారంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం ప్రాజెక్టు చేపట్టింది.. గతేడాది ప్రారంభించిన ఈ పథకం సత్ఫలితాలను ఇవ్వడంతో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో మరో 31 పాఠశాలలను ఎంపిక చేశారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టులో ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల నుంచి ఆసక్తి గల 50 మంది విద్యార్థుల వివరాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోర్టల్లో నమోదు చేసుకోవాలి. తొలుత పాఠశాలల వారీగా భూసార పరీక్షలు, వాటి ప్రాధాన్యత, మట్టి నమూనాల సేకరణ తదితర వాటి గురించి విద్యార్థులకు వివరించాలి. ఈ బాధ్యతను భూసార పరీక్ష కేంద్రం అధికారులతో పాటు కేవీకే శాస్త్రవేత్తలకు అప్పజెప్పారు. అనంతరం క్షేత్రస్థాయిలో మట్టినమూనాల సేకరణ, రికార్డుల నిర్వహణ, ఫలితాల విశ్లేషణ, ఫలితాలను ఆన్లైన్ చేయడం తదితర వాటిని పూర్తి చేయాల్సి ఉంటుంది. పది మంది విద్యార్థులు ఒక బృందంగా ప్రాజెక్టు నిర్వహించాలి.

భూసార పరీక్ష కిట్లను ప్రభుత్వం సరఫరా చేసింది. పాఠశాలకు దగ్గరలో ఉండే పంట పొలాల నుంచి 50 నమూనాలు సేకరించాలి. నేల ఆరోగ్యంతోపాటు పంటల వారీగా ఏయే ఎరువులు, ఎంత వేయాలనేది సూచించాలి.

**ఎంపికైనవి ఇవే..**

బజార్హత్నూర్, గుడిహత్నూర్, నార్నూర్ మండల కేంద్రాల్లోని ఆదర్శ పాఠశాలలు, ఆదిలాబాద్లో రెండు, బోథ్, ఇచ్చోడ పాఠశాలలు.

కుమురంభీం : ఆసిఫాబాద్లో రెండు, సిర్పూరు(టి), వాంకిడి, చింతలమానేపల్లి, దహేగాం, కాగజ్నగర్.

మంచిర్యాల : బెల్లంపల్లిలో రెండు పాఠశాలలు, కాసిపేట, కోటపల్లి, మంచిర్యాల, మందమర్రి, భీమారం, లక్సెట్టిపేట, హాజీపూర్. నిర్మల్ : సారంగాపూర్, దస్తూరాబాద్, కుంటాల, బాసర, భైంసా, కడెం, ముథోల్, సోన్.

**శిక్షణ కొనసాగుతోంది..-సంధ్య, భూసార పరీక్ష కేంద్రం అధికారి, ఆదిలాబాద్**

ఎంపిక చేసిన పాఠశాలల్లో శిక్షణ కొనసాగుతోంది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో పాటు భూసార పరీక్ష కేంద్రం అధికారులు వేర్వేరుగా అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించి, పరీక్షించి, ఫలితాలను రైతులకు ఇవ్వడంతో పాటు వెబ్సైట్లో నమోదు చేయాలి.

# శాటిలైట్ చిత్రాలే ఆధారం

రాయదుర్గం: హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో రూ.2,200 కోట్ల విలువైన 11 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా రక్షించింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ పరిధిలోని సర్వే నంబరు 53లో మొండి కుంట, సర్వే నంబరు 55లో ప్రభుత్వ స్థలం కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురవుతూ వస్తోంది. స్థానికులు ఇటీవల హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అటు చెరువు.. ఇటు ప్రభుత్వ భూమిలో మొత్తంగా 11 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు గుర్తించారు. చెరువు ఎఫ్టీఎల్లోని ఆలయాన్ని హద్దుగా చూపి ఆక్రమణ దారులు కబ్జాకు తెరలేపినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలోనే 200కు పైగా షెడ్లు, 30కిపైగా దుకాణాలు నిర్మించి వ్యాపారాలు చేస్తూ.. నెలకు రూ.2 కోట్ల అద్దెలు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు.

సమావేశం నిర్వహించి.. సమయం ఇచ్చి..: మొండి కుంటతో పాటు సర్కారు స్థలం కబ్జా విషయంలో జనవరి 31న హైడ్రా విచారణ నిర్వహించింది. శాటిలైట్ చిత్రాలు, ఇతర ఆధారాలు చూపించి ఆక్రమణ జరిగినట్లు నిరూపించారు. నిర్మాణాల తొలగింపునకు కొంత సమయం ఇచ్చారు. అయినా స్పందన లేకపోవడంతో గురువారం నేలమట్టం చేశారు.



# కాపాడే ధీర.. రహవీర్..!

సంగారెడ్డి : జహీరాబాద్ మండలం హుగ్గెల్లి వై జంక్షన్లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హుగ్గెల్లికి చెందిన ఇద్దరు యువకులు గమనించి స్పందించారు. వెంటనే 108 అంబులెన్స్కు ఫోన్ చేసి రప్పించారు. క్షతగాత్రులను ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ యువకుల తక్షణ స్పందన.. చొరవ రెండు ప్రాణాలను నిలబెట్టింది. మానవత్వంతో వేసిన అడుగులు బాధితుల కుటుంబాల్లో వెలుగులు నింపాయి. ఇలాంటి వారిని మరింత ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను కాపాడి.. ఆసుపత్రిలో చేర్పించిన వారికి రూ.25 వేల పురస్కారం అందించేందుకు 'రహవీర్' పథకాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు రవాణా శాఖ నిర్ణయించింది. గాయపడిన బాధితులను ఆసుపత్రికి తరలించే నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందించను న్నారు.

**సకాలంలో వైద్యం అందక..**

సకాలంలో వైద్యం అందక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. దీంతో బాధిత కుటుంబం చిన్నాభిన్నమవుతోంది. వివిధ సందర్భాల్లో ఇలాంటి ఘటనలు మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల్లో తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఏటికేడు వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయి. నిత్యం సగటున రెండు నుంచి మూడు ఘటనలు జరిగితే ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల్లో బాధితులుగా అత్యధికులు బైక్ చోదకులే ఉంటున్నారు.

**ఆందోళన వీడండి..**

ప్రమాదం జరిగిన తొలి గంటను గోల్డెన్ అవర్గా సంబోధిస్తారు. ఇదే అత్యంత కీలకం. సరైన వైద్యం అందిస్తే బతికే అవకాశం ఎక్కువ. వివిధ సందర్భాల్లో క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్తే పోలీసు ఠాణాల చుట్టూ తిరగాల్సి వస్తుందని, ఆసుపత్రి ఖర్చులు భరించాల్సి వస్తుందని సంశయిస్తున్నారు. ఇలాంటి వారికి రక్షణ కల్పించడంతో పాటు ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'గుడ్ సమరిటన్'



చట్టం అమలు చేస్తోంది. అందుకే ఆందోళన వీడి ప్రమాద బాధితులను కాపాడుదాం.

**ఎలా అమలు చేస్తారంటే..**

పథకం అమలులో భాగంగా కలెక్టర్ జిల్లా ఛైర్మన్గా వ్యవహరిస్తారు. పోలీసు కమిషనర్ లేదా ఎస్పీ, జిల్లా వైద్యాధికారి సభ్యులుగా, రవాణా శాఖ అధికారి కన్వీనర్ పాత్ర పోషిస్తారు. గంటలోపు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన తదుపరి స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే పేరు, వివరాలు, ప్రమాద సమాచారంతో రసీదు ఇస్తారు. ఆసుపత్రి నిర్వాహకులు వివరాలను ధ్రువీకరిస్తారు. నిర్ధారణ అయ్యాక పోలీసులు జిల్లా కమిటీకి ప్రతిపాదిస్తారు. తదుపరి రవాణా శాఖ.. రూ.25 వేలు, ప్రశంసాపత్రం అందిస్తుంది.

**తక్షణం స్పందించాలి: లక్ష్మణ్, జిల్లా రవాణా శాఖ అధికారి, సిద్దిపేట**

రహవీర్ పథకం తాజాగా అమల్లోకి వచ్చింది. అత్యవసరంలో క్షతగాత్రులకు అండగా నిలవాలి. తక్షణం స్పందించడం ద్వారా ఓ ప్రాణం కాపాడిన సంతృప్తి జీవితాంతం ఉంటుంది. ప్రభుత్వం తరఫున ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందిస్తాం.

# ఇక్కడే ఉండాలని.. కడుపునిండా తినాలని..!

పాల్వంచ : అడవుల్లో వన్యప్రాణులకు ఆహారం సరిగ్గా దొరకట్లేదు. ఎండాకాలంలో చెట్ల ఆకులు రాలిపోవటం ప్రధాన సమస్య. స్పందించిన అటవీశాఖ అధికారులు పచ్చిక బయళ్ల పెంపకానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఆరు డివిజన్లలో.. కిన్నెరసాని అభయారణ్యంలో ఎక్కువ వన్యప్రాణులు ఉన్నాయి. ప్రధానంగా దుప్పులు, అడవి గేదెలు (బైసన్స్) వందల సంఖ్యలో ఉన్నట్లు అంచనా. పచ్చిక దొరక్క ఇవీ ఎక్కడికైనా వెళ్లే అవకాశముంది. అందుకే పచ్చిక బయళ్లను అధికారులు పెంచుతున్నారు.

**రూ.5.80 లక్షలు మంజూరు..**

పచ్చిక బయళ్ల పెంపకానికి ప్రభుత్వం రూ.5.80 లక్షలు మంజూరు చేసింది. అభయారణ్యం పరిధిలోని చాతకొండ రేంజ్లో పదకొండు హెక్టార్లు, ఆళ్లపల్లిలో 15 హెక్టార్లు, రేగళ్లలో 60 హెక్టార్లు, యానంబైలులో 30 హెక్టార్లలో పచ్చిక బయళ్లను అధికారులు పెంచుతున్నారు. పాల్వంచ టెరిటోరియల్లోని ములకలపల్లి ఏరియాలో ప్రస్తుతం ఉన్న నాలుగు హెక్టార్లలో నిర్వహణకు నిధులు మంజూరవగా



అధికారులు పనులు చేపట్టారు. వీటికి అవసరమైన నీటికి సోలార్ బోర్లు ఉన్నాయి. ఒకట్రెండు ప్రాంతాల్లో సోలార్ బోర్లు పనిచేయకపోవటంతో మరమ్మతులు చేయించారు. ఆ పరిసర ప్రాంతాల్లోని నీటి కుంటల్లో నీటిని నిల్వ చేస్తుండటం గమనార్హం. దట్టమైన అటవీప్రాంతాలున్న ప్రాంతాల్లో పచ్చిక పెంచుతున్నారు. పశువులు, మేకలు ఆయాచోట్ల సంచరించకుండా చర్యలు చేపడుతున్నారు.

**వేటగాళ్లపై డేగ కన్ను..**

పచ్చిక బయళ్లు పెంచిన ఏరియాల్లో వన్యప్రాణులు ఎక్కువగా సంచరిస్తాయి. వేటగాళ్లు మాటు వేసే అవకాశం ఉండటంతో అటవీశాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఆ ప్రాంతాల్లో కెమెరా ట్రాప్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఇవే కాకుండా రోడ్డుపక్కన కొన్ని ప్రాంతాల్లో అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అనుమానితులు కనిపిస్తే అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అటవీశాఖ అధికారులు సైతం రోజూ సందర్శించి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

# ప్రథమ పౌరుల ప్రగతి కార్యాచరణ

కొడిమ్యాల : ఎన్నికల వేళ ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగారు.. తమను గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.. మాట తప్పకుండా ప్రగతి కార్యాచరణ ప్రారంభించారు.. పంచాయతీల్లో రెండేళ్ల ప్రత్యేకాధికారుల పాలన అనంతరం గత నెలలో నూతన పాలకవర్గాలు కొలువుదీరాయి. మాట ఇచ్చినట్లుగానే కొందరు సర్పంచులు ప్రధాన సమస్యల పరిష్కారానికి కదిలారు.. కొడిమ్యాల మండలానికి చెందిన పలువురు గ్రామ ప్రథమ పౌరులపై స్ఫూర్తిదాయక కథనమిది..

**చిలుకవాగులో తొలగిన దుర్గంధం**

కొడిమ్యాల మండల కేంద్రంలోని చిలుకవాగు కాలువ పిచ్చిమొక్కలు, చెత్తతో నిండిపోయింది. దోమల బెడద పెరగడంతో పాటు దుర్గంధంతో స్థానిక ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సర్పంచి గడ్డం జీవన్రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల చిలుకవాగులోని పిచ్చిమొక్కలు తొలగించారు. ఆయన చొరవతో ఇరువైపులా శాశ్వతంగా రిటైనింగ్ గోడల నిర్మాణంపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారు. అలాగే మండల కేంద్రంలోని 11, 13 వార్డుల్లో కొన్నేళ్లుగా నీటి సమస్య తీవ్రం కాగా కొత్త పైపులైన్ వేసి పరిష్కరించారు.



**తీరిన తాగునీటి కష్టాలు**

చెప్యాల గ్రామంలోని ఎర్రకుంట, ప్రభుత్వ పాఠశాల, ఊర చెరువు కొనకట్ట ప్రాంతాల్లో స్థానికులు కొన్నేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో సమస్య మరింత ఎక్కువవుతోంది. ఇటీవల సర్పంచిగా ఎన్నికైన వుట్కూరి శ్రీలత ఈ మూడు ప్రదేశాల్లో బోరుబావులు తవ్వించి సమస్య పరిష్కరించారు.

డబ్బుతిమ్మయ్యపల్లె గ్రామం నుంచి నాచుపల్లి-హిమ్మత్రావుపేట తారు రోడ్డు వరకు మట్టి రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. సీసీ రోడ్డుకు గతంలోనే నిధులు మంజూరైనా పనులు జరగలేదు. సర్పంచి సురకంటి లావణ్య చొరవతో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించడంతో స్థానికుల అవస్థలు తీరాయి.

**పలకరించిన ఆర్టీసీ బస్సు**

నమిలికొండ గ్రామం నుంచి శ్రీరాములపల్లె వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించేవారు. సర్పంచి షాబొద్దీన్ చొరవతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు వేయించారు. కరీంనగర్ నుంచి నమిలికొండ మీదుగా శ్రీరాములపల్లె వరకు వేసిన బస్సును ఇటీవల ఎమ్మెల్యే ప్రారంభించారు.

# పారిశుద్ధ్యంపై పట్టింపు లేదా?

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న వాహనాలకు ఇంధనం కొరత ఏర్పడింది. గత కొన్ని నెలలుగా తరచూ డీజిల్ లేక నిలిచి పోతుండగా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ట్రాక్టర్లకు మాత్రమే డీజిల్ పోస్తుండగా, మిగతా వాహనాలకు విడతల వారీగా లేదంటే మొత్తమే వదిలేస్తుండటంతో రోజుల తరబడి మూలకు పడుతున్నాయి. దాంతో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా సాగుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం కనిపిస్తోంది.

**15 రోజులుగా స్వీపింగ్ బంద్**

నగరంలోని ప్రధాన రహదారులను శుభ్రంగా ఊడ్చేందుకు అయిదు వాహనాలు ఉన్నాయి. ఇందులో రెండు మేడారం జాతరకు పంపించారు. మిగతా మూడు వాహనాలు డీజిల్ లేక గత 15 రోజులుగా నిలిపి వేయడంతో స్వీపింగ్ కూడా బంద్ అయింది. రోజుల తరబడి వాహనాలు వినియోగించుకోకపోతే బ్యాటరీలు పాడయ్యే ప్రమాదముంది. మేడారానికి వెళ్లిన వాహనాలు కూడా మొరాయిస్తున్నట్లు తెలుస్తోంది. చెత్త డబ్బాలు తీసుకెళ్లడానికి వినియోగించే కంప్యాక్టర్ వాహనాలు ఆగిపోయాయి.

**ఎందుకింత జాప్యం**

పారిశుద్ధ్య వాహనాలకు సంబంధించి పెట్రోల్ బంకులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో బంకు యజమానులు పోయడం లేదు. రెండు కూడా ప్రభుత్వ బంకులే అయినా పేరుకుపోతున్న బకాయిలతో కొన్ని వాహనాలకు డీజిల్ పోస్తుండగా, మరి కొన్నింటికి పోయడం లేదు. బిల్లులు తయారు చేసేందుకు, బంకుల దగ్గరికి వెళ్లడం, చెక్కులు తయారు చేసి ఆమోదం తీసుకోవడం వరకు ఒకరికే బాధ్యతలు ఇవ్వడంతో ఆలస్యం జరుగుతున్నట్లు సమాచారం.



**నడవకపోతే బిల్లులు తగ్గినట్లే**

నగరపాలికలోని శానిటేషన్ వాహనాలను సగం మేర నడిపించకుండా ప్రతినెలా పక్కన పెడుతున్నారు. ఆ వాహనాలకు ఇంధనం పోయడం లేదు. వాహనాలు తిరగకపోతే బిల్లులు తగ్గినట్లే. బిల్లులు తగ్గించామనే విషయాన్ని చెప్పుకోవడానికి కొన్ని వాహనాలు నిలిపి వేస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు. ఇంకేముంది పారిశుద్ధ్య పనులపై ప్రభావం చూపుతున్న అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు.

ఒకట్రెండు రోజుల్లో పరిష్కారం

సమస్యను ఒకట్రెండు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాం. ఈ విషయంపై పెట్రోల్ బంకుల ఉన్నతాధికారులతో మాట్లాడేందుకు నగరపాలక తరపున కలెక్టర్కు లేఖ రాయాలని కమిషనర్ ఆదేశించారు.
దిలీప్కుమార్, సహాయ కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

# ఎంఎంటీఎస్.. మెట్రో స్టేషన్లను కలిపేలా స్కైవేలు



హైదరాబాద్ : నగరంలో ఎంఎంటీఎస్ సేవలతో ఆర్టీసీ, మెట్రో సేవలను అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా మెట్రోస్టేషన్లు, బస్టాప్లతో అనుసంధానం చేసేందుకు పలు ప్రాంతాల్లో స్కైవేలు నిర్మించేందుకు చర్యలు చేపట్టనుంది. మెట్రో స్టేషన్ నుంచే ఎంఎంటీఎస్ స్టేషన్లలోకి చేరుకునేలా వీటిని ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు ఎంఎంటీఎస్ స్టేషన్ల సమీపానికి బస్టాండ్లను తరలించనున్నారు. ఈమేరకు హెచ?ండీఏ ఆధ్వర్యంలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్పోర్టు అథారిటీ (ఉమ్టా) పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. సికింద్రాబాద్ నార్త్, సౌత్, బేగంపేట, నాంపల్లి, భరత్నగర్, మలక్పేట, ఖైరతాబాద్లాంటిచోట్ల ఎంఎంటీఎస్, మెట్రోస్టేషన్లు పక్కపక్కనే ఉన్నాయి. ఒకటి, అరచోట తప్ప స్టేషన్లలోకి స్కైవేలు లేవు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఎంఎంటీఎస్, సమీప బస్టాప్లను అనుసంధానం చేసేలా త్వరలో స్కైవేను నిర్మించనున్నారు.

**స్టేషన్లలోకి సులువుగా వెళ్లేలా..**మొత్తం 51 ఎంఎంటీఎస్ స్టేషన్లలో 21 మాత్రమే బస్టాప్లకు కూతవేటు దూరంలో ఉన్నాయి. మిగతావన్నీ దూరంగా ఉండటంతో ప్రయాణికులు వినియోగించుకోవడం లేదు. బస్టాప్లను ఎంఎంటీఎస్ స్టేషన్లకు దగ్గరగా మార్చితే ప్రయాణికులు సులువుగా స్టేషన్లలోకి చేరుకునేలా రోడ్లు, స్కైవాక్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. బస్టాప్లు స్టేషన్ల దగ్గరకు తరలించలేని పరిస్థితి ఉంటే ప్రయాణికులను తరలించేందుకు తక్కువ రుసుంతో ప్రయాణం సాగించే బ్యాటరీ వెహికల్స్ ఏర్పాటు యోచన ఉందన్నారు.

మొత్తం ఎంఎంటీఎస్ స్టేషన్లు.. 51
బస్టాప్లకు 500 మీటర్ల దూరంలో ఉన్నవి.. 21
500 మీటర్ల నుంచి 1 కి.మీ.లో ఉన్నవి.. 12
కిలోమీటర్ దాటి ఉన్నవి.. 18
నగరంలో ప్రజారవాణా (రోజుకు)
ఆర్టీసీ బస్సుల్లో.. 25 లక్షలు
మెట్రోలో.. 5 లక్షలు
ఎంఎంటీఎస్లో.. 40-50 వేలు
వ్యక్తిగత వాహనాలపై.. 70 లక్షలు

# డ్రైవింగ్ లైసెన్స్ చిరునామా మార్చుకోండిలా




హైదరాబాద్: ఏపీకి చెందిన చాలామంది ఉద్యోగ, వ్యాపారాల రీత్యా హైదరాబాద్లో స్థిరపడ్డారు. గతంలో సొంతూరిలో నివసించినపుడు డ్రైవింగ్ లైసెన్సు(డీఎల్)పై అప్పటి చిరునామాని పొందుపరుస్తారు. ప్రస్తుతం నివసించే చిరునామాతో డీఎల్ తీసుకోవాల్సి ఉంటుంది. కొందరు చిరునామా మార్పు విషయంలో అశ్రద్ధ వహిస్తుంటారు. ప్రస్తుత చిరునామాతో డీఎల్ ఉంటే గుర్తింపు పత్రంగా లైసెన్సు రెన్యువల్కు ఉపయోగపడుతుంది. రవాణా శాఖ పరిధిలోని పౌరసేవలు కేంద్రం ఆన్లైన్ ద్వారా సులభతరం చేసింది. ఇప్పుడు చిరునామా మార్పు సులభమే.

**ఎలా నమోదు చేసుకోవాలి?**

ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు ప్రస్తుతం ఉంటున్న చిరునామా ధ్రువీకరణ పత్రాలు (ఆధార్, ఓటర్ ఐడీ, విద్యుత్తు, గ్యాస్ బిల్లులు) అవసరం.వయస్సు 40 ఏళ్లు దాటితే తప్పనిసరిగా మెడికల్ సర్టిఫికేట్ (ఫాం 1-ఎ) తప్పనిసరి.

ముందుగా కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ వెబ్సైట్ parivahan.gov.in వెబ్సైట్లోకి వెళ్లాలి.

ఆన్లైన్ సర్వీసెస్లోకి వెళ్లి 'డ్రైవింగ్ లైసెన్స్ రిలేటెడ్ సర్వీసెస్', తర్వాత 'తెలంగాణ' ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి.

అనంతరం 'అప్లై ఛేంజ్ ఆఫ్ అడ్రస్'లోనికి వెళ్లాక.. డీఎల్ నంబరు, పుట్టిన తేదీని పొందుపర్చాలి. 'గెట్ డీఎల్ డిటెయిల్స్'ని ఎంచుకోవాలి. 'ఛేంజ్ ఆఫ్ అడ్రస్' ఆప్షన్ ద్వారా తెలంగాణలో ప్రస్తుతం నివసిస్తున్న చిరునామా పొందుపరచాలి.

దరఖాస్తు సబ్మిట్ చేసిన తర్వాత నిర్ణీత రుసుము ఆన్లైన్లోనే చెల్లించాలి. అనంతరం దగ్గరలోని ఆర్టీవో కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలనకు తేదీని (స్లాట్) బుక్ చేసుకోవాలి.

ఆర్టీవో కార్యాలయానికి వెళ్లినప్పుడు సంబంధిత ఒరిజినల్ పత్రాలను తీసుకెళ్తే.. వాటిని చూసి అధికారులు ఆమోదిస్తారు. అనంతరం ప్రస్తుత చిరునామాతో కూడిన స్మార్ట్కార్డు లైసెన్సు ఇంటికే పోస్టు ద్వారా వస్తుంది.

# కలుషితం కా'నీరు'



హైదరాబాద్ : మహానగరంలో 1.3 కోట్లమందికి తాగునీరు సరఫరా చేస్తున్న జలమండలి నీటి నాణ్యతపై బహుముఖ కార్యాచరణను అమలు చేయనుంది. నగరంలో ఏ ప్రాంతంలోనూ కలుషిత జలాలకు అవకాశం లేకుండా వివిధ చర్యలు చేపట్టనుంది. నగరంలో కలుషితజలాలకు సంబంధించి ఫిర్యాదులు అత్యధికంగా వస్తున్న ప్రాంతాల్లో పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయనుంది. నీటి నాణ్యత పరీక్షలు పెంచనుంది. జలమండలి చేయాల్సిన పనులతో పాటు వినియోగదారులు దృష్టి సారించాల్సిన అంశాలపై అవగాహన కలిగించనుంది. కలుషిత జలాలను గుర్తించేందుకు ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఏఐ, రోబోటిక్ సాంకేతికతను ఉపయోగిస్తున్న జలమండలి దీన్ని మరింత విస్తృతం చేయనుంది. ఇండోర్ నగరంలో నీటి కాలుష్యం నేపథ్యంలో జలమండలి ఎండీ కె.అశోక్రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. పైపులైన్ల లీకేజీలపై అప్రమత్తంగా వ్యవహరించాలని, మేనేజర్ల నుంచి అన్ని స్థాయిల అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**అత్యాధునిక సాంకేతికత**

జలమండలి నీటి సరఫరా కోసం వేసిన పైపులైన్లు 30 ఏళ్లు అంతకంటే పాతవి కావడంతో చాలా చోట్ల పాడై పోయి ఉన్నాయి. రక్షిత మంచినీటిని సరఫరా చేయాల్సిన పైపులైన్లలో మురుగునీరు చేరి సరఫరా కావడం ఇతర రసాయనాలు, వ్యర్థాలు కలవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దెబ్బతిన్న పైపులైన్లను గుర్తించి మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్ ద్వారా నీటి పైపుల్లోకి కెమెరా పంపి పైపులైన్ దెబ్బతిన్న ప్రాంతాన్ని గుర్తిస్తారు. ఆధునిక విధానంతో తక్కువ సమయంలో లీకేజీని గుర్తించడమే కాకుండా లీకేజీ ఎక్కడ ఉందని స్పష్టంగా గుర్తించేందుకు ఈ విధానం దోహదపడుతుంది. ఆ ప్రాంతంలో దెబ్బతిన్న లేదా పాడైన పైపులను మారుస్తారు.

**నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా**

ప్రమాదకరమైన ఈకోలీ, కోలీఫాం బ్యాక్టీరియాను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతికతను జలమండలి వినియోగిస్తోంది. ఇప్పటికే ఆధునికీకరించిన ఏడు ప్రయోగశాలల్లో 24 గంటల్లో బ్యాక్టీరియాను గుర్తించేలా మెంబ్రేన్ ఫిల్టరేషన్ టెక్నిక్ విధానానికి శ్రీకారం చుట్టింది. టీడీఎస్, పీహెచ్, టర్బిడిటీ, నీటికాఠిన్యం సహా నీటి నాణ్యతను నిర్ధారించే పరీక్షల సంఖ్య పెంచనున్నారు. క్లోరిన్ నిర్దేశించిన పరిమాణంలో ఉండేలా చూస్తారు.

**జీఐ పైపులు మార్చుకోవాలి**

1997కు ముందు తాగునీటి సరఫరాకు జీఐ పైపులు వాడారు. ఈ పైపులు 15 ఏళ్ల తర్వాత వివిధ కారణాలతో పాడైపోయేందుకు అవకాశాలున్నాయి. వాటిని మార్చుకోవడం ద్వారా కలుషిత జలాలకు అవకాశం లేకుండా చేసుకోవచ్చని వినియోగదారులు ఈ అంశంపై దృష్టి సారించాలని అవగాహన కలిగించనున్నారు.

# నలువైపులా వడివడిగా ప్రయాణం

మల్లాపూర్ : రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్హెచ?ఐ) టెండర్లు పిలిచిన నాలుగు మార్గాల్లో మూడు జగిత్యాల కేంద్రంగా వెళ్లనుండటం విశేషం. నిర్మల్-జగిత్యాల మార్గంలో మరో జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది. ఏళ్ల తరబడి ఇరుకు రోడ్లతో ఇబ్బందులు పడగా సువిశాలమైన దారులతో పాటు వాహనాల పార్కింగ్కు స్థలాలను కేటాయించనున్నారు. దీంతో ప్రమాదాల నివారణ, సరకు రవాణాలో వేగం పెంచాలనే ఉద్దేశంతో కేంద్రం వడివడిగా అడుగులు వేస్తోంది. **అయిదేళ్లలోగా పూర్తయ్యేలా..**ఎన్హెచ?ఐ ప్రాజెక్టు ఎప్రైజల్ అండ్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీస్(పీఏటీఎస్సీ), పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్య ఎప్రైజల్ కమిటీ(పీపీపీటీఏసీ)లు సైతం ఆమోదం తెలపడంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. జగిత్యాల-కరీంనగర్, జగిత్యాల-మంచిర్యాల, జగిత్యాల-ఆర్మూర్, మహబూబ్నగర్-గూడెబల్లూర్ మార్గాల్లో మొత్తం 271 కిలోమీటర్లకు రూ.10,034 కోట్లతో హైవేల నిర్మాణానికి కేంద్రం సిద్ధమవుతోంది. వచ్చే మూడేళ్ల నుంచి అయిదేళ్లలోపు పనులు పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

# ఎప్పుడింకా.. బృహత్ ప్రణాళిక

సిరిసిల్ల : సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో రోజురోజుకూ పెరుగుతున్న పట్టణ జనాభా, వాహనాల రద్దీకి ఇప్పుడున్న రహదారులు సరిపోని పరిస్థితి నెలకొంది. రాబోయే 30 ఏళ్లలో పట్టణాల విస్తరణకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలు చేయాల్సి ఉంది. దీనికోసం ఈ రెండు పట్టణాలను అమృ 2.0లో ఎంపిక చేశారు. సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం డ్రోన్ను ఉపయోగించి సర్వే చేశారు. భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) ప్రణాళికలను రూపొందించింది. రెండు పట్టణాల్లో ఇప్పటికి మూడుసార్లు సమావేశాలు జరిగినా.. ప్రణాళిక అమలుపై ఇంకా స్పష్టత రాలేదు.

**పన్నుల రాబడిపై ప్రభావం**

సిరిసిల్ల పట్టణంలో మాస్టర్ ప్లాన్ కోసం 14 సర్వే నంబర్లలో దాదాపు వంద ఎకరాలను పరిశ్రమల జోన్గా గుర్తించారు. జిల్లా ఆవిర్భావం తర్వాత ఈ ప్రాంతానికి సమీపంలో కలెక్టరేట్ నిర్మాణం జరిగింది. రెండు బాహ్య వలయ రహదారులకు కూడలిగా ఉండటంతో నివాస గృహాలు విస్తరిస్తూ వస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఇంటి నిర్మాణాలకు పురపాలికలో దరఖాస్తు చేసుకున్నారు. పరిశ్రమల జోన్ కావడంతో పురపాలిక అనుమతులు ఇవ్వడంలేదు. రాబోయే కొత్త ప్రణాళికలో



పరిశ్రమల జోన్ను పెద్దూరులో ఏర్పాటుకు నిర్ణయించారు.

మాస్టర్ ప్లాన్ రికార్డులన్నీ డిజిటల్లో ఉంటాయి. గృహాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు ఇలా వేటి నిర్మాణాలకైనా పురపాలికల నుంచి అనుమతులు ఇవ్వడంలో పారదర్శకత ఉంటుంది. అమలు జాప్యం జరుగుతుండటంతో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలు, వాటి ద్వారా పురపాలికలకు వచ్చే ఆదాయంపై ప్రభావం చూపుతోంది.

**సర్వీసు రహదారులకు మ్యాపింగ్**

సర్వేలో ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, నివాస, వాణిజ్య సముదాయాలు, ఉద్యానవనాలు, ఆట స్థలాలు, వైకుంఠధామాలు ప్రధాన, అంతర్గత, జాతీయ రహదారులు అనుసంధానం చేసే నెట్వర్క్ వ్యవస్థను చిత్రీకరించారు. పట్టణ కేంద్రాల గుండా వెళ్లే జాతీయ రహదారులకు ఇరువైపులా సర్వీసు రోడ్లను సైతం మ్యాపింగ్ చేశారు. ఈ మొత్తం వివరాలను సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో పట్టణాల డిజిటల్ పటాన్ని తయారు చేశారు. ఈ ప్రణాళిక నివేదికలకు ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉంది. వీటిపై అభ్యంతరాలను సరిచేశాక మార్పులు చేర్పులు చేసి మాస్టర్ ప్లాన్ను అమలు చేస్తారు.

# వందకు పది.. దందా ఇది

నల్గొండ: వడ్డీ వ్యాపారులు.. పేద, మధ్యతరగతి వర్గాల అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకొని అక్రమ వడ్డీ దందాను అడ్డూఅదుపు లేకుండా కొనసాగిస్తున్నారు. సామాన్యుల నడ్డి విరుస్తూ వారి జీవితాలతో ఆటలాడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్డీ వసూలు చేయాల్సి ఉండగా అనధికారికంగా గరిష్ఠంగా 10 శాతానికి మించి విధిస్తున్నారు. గడువులోగా అసలు, వడ్డీ తిరిగివ్వకపోతే చంపేస్తామని, భౌతిక దాడులకు పాల్పడుతామని భయభ్రాంతులకు గురిచేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ ఉద్యోగులూ చెలామణి** ప్రభుత్వ ఉపాధ్యాయులు, పోలీసులు, రెవెన్యూ, విద్యుత్తు సంస్థల ఉద్యోగులు సైతం జిల్లాలో వడ్డీ దందాలు చేస్తున్నారు. కొందరు 'పోలీస్? వడ్డీ వ్యాపారులు' ఏకంగా దాదాలుగా మారి దమ్కీలు ఇస్తూ వడ్డీలు తీసుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

జిల్లాలో మొత్తం 137 ఆటో జనరల్ ఫైనాన్స్ కంపెనీలుండగా.. 165 చిట్స్? సంస్థలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్నీ అనుమతులు తీసుకున్నాయి. ఇవీ కాకుండా అనధికారికంగా కొన్ని వందల మంది ఫైనాన్స్ వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ నిబంధనలు ఉల్లంఘించి వడ్డీలిస్తూ నానా హంగామా చేస్తున్నారు.

వాస్తవానికి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫైనాన్స్? విభాగంలో వ్యాపారులు తమ పేర్లతో రిజిస్ట్రేషన్? చేసుకోవాల్సి ఉంటుంది. ఆ గుర్తింపు పొందితే పేరు, రెవెన్యూ స్టాంప్లతోనే రూపాయి నుంచి రూపాయిన్నర మేరకు వడ్డీలు ఇవ్వాల్సి ఉంటుంది.కానీ అక్రమ ఫైనాన్స్? వ్యాపారులు కిరాణా దుకాణాల్లో, పోస్టాఫీసుల్లో దొరికే ప్రాంసరీ నోట్లు, రెవెన్యూ స్టాంపులను కొనుగోలు చేసి గరిష్ఠంగా రూ.10లతో వడ్డీ తీసుకుంటున్నారు. అప్పు తీసుకున్న వారి వివరాలేవీ లేకుండానే వారి సంతకం తీసుకుని జమానతుదారు, ఫైనాన్స్? వ్యాపారి సంతకాలతో ఒప్పందం కావాల్సిన సొమ్ము అందిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

సైదులు, ఎస్సై, నల్గొండ టూటౌన్

నల్గొండ గొల్లగూడకు చెందిన రావుల సాయి, ఎలక్ట్రికల్? వ్యాపారి నాగరాజులు రూ.24లక్షల అప్పును ప్రకాశం బజార్?కు చెందిన వడ్డీ వ్యాపారి బొడ్డుపల్లి సైదులు నుంచి తీసుకున్నారు. సక్రమంగా చెల్లింకపోవడంతో సైదులు వీరికి ఫోన్?లోనే బెదిరించారు. అందుకు సంబంధించి ఆడియో సాక్ష్యాలు ఉండటంతో సదరు వ్యాపారిపై మోసం, బెదిరింపులకు పాల్పడ్డారనే కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. ఇంకా ఎవరైనా బాధితులుంటే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. పోలీస్? సిబ్బంది వడ్డీల దందాలో ఉన్నట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

# ఆ రోడ్లు.. నరకానికి నకళ్లు

ఉట్నూరు: ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రాలకు అనుసంధానం చేస్తూ.. గతంలో నిర్మించిన రహదారులు నిర్వహణ లేక గుంతలు పడ్డాయి. ఈ అధ్వాన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారులను బాగు చేయించాల్సిన అవసరం ఉంది.ఏజెన్సీ డివిజన్?లోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూరు, గాదిగూడ, జైనూరు మండలాల్లోని ప్రజల సౌకర్యార్థం ఆదివాసీ గూడేలు, తండాలను కలుపుతూ.. కొన్నిచోట్ల మట్టి, మరికొన్ని చోట్ల బీటీ రహదారులను నిర్మించారు. కొంతకాలం బాగానే ఉన్నా.. ఇప్పుడు బీటీ ఊడిపోయి రోడ్డు అధ్వానంగా మారింది. అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. వాటి నిర్వహణ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు భవనాల శాఖ, ఐటీడీఏ, పంచాయతీరాజ్? విభాగాలకు చెందిన ఇంజినీరింగ్? అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..అధ్వానంగా మారిన రహదారుల మరమ్మతులపై ఆర్?అండ్?బీ ఈఈ నర్సయ్యను వివరణ కోరగా.. రోడ్ల సమస్యలను ఇప్పటికే గుర్తించామన్నారు. రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు.

# పేదల పేరు.. జరిగింది వేరు!!



విశాఖపట్నం: పేదల వైద్యం కోసం ఆసుపత్రి నిర్మిస్తామని ఎండాడలో విలువైన భూమి తక్కువ ధరకు తీసుకున్నారు. కేటాయింపులు జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అక్కడ ఆసుపత్రి జాడే లేదు. కేవలం నర్సింగ్ కళాశాల, యోగా సెంటర్, మ్యూజిక్ స్కూలుకు పరిమితమైంది. దరఖాస్తులో లేని ఓ ప్రార్థనా మందిరం సేవకిచ్చిన భూముల్లో నిర్మించడం, 2019లో అక్కడికి వైఎస్ సోదరి, జగన్ మేనత్త విమలారెడ్డి సందేశం ఇవ్వడానికి రావడం చర్చనీయాంశమైంది. వైఎస్ కుటుంబ అండదండలతోనే అంత విలువైన భూములను సేవ పేరుతో కట్టబెట్టారన్న విమర్శలు సైతం ఉన్నాయి. సేవకు తీసుకున్న ఈ భూములపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తోంది.

భూ వినియోగంలో నిబంధనలు పాటించారా? ఎంత స్థలంలో నర్సింగ్ కళాశాల నిర్వహిస్తున్నారు? ప్రార్థనా మందిరం ఎంత స్థలంలో నిర్మించారు? ఆసుపత్రి భవనం ఎందుకు నిర్మించలేదు? కలెక్టర్, జీవీఎంసీ అధికారులకు దరఖాస్తులేమైనా పెట్టారా? అనే కోణంలో పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.

**రూ.300 కోట్లు..:** 'సెయింట్ లూక్స్ మైనార్టీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఎటువంటి లాభాపేక్ష లేని సంస్థ. పేదల వైద్య అవసరాలు తీర్చే విధంగా మిషన్ ద్వారా ఆసుపత్రి నడుపుతాం. ఆసుపత్రి నిర్మాణం, నర్సింగ్ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అవసరమైన భూమి తక్కువ ధరకు ఇవ్వాలి' అంటూ దరఖాస్తు చేశారు. 22ఏలో నుంచి తొలగించి 2009లో ఫిబ్రవరి 20న స్థలం కేటాయిస్తూ అప్పటి వైఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సేవ పేరుతో ఎకరా రూ.25లక్షల చొప్పున ఎండాడ పరిధిలో సర్వే నంబరు 16/1లో 7.35 ఎకరాలు కేటాయించారు. ఇందులో 34 సెంట్లు రహదారి విస్తరణలోపోగా, మిగిలిన భూమి విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.300కోట్ల పైమాటే!

**ఎక్కడ జాప్యం?:** ఆసుపత్రి నిర్మాణానికి మట్టి స్వభావం సరిగా లేదన్న వివరణ ప్రతినిధులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే నర్సింగ్ కళాశాలకు షెడ్లు, ప్రార్థనామందిరం నిర్మాణానికి ఉపయోపడిన భూమి ఆసుపత్రి నిర్మాణానికి సాధ్యమవ్వలేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కొన్నేళ్ల క్రితం సెయింట్ లూక్స్‌కి కేటాయించిన వాటిలో ఖాళీగా ఉన్న భూములు వెనక్కి తీసుకోవాలంటూ ప్రభుత్వానికి నియమించిన కమిటీ సూచించినా...అమలు కాలేదు. తాజాగా మళ్లీ భూ వినియోగంపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టడంతో సెయింట్ లూక్స్ అంశం తెరపైకి వచ్చింది. ఈ అంశంపై కరస్పాండెంట్ ప్రీతమ్ లూక్ మాట్లాడుతూ... 'జీవీఎంసీకి ప్లాన్ పంపగా...కొన్ని అభ్యంతరాలు తెలిపారు. కొత్త భవనాల నిర్మాణం కోసం, బ్యాంకు నుంచి ఆర్థిక సాయం కోసం హక్కు పత్రాన్ని ఇప్పించాలని కలెక్టర్‌కు 2024 సెప్టెంబర్‌లో అర్జీ అందజేశాం' అని తెలిపారు.

# అక్షర బంధం.. అపూర్వం

తిరుపతి: ఆ తరగతి గదులు వారికి భవిష్యత్తును చూపాయి.. ఆ ప్రాంగణం వారి కలలకు రెక్కలు తొడిగింది. దశాబ్దాల క్రితం అదే క్యాంపస్‌లో సాధారణ విద్యార్థులుగా అడుగుపెట్టి, నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆ 'అక్షర పుత్రులు' తమ చదువుల తల్లి ఋణం తీర్చుకుంటున్నారు. వారు చదువుకున్న విశ్వవిద్యాలయానికి ఏదో ఒకటి చేయాలనే తపన.. నేడు ఎస్వీయూ క్యాంపస్‌లో ఓ అద్భుత కట్టడానికి ప్రాణం పోసింది. సుమారు రూ. 7 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక హాస్టల్ భవనం, పూర్వ విద్యార్థుల ఐక్యతకు, మాతృ సంస్థపై వారికున్న మమకారానికి నిలువుటద్దంగా నిలుస్తోంది.

**రూ. కోట్లతో వసతి సౌకర్యం**

విశ్వవిద్యాలయంలో పెరుగుతున్న విద్యార్థుల అవసరాలను గుర్తించిన అలుమిని అసోసియేషన్, సుమారు రూ. 25 కోట్ల అంచనాతో ఒక భారీ రెక్టాంగ్యులర్ బ్లాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదటి దశలో రూ.7 కోట్ల ఖర్చుతో నిర్మించిన భవనం ఇప్పుడు ప్రారంభానికి సిద్ధమైంది. మొత్తం 28 గదులతో కూడిన ఈ భవనంలో సుమారు 150 మంది విద్యార్థినులకు వసతి కల్పించనున్నారు. రూ.1.30 కోట్లతో కింది అంతస్తులో అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను నిర్మించారు. విద్యార్థుల మానసికోల్లాసం కోసం ప్రత్యేకంగా 'రిక్రియేషన్ హాల్'నూ ఏర్పాటు చేశారు.

**బంగారు భవిష్యత్తుకూ..**భవన నిర్మాణానికే పరిమితం కాకుండా,



ప్రస్తుత విద్యార్థుల చదువులకు ఆసరాగా నిలుస్తోంది అలుమిని అసోసియేషన్. ప్రతి విభాగంలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు 'మెరిట్ స్కాలర్‌షిప్'లు అందజేస్తున్నా రు. దీనికోసం రూ.20 లక్షలతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీతో విద్యార్థుల వార్షిక ఫీజులు చెల్లిస్తున్నారు. గత ఎనిమిదేళ్లుగా ఈ ప్రక్రియ నిరంతరాయంగా సాగుతోంది. గతంలోనే గర్ల్స్ కమ్యూనిటీ సెంటర్, వివిధ విభాగాల్లో సెమినార్ హాళ్లనూ అలుమిని ఆధునీకరిం చింది.

**స్ఫూర్తిదాయకం.. ఈ బంధం**

2016లోని పూర్వ విద్యార్థుల సంఘం, 2024-26 మధ్య కాలంలో శరవేగంగా పనులు పూర్తి చేసింది. కేవలం ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా, తమవంతు బాధ్యతగా వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వీరి కృషి అందరికీ ఆదర్శం. తదుపరి దశలో 'సౌత్ బ్లాక్' నిర్మాణానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# కంకర వేశారు.. సమస్యలు పరిచారు

చిత్తూరు : కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోంది. పల్లె పండగ ద్వారా అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, మినీ గోకులాలు, తదితర నిర్మాణాలు చేపడుతూ మౌలిక వసతులు కల్పిస్తోంది. అదే సమయంలో 2018 చివర్లో అనుమతులు మంజూరై కంకర పరిచి వదిలేసిన రోడ్లపై మాత్రం దృష్టి పెట్టడంలేదు. ప్రజాప్రతినిధులు సైతం చొరవ చూపడంలేదు. దాంతో పల్లెల్లోని ప్రజలు ఆ మార్గంలో ప్రయాణమంటేనే జడుసుకుంటున్నారు. గత వైకాపా ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోలేదని.. ఇప్పుడైనా వాటిని పూర్తి చేసేలా చొరవ చూపాలని కోరుతున్నారు.

**రూ.84 కోట్లతో పనులు**

2014- 19 మధ్య ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ నిధులతో శరవేగంగా రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఉపాధిహామీ నిధులతో పాటు వివిధ సంస్థల నుంచి రుణాలు తీసుకుని ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు గ్రామాలను అనుసంధానించే రోడ్లు నిర్మించారు. ఈ క్రమంలోనే 2018- 19లో రూ.84 కోట్లతో పనులు చేపట్టారు. పలమనేరు, గంగాధరనెల్లూరు, పుంగనూరు, తంబళ్లపల్లె, సత్యవేడు, పీలేరు, నగరి నియోజకవర్గాలకు ఎక్కువగా వీటిని మంజూరు చేశారు. 2018 చివర్లో పనులు మొదలుపెట్టారు. గుత్తేదారులు నాటి ప్రజాప్రతినిధుల ఒత్తిడితో తొలుత గ్రావెల్ పోసి కంకర పరిచారు. ఈలోపు బిల్లులకు ఇబ్బంది రావడంతో పనుల్లో వేగం తగ్గింది.తర్వాత ఎన్నికల నియమావళి రావడం.. ప్రభుత్వం మారితే బిల్లులు రావన్న భయంతో గుత్తేదారులు



పనులు మధ్యలోనే ఆపేశారు.

**పుంగనూరు, తంబళ్లపల్లెలో మాత్రమే**

వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలపై భరోసా లేకపోవడంతో కాంట్రాక్టర్లు మిన్నకుండిపోయారు. పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో మాత్రం.. స్థానిక ప్రజాప్రతినిధులు వాటిని దక్కించుకుని పూర్తి చేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నాయకులు వచ్చినప్పుడు స్థానికులు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

**ఆరు నెలల్లో పూర్తవుతాయనుకున్నా**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పనులు పూర్తవుతాయని ప్రజలు ఆశించారు. కానీ వీటిని నిర్మించడానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. ఒక్క పలమనేరు నియోజకవర్గంలో మాత్రం కొంతవరకు చేసినా ఇప్పటికీ కొన్ని రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. పెనుమూరు మండలంలో విసిగి వేసారిన జనాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పనులు చేసుకున్నారు.

# పుత్తూరులో డంపు.. చెన్నై తరలింపు

పుత్తూరు: ఇసుక ఉచితం మాట దేవుడెరుగు. అక్రమార్కులకు మాత్రం కాసులు కురిపిస్తోంది. పుత్తూరు పరిధిలో ఇసుక రీచ్ లేకపోవడంతో నగరి, తిరుపతి జిల్లా నాగలాపురం నుంచి ఇసుక ఇళ్ల నిర్మాణానికి తెస్తుంటారు. కొన్నేళ్లుగా ఏర్పేడు మండలం పాపానాయుడు పేట నుంచి అక్రమంగా పుత్తూరుకు నిత్యం వంద ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నారు. ఇక్కడ కొందరు ఆ ఇసుకను డంప్ చేసి చెన్నైకు టిప్పర్లలో తరలిస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలోని అక్రమార్కులే నేడూ ఈ దందా నడిపిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. 15 నెలల కిందట ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అధికారుల సమీక్షలో వాహనాలను ఆపి పర్మిట్లు తనిఖీ చేయాలని చెప్పినా.. ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇసుక అక్రమ తరలింపుపై చర్యలు తీసుకుంటామని పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు.

# కట్టలిచ్చి.. కట్టుకోండి



అనకాపల్లి: పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తమ జేబులు నింపుకోవడం కోసం ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. కాసులిస్తే చాలు.. అదనపు అంతస్తులు ఎన్ని నిర్మించినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. భవనాలకు సెట్‌బ్యాక్ లేకపోయినా.. సెట్ చేసుకుంటున్నారు. వాణిజ్య భవనాలను నివాస గృహాలుగా మార్చేస్తున్నారు. పైసలిస్తే ఎన్ని ఉల్లంఘనలు ఉన్నా.. ఆమోదం తెలుపుతున్నారు. అనకాపల్లి జోన్ పరిధిలో జీ+2 అయితే స్థానిక వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అంతకు మించి అంతస్తులు కట్టాల్సి వస్తే.. జోన్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలి. వాటిని పట్టణ ప్రణాళిక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదం తెలపాలి. కానీ ఇలా జరగడంలేదు. చాలామంది అదనపు అంతస్తులు సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మించేస్తున్నారు. కొండకొప్పాక, కొత్తూరు, సిరసపల్లి పరిసర ప్రాంతాల్లో ఈ తరహాలో భవనాలున్నాయి.

గవరపాలెం, ఉడ్‌పేట, పెరుగుబజార్, చినరామస్వామి ఆలయ సమీపంలో గ్రీన్ మ్యాట్‌లు కట్టి ఇష్టానుసారం నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కార్యాలయానికి సమీపంలో ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నా.. అధికారుల్లో కనీసం చలనం లేదు. రింగ్‌రోడ్డు సమీపంలో ఆటోకూడా వెళ్లలేని వీధుల్లో భారీ భవనాలు కడుతున్నారు. మరికొంత మంది పాత భవనాలపైన ఎటువంటి అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్నారు.

అనకాపల్లి పట్టణంలో చాలాచోట్ల డ్రైనేజీలపైనే ప్రహరీ నిర్మిస్తున్నారు. కనీసం రెండు అడుగులు సెట్‌బ్యాక్ వదలాల్సి ఉండగా.. ఎక్కడా ఈ నిబంధనలు పాటించడం లేదు. అనుమతులు తీసుకోవడానికి నివాస భవనానికి గజానికి రూ. 4 వేలు, వాణిజ్య భవనానికి రూ. 13 వేలు చెల్లించాల్సి ఉంటుంది. చాలామంది నివాస అనుమతులతో వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నారు. సంబంధిత అధికారులు సొమ్ము తీసుకుని ఆమోదం తెలుపుతున్నారు.

**అరకొర అనుమతులు:** అనకాపల్లి పట్టణంలో ప్రస్తుతం 230 వరకు భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అందులో 170కి పైగా నిబంధనలను ఉల్లంఘించి నిర్మిస్తున్నారు. ఉల్లంఘనులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. డబ్బులు ముట్టజెప్పిన వారి జోలికి వెళ్లడం లేదు. దీంతోపాటు స్థానిక నేతలు చెప్పిన వారికి మినహాయింపు లభిస్తోంది. ఉన్నతాధికారులకు లెక్కచూపేందుకు అడపాదడపా దాడులు చేసి.. అడ్డుకుంటున్నట్లు నమోదు చేస్తున్నారు.

**నిబంధనలు పాటించకుంటే చర్యలు**

– చక్రవర్తి, జోనల్ కమిషనర్, అనకాపల్లి

జోన్ పరిధిలో నిబంధనలు పాటించకుండా అక్రమంగా నిర్మాణాలు చేయకూడదు. అదనపు భవనాలు నిర్మించాలనుకుంటే తప్పనిసరిగా పట్టణ ప్రణాళిక విభాగానికి దరఖాస్తు చేసుకోవాలి. అక్రమంగా నిర్మాణాలు కొనసాగిస్తుంటే ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# పరీక్షలు సాగవు.. నాణ్యత తేలదు



బాపట్ల: జిల్లాలో ఆక్వా ప్రధాన రంగం. విదేశాలకు ఎగుమతుల ద్వారా ఏటా రూ.కోట్ల ఆదాయం వస్తోంది. చేపలు, రొయ్యలకు వచ్చే వ్యాధుల్ని సకాలంలో గుర్తించి రసాయనాలు పిచికారీ చేస్తేనే పంట చేతికందుతుంది. రొయ్యల పిల్లలు నాణ్యమైనవో.. కావో నిర్ధారించుకోవడం కూడా అత్యంత కీలకం. నాణ్యతలేని పిల్లల్ని చెరువుల్లో పోస్తే రూ.లక్షలు పెట్టుబడి పెట్టినా దిగుబడులు రాక సాగుదారులు నష్టపోతారు. వీటన్నింటికి ప్రయోగశాలలు కీలకం. మత్స్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఏర్పాటుచేసిన ఆక్వా ప్రయోగశాలలు పని చేయనందున రైతులు ప్రైవేటు ప్రయోగశాలలపై ఆధారపడాల్సి వస్తోంది.

జిల్లాలో సుమారు 23,800 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. రొయ్యలు, చేపలు, పీతలు సాగు చేస్తున్నారు. తొమ్మిది తీర మండలాల్లోనూ సాగు విస్తరించి ఉంది. హేచరీల్లో పిల్లలు కొనుగోలు చేసి చెరువుల్లో పోసేముందు నాణ్యత పరీక్షలు చేయిస్తారు. పిల్ల రొయ్యల్లో ఎలాంటి వ్యాధులు, వైరస్‌లు లేవని.. గట్ బాగా ఉందని పరీక్షల్లో నిర్ధారించిన తర్వాతే కొనుగోలు చేస్తారు. రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లో గత ప్రభుత్వ హయాంలో ఆక్వా ప్రయోగశాలలు నిర్మించారు. అయితే అన్ని పరీక్షలు చేయడానికి అవసరమైన సామగ్రి, నిపుణులను కేటాయించలేదు. కేవలం లవణ స్థాయి, పీహెచ్, నీటి పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా రైతులు ప్రైవేటు ప్రయోగశాలలపై ఆధారపడుతున్నారు. ప్రయోగశాలల నిర్వాహకులు పరీక్షల స్థాయిని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. అలాగే కొందరు హేచరీల యజమానులతో కుమ్మక్కై పరీక్షలు సరిగా చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ కారణంగా నాణ్యత లేని రొయ్యపిల్లలు చెరువుల్లో వేసి సాగుదారులు నష్టపోతున్నారు. అదే మత్స్య శాఖ ఆధ్వర్యంలోని ఆక్వా ప్రయోగశాలల్లో అన్ని పరీక్షలు చేస్తే ఆరంభంలోనే పిల్ల రొయ్యల్లో వైరస్‌లు, వ్యాధులు గుర్తిస్తే అవకాశం ఉంటుంది. నష్టాల నివారణకు వీలుంటుంది.

ఆక్వా సాగుకు సంబంధించి అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు బాపట్ల, రేపల్లె, దేశాయిపేట మార్కెట్ కమిటీల ఆవరణల్లో సమీకృత ఆక్వా, అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు రూ.1.20 లక్షలతో నిర్మించారు. ఇక్కడ నీరు, సెలినిటీ, పీహెచ్ లాంటి కొన్ని పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. వైరస్, బ్యాక్టీరియా పరీక్షలు చేయడం లేదు. ఆక్వా రైతులు అటు ఒంగోలు, ఇటు విజయవాడ వెళ్లాల్సి వస్తోందని ఆక్వారైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సిబ్బందిని నియమించి అన్ని రకాల పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ప్రారంభించారు.. వదిలేశారు..!

వి.ఎల్.పురం: గత వైకాపా సర్కారు నిర్వాకం వల్ల జిల్లాలో నేటికీ కొన్ని చోట్ల ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. అప్పట్లో సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం.. రూ.కోట్లలో బిల్లులు పెండింగ్ పెట్టడంతో 119 భవనాల పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఏళ్లు గడిచినా అవి మాత్రం అందుబాటులోకి రాకుండా పోయాయి. ఆయా మండలాల్లో పలు చోట్ల సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు ఇప్పటికీ అద్దె భవనాల్లోనూ, పరాయి పంచన కొనసాగాల్సి పరిస్థితి. 2022లో జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు(విలేజ్ హెల్త్‌క్లినిక్)కు కలిపి మొత్తం 1,101 భవనాలు మంజూరయ్యాయి. స్థల సమస్యలు, కోర్టు కేసులు తదితర కారణాలతో వాటిని 978కు కుదించినప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాలేకపోయింది.



పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మాణాలు చేపట్టినప్పటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు పనులు మధ్యలోనే నిలిపేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు గుత్తేదారులపై ఒత్తిడి తీసుకురావడంతో 859 భవనాలు మాత్రం పూర్తిచేయగా మిగతావి అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

**బకాయిలు రూ. 23 కోట్లు**

పూర్తయిన భవనాలకు బిల్లులు మాత్రం పూర్తిగా చెల్లించలేదు. అప్పటివరకు పూర్తయిన, వివిధ దశల్లో ఉన్నవాటికి రూ.39.03 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.23 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేసినా గత సర్కారు వాటిని నిలిపేసింది. దీంతో గుత్తేదారులు మిగిలిన పనులు పూర్తి చేయడానికి ఆసక్తి చూపలేదు.కూటమి ప్రభుత్వంలోనై నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాల్సి ఉంది.

# నివేదికలు మట్టిదాఖలు

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. ఏడాదిన్నర కిందట విజిలెన్స్ అధికారులు మహానంది మండలం తమడపల్లె, బొల్లవరం, గోపవరం చెరువుల్లో తనిఖీలు చేశారు. అంకిరెడ్డిపల్లె చెరువులో రైతుల పేరుతో దందా సాగుతోందంటూ నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోలేదు. నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు, పెద్ద చెరువు, కానాల, చాపిరేవుల చెరువులు, ఆళ్లగడ్డ మండలంలోని పెద్ద చింతకుంట చెరువుల్లో జరిగిన అక్రమాలపై రికవరీకి ఆదేశించినా చర్యలు కానరావడం లేదు. ఆయా చెరువు చెరువు ప్రాంతాల్లోనూ యథావిధిగా మట్టి తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. శిరివెళ్ల మండలంలోని మహదేవపురం, యల్లావత్తుల సమీపంలోని చెరువు, రుద్రవరం మండలంలోని తిప్పల్లో జరిగే తవ్వకాలకు అడ్డే లేకుండా పోతోంది.

**రైతుల పేరుతో దగా**

మహానంది మండలం గాజులపల్లె సమీపంలోని అంకిరెడ్డి చెరువులో లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తవ్వేశారు. రైతుల పేరుతో అప్పటి కొందరు నాయకులు ఎన్‌వోసీలు ఇప్పించారు. ఈ నేపథ్యంలో చెరువులో అడ్డదిడ్డంగా తవ్వకాలు చేపట్టారు. క్యూబిక్ మీటరుకు రూపాయి చొప్పున చెల్లించి అనుమతులు పొంది యంత్రాలు పెట్టి మరీ తవ్వకాలు చేశారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అడ్డుకట్ట వేసింది. కొద్దికాలం కిందట తిరిగి తవ్వకాలు ప్రారంభమయ్యాయి. చెరువుతోపాటు రాత్రివేళలో బయట కూడా తవ్వి మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారు.

**ఇటుక బట్టీలకు తరలింపు**

అక్రమ తవ్వకాలపై గ్రామస్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తామని అధికారులు చెబుతున్నా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఇదే అవకాశంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రత్యేకించి రాత్రివేళల్లో తవ్వకాలు చేపట్టి నంద్యాలలోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. చాలా బట్టీల్లో నెలల తరబడి ఉపయోగించుకునేలా మట్టి కుప్పలు కనిపిస్తున్నాయి. **డి.పట్టా భూములు కొనుగోలు చేసి..**

మహానంది, శిరివెళ్ల మండలాల్లో డి.పట్టా భూములను అనధికారికంగా కొనుగోలు చేయడం.. లీజుకు తీసుకోవడం ద్వారా అక్రమాలు ప్రారంభమవుతున్నాయి. నిబంధనల మేరకు డి.పట్టా భూముల్లో లబ్ధిదారులు మాత్రమే సాగు చేయాలి. ఎలాంటి పరిస్థితుల్లో మట్టి అమ్మకూడదు. కానీ వీటిల్లో ఎర్రమట్టి తవ్వకాలు సాగుతున్నాయి. క్యూబిక్ మీటరు మట్టికి గనుల శాఖకు రూ.40 చొప్పున చెల్లించాలి. దీంతోపాటు ఒక శాతం ఐటీ, ఒక శాతం కార్మిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన టిప్పరుకు రూ.220 వరకు గనుల శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండా ఎన్‌వోసీలు మాత్రమే తీసుకుని ఒక్క శిరివెళ్ల మండలంలోనే 300 ఎకరాల్లో ఎర్రమట్టి కోసం గత వైకాపా ప్రభుత్వ హయాంలో భారీగా తవ్వేశారు. మహానంది మండలంలో మరో 400 ఎకరాలు, రుద్రవరం మండలంలో వంద ఎకరాల్లో అక్రమ తవ్వకాలు జరిగాయి.

# తెరమాటున ఇసుక దందా

ఆదోని : ఆదోని పట్టణంలో కొందరు ఉచిత ఇసుకకు తూట్లు పొడుస్తున్నారు. తుంగభద్ర నదిలో సి.బెళగల్ మండల పరిధిలో ఐదు చోట్ల రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇసుక తీసుకెళ్తున్నారు. కౌతాళం మండలంలోని గుడికంబాలి, నదిచాగి, మరళి రీచ్‌లకు పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకపోవడంతో తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు. ఇక్కడ రాత్రివేళ గుట్టుగా తవ్వేస్తున్నారు. అక్కడి నుంచి తీసుకొచ్చి బసవేశ్వరస్వామి కూడలిలో మారెమ్మవ్వ ఆలయం వెనుక ఓ పార్టీ నాయకుడి పాత దాబా స్థలంలో నిల్వ చేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా చుట్టూ ఎత్తుగా ఆకుపచ్చని తెరలు కట్టారు. అక్కడ ప్రైవేటు సైన్యం కాపలా కాస్తోంది. పట్టణానికి చెందిన ఎవరు కూడా నేరుగా రీచ్‌ల నుంచి తెచ్చుకోవడానికి వీల్లేదు. అందరూ పట్టణంలోని ప్రైవేటు నిల్వ కేంద్రానికి వెళ్లాల్సిందే. కాదంటే.. కేసులు, బెదిరింపులు

ఆదోని వాసులు నేరుగా ఇసుక రీచ్‌ల వద్దకు వెళ్తే అక్కడ నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారు. దీంతో పట్టణవాసులు చేసేది లేక ప్రైవేటు కేంద్రానికి వెళ్తున్నారు. నేరుగా తెప్పించుకోవాలని చూస్తే కుదరదు.. అధికార బలంతో యంత్రాంగంతోనే కేసులు నమోదు చేయించడం బెదిరించడం వంటివి చేస్తున్నారు. మరోవైపు కూటమిలోని మరో నాయకుడు ప్రభుత్వ ధరలకే ఇసుక సరఫరా చేస్తామని ఏకంగా ప్రైవేటు రవాణా కార్యాలయాన్ని తెరిచారు. వీరినీ ఒప్పించి తప్పించారు. టన్ను రూ.1200 రీచ్‌ల వద్దకు వెళ్లి రూ.40 చెల్లిస్తే టన్ను ఇసుక వస్తుంది. ఒక టిప్పర్‌లో 20 టన్నుల మేర పడుతుంది.

# జల రవాణాకు జీవం!

అమరావతి : జల రవాణాకు జీవం పోసేందుకు కసరత్తు జరుగుతోంది. బ్రిటీషు హయాంలో కీలకంగా ఉన్న బకింగ్‌హామ్ కెనాల్‌ను తిరిగి వినియోగంలోకి తెచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు ఈ తరహా కసరత్తు జరిగినా.. పట్టాలెక్కలేదు. ఇప్పుడు జాతీయ జల రవాణా వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు కేంద్రం మరోసారి దృష్టి పెట్టిన నేపథ్యంలో ఈ అంశం తెరపైకి వచ్చింది.

కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు సుమారు 1095 కిలోమీటర్ల మేర బకింగ్‌హామ్ కాలువ విస్తరించగా, ఎక్కడికక్కడ స్థానిక పేర్లతో పిలిచేవారు. బాపట్ల జిల్లా పరిధిలో కొమ్మమూరు కాలువగా గుర్తింపు పొందింది. కాలక్రమేణా అనేక కారణాలతో కాలువలో జల రవాణా నిలిచిపోగా.. కొన్నిచోట్ల ఆక్రమణలకు గురై అధ్వానంగా తయారైంది. రోడ్డు రవాణాపరంగా పెరుగుతున్న వ్యయం, మారుమూల ప్రాంతాలకు కరవైన కనెక్టివిటీ.. ఇలా పలు సమస్యలతో ప్రస్తుతం కేంద్రం మళ్లీ జల రవాణాపై దృష్టి పెట్టింది.

**కొమ్మమూరు కాలువలో..**

ప్రస్తుతం బకింగ్‌హామ్ కెనాల్‌పై కేంద్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే చేస్తోంది. సాధ్యాసాధ్యాలపై బాతీమెట్రిక్ (నీటి ప్రవాహపు అధ్యయనం), టోపోగ్రాఫిక్ (జల వనరుల స్వరూపం) సమగ్ర అధ్యయనం నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ నౌకా రవాణా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ ఓ ఏజెన్సీతో వారం రోజుల పాటు కొమ్మమూరు కాలువలో సర్వే చేసింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని వినియోగించి ప్రస్తుతం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేస్తున్నట్లు అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి.



**17 ఏళ్లుగా కసరత్తు**

బకింగ్‌హామ్ కెనాల్ జల రవాణామార్గం అభివృద్ధి కోసం గత 17 ఏళ్లుగా కసరత్తు జరుగుతోంది. 2009 నుంచి కేంద్ర ప్రభుత్వం వివిధ స్థాయిల్లో సమగ్ర అధ్యయనం చేయిస్తోంది. ఆర్థిక, ఆర్థికేతర విషయాలపై నిపుణుల నుంచి సమగ్ర సమాచారం సేకరిస్తోంది. అయితే, కొన్ని సందర్భాల్లో ఇచ్చిన నివేదికల్లో ఫీజుబులిటీ లేదని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే మహారాష్ట్రలోని నాసిక్ నుంచి పుదుచ్చేరి వరకు జాతీయస్థాయి జల రవాణా మార్గాన్ని రూపొందించే క్రమంలో ఇప్పుడు సర్వే నిర్వహించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. దీనికింద బాపట్ల జిల్లాలో నల్లమడ లాకుల వద్ద నుంచి పెదగంజాం లాకుల వరకు కాలువ వెడల్పును సుమారు 100 మీటర్లు పెంచే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. సాగు, తాగునీటికి ఇబ్బందులులేకుండా 365 రోజులపాటు నిర్దిష్ట పరిమాణం, ప్రవాహ వేగం స్థిరీకరించేలా డీపీఆర్ సిద్ధమవుతున్నట్లు జలవనరులశాఖ డీఈ ఎన్.కె.వి.ప్రసాద్ తెలిపారు. నాలుగో నంబరు కేటగిరీ కింద 500 మెట్రిక్ టన్నుల బరువైన నౌకలు ప్రయాణించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వివరించారు.

# ఐసర్‌లో ప్రవేశాల సందడి

ఏర్పేడు : శాస్త్రసాంకేతిక రంగాల్లో రాణించి, శాస్త్రవేత్తలుగా రాణించాలన్నది ప్రతి విద్యార్థి కల. అది సాకారం చేసుకోవడానికి విద్యార్థులకు అవకాశం వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న ఏడు ఐసర్‌లకు సంబంధించి కేంద్రప్రభుత్వం- 2026లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల చేసింది.

**60 మార్కులకు..**ఇంటర్మీడియట్లో ఎంపీసీ, బైపీసీ విభాగంలో 60 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు 55శాతం మార్కులు ఉంటే ఐఏటీ పరీక్ష రాసేందుకు అర్హులు. 60 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సీటు సాధించేందుకు అవకాశం ఉంటుంది. గతేడాది ఏడాది లక్షకు పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. ఈ ఏడాది సంఖ్య పెరిగే



అవకాశం ఉంది.

**కోర్సులు ఇవీ..**తిరుపతి ఐసర్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ (బీఎస్- ఎంస్) కోర్సులతో పాటు డేటా సైన్స్ ఎకనామిక్ సైన్సెస్, జియాలజీ వంటివి అందుబాటులో ఉన్నాయి. విదేశీ విశ్వవిద్యాలయాలతో విద్యామార్పిడి చేపడుతూ అంతర్జాతీయ పరిశోధనలు నిర్వహిస్తుండటం గమనార్హం. ఈ ఏడాది 250 సీట్లు భర్తీచేసేందుకు చర్యలు చేపట్టారు.

**అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు**

పదేళ్లకిందట అందుబాటులోకి వచ్చిన తిరుపతి ఐసర్‌లో విశాలమైన తరగతి గదులు, యువతి, యువకులు, ఆచార్యులకు వేర్వేరుగా వసతిగృహాలు, క్రీడా ప్రాంగణాలు, 250 ఎకరాలకు పైగా విశాలమైన ప్రాంగణం, గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయి.

**ప్రవేశ పరీక్ష ముఖ్య తేదీలు**

జూన్ 7న దేశవ్యాప్తంగా నిర్వహించే ఐఏటీ పరీక్షకు మార్చి 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 13 నుంచి 15 వరకు కరెక్షన్ చేసుకునే అవకాశం కల్పించారు. మే 24న హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచుతారు.

# కోవెలకు కొత్తరూపు



గుంతకల్లు : ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం కొత్తరూపు సంతరించుకోనుంది. పునర్నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధికి దాతలు రూ. కోట్లలో విరాళాలు ఇవ్వడంతో అధికారులు పనులు మొదలు పెట్టారు.

**శరవేగం**

డోనర్ పద్ధతిపై దేవాలయ పునఃనిర్మాణానికి రాయచూర్‌కు చెందిన రాజేంద్రరెడ్డి దేవాలయం గర్భగుడి, విమానగోపురం, శిఖరం, అర్ధమండపం తమ సొంతఖర్చు రూ.5 కోట్ల అంచనాతో తయారు చేయిస్తున్నారు.దేవస్థానం మహామండపం నిర్మాణాన్ని హైదరాబాద్‌కు చెందిన అంజనీ ప్రసాద్ తమ స్వంత ఖర్చుతో రూ.4 కోట్ల అంచనాతో పనులు చేయిస్తున్నారు. తమిళనాడు నుంచి వచ్చిన శిల్పులు గ్రానైట్‌కు శిల్ప ఆకృతులను వేగవంతంగా తీర్చిదిద్దుతున్నారు.

**ఫిబ్రవరి 28న బాలాలయం..**

తిరుమల తిరుపతి దేవస్థాన వైదిక యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పాంచరాత్ర ఆగమ పండితులు అభిప్రాయం తీసుకుని ఈనెల ఫిబ్రవరి 28న ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి 9.15 గంటలకు బాలాలయం ప్రతిష్ఠాపనకు ముహూర్తం నిర్ణయించారు. తిరుపతిలో దారు (టేకు కర్ర)తో స్వామివారి రూపాన్ని తయారు చేస్తున్నారు. బాలాలయ ప్రతిష్ఠాపన అనంతరం మూలవిరాట్‌ను తప్ప మిగిలిన ప్రాకారాన్ని తొలగించనున్నారు. బాలాలయంలో స్వామివారికి అభిషేకం, పూజ, హోమాది కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయి.

**ఉత్తరాయణంలో పునఃప్రతిష్ఠ**

ఉత్తరాయణ పుణ్యకాలంలో జూన్‌లో నూతన దేవాలయ పునఃప్రతిష్ఠ, కుంబాభిషేకం నిర్వహించేందురికు ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో ఆర్వోప్లాంటు పనుల జరుగుతున్నాయి. భక్తులకు శుద్ధజలాలను అందిస్తాం.. ఎం.విజయరాజు, డిప్యూటీ కమిషనర్, కసాపురం దేవస్థానం.

# శకటం వచ్చేలోపు కాల్చేస్తుంది!



ముదిగుబ్బ : జిల్లాలో ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే చాలు ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మంటలు అంటుకున్న వెంటనే సమాచారం ఇచ్చినా అగ్నిమాపక శకటం ఘటనా స్థలానికి చేరుకోవడానికి గంటల సమయం పడుతోంది. ఈలోపు నష్టం జరిగిపోతోంది. జిల్లాలోని పలు మండల కేంద్రాలు అగ్నిమాపక కేంద్రాలకు 40 నుంచి 50 కిలోమీటర్లు దూరంలో ఉండటమే దీనికి ప్రధాన కారణం.

**పది మండలాలకు.. ఒకటే ఫైర్ ఇంజిన్**

కదిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలతోపాటు అమడగూరు, ఓడీసీ, నల్లమాడ, ముదిగుబ్బకి కదిరి నుంచే అగ్నిమాపక యంత్రం రావాల్సి ఉంది. ఇక్కడి నుంచి ముదిగుబ్బకి 30 కి.మీ, అక్కడి నుంచి గ్రామాలకు 30 కిలోమీటర్లకు ఫైర్ఇంజిన్ వచ్చేలోపు పూర్తిగా నష్టం జరిగిపోతుంది. ధర్మవరం నియోజకవర్గంతోపాటు కనగానపల్లి, సీకేపల్లి, రామగిరికి ధర్మవరం నుంచే అగ్నిమాపక వాహనాలు వెళ్లాలి. ధర్మవరం నుంచి రామగిరి 35 కి.మీ, పేరూరుకు వెళ్లాలంటే 50 కిలోమీటర్లు దూరం ఉంది. మడకశిర నుంచి అగళి మండలం దూరంగా ఉంది. పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం ప్రాంతాల్లోనూ మండల కేంద్రాలకు ఇదే పరిస్థితి నెలకొంది.

**జిల్లాలో కొత్తవి ఏర్పాటేదీ..?**

జిల్లాలోని పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, హిందూపురం ప్రాంతాల్లో ఇటీవల ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగాయి. అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగుతున్నాయి. ముఖ్యంగా నివాసాల్లో విద్యుదాఘాతాలు, గోదాముల్లో నిల్వ ఉంచిన పంటలు, ఎండిన గడ్డివాములు మంటలకు ఆహుతవుతున్నాయి. పెరిగిన జనాభా, ప్రమాదాల ఆధారంగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అదనంగా అగ్నిమాపక యంత్రాలు లేదా కేంద్రాలు ఏర్పాటు చేస్తే నష్టాలను నివారించవచ్చని ప్రజల నుంచి డిమాండ్ ఉంది.

**ప్రమాదాలను నివారిస్తాం**

జిల్లాలో ఎప్పటికప్పుడు అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రమాదాలను నివారిస్తున్నాం. కొన్ని మండలాలు అగ్నిమాపక కేంద్రాలకు దూరంగా ఉన్నాయి. అలాంటిచోట కొత్తగా మిస్ట్‌జీప్‌ను వినియోగిస్తున్నాం. కొత్త కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంటుంది.

మాధవనాయుడు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

జిల్లా: శ్రీసత్యసాయిఅగ్నిమాపక కేంద్రాలు: 6

వాహనాలు: 7


సిబ్బంది : 21

గతేడాది జరిగిన ప్రమాదాలు: 500

# సుందరం.. సర్వశోభితం!

అనకాపల్లి: ఉత్తరాంధ్ర వాసుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. మార్చి 17న అమ్మవారి జాతర ప్రారంభం కానుంది. ఈలోగా కోవెలను ప్రారంభించి భక్తులకు మూలవిరాట్ దర్శనం కల్పించేందుకు పాలకవర్గం, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. దశాబ్దాల కిందట నిర్మించిన ఆలయం కావడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మూడేళ్ల కిందట రూ. 12 కోట్లతో ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అంతరాలయం, గర్భాలయం, ప్రాకారంతోపాటు మూడు రాజగోపురాలను నిర్మిస్తున్నారు.

నూకాలమ్మ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆది, మంగళ, గురువారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. గర్భాలయం ఇరుకుగా ఉండటంతో అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఏటికేడు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గర్భాలయాన్ని విశాలంగా నిర్మిస్తున్నారు.తెదేపా ప్రభుత్వ హయాంలో గాలిగోపురాన్ని రూ. 2.75 కోట్లతో 94 అడుగుల ఎత్తులో నిర్మించగా, మిగిలిన మూడు గాలిగోపురాలను ఇప్పుడు నిర్మించారు. నూకాలమ్మ మూలవిరాట్‌ను కదపకుండా ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. మూలవిరాట్‌ను భక్తులు దర్శించుకునే అవకాశం లేకున్నా.. నిత్యం ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు.



భక్తులు సమర్పించే కానుకల రూపంలో ఏటా రూ. మూడు కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. ఈ నిధులతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గతంలో ఆలయం 98 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పు ఉండేది. ప్రస్తుతం 175 అడుగుల పొడవు, 94 అడుగుల వెడల్పు, గర్భాలయం 18 అడుగుల పొడవు, వెడల్పు ఉండేలా నిర్మిస్తున్నారు. అంతరాలయం, మండపాన్ని విస్తరించారు. జాతరకు విచ్చేసే భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడుతున్నట్లు దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను చెప్పారు.

# 'పాడా' మురవాలి..
# స్మార్ట్ సిటీ వెలగాలి..

కాకినాడ: ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టేది బడ్జెట్.. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలకు మోక్షం లభించేది పద్దు నుంచే. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోని రంగాలకు భారీగా నిధులు అవసరం. అందులో కాకినాడ స్మార్ట్ సిటీ ఒకటి. ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినా గత వైకాపా సర్కారు నీరుగార్చేసింది. కూటమి ప్రభుత్వం ఈనెల 14న బడ్జెట్ ప్రవేశపెడుతున్న వేళ నిధులిచ్చి దన్నుగా నిలవాలని నగరవాసులు కోరుతున్నారు.

**ఈ పనులు చేయాలి..**

నగరపాలక సంస్థ కార్యాలయం పనులు పూర్తికావాలి.

కమాండ్ కంట్రోల్ రూం నిర్వహణ లేక పడకేసింది.

మత్స్యశాఖ జేడీ కార్యాలయం మధ్యలోనే నిలిచింది.

సర్పవరం నుంచి జగన్నాథపురం వంతెన వరకు రహదారిని బాగుచేయాలి. నాడు కేంద్ర నిధులు మళ్లించేసి

కాకినాడను ఆకర్షణీయంగా మార్చేందుకు గతంలో రూ.1,005



కోట్లతో పనులు మంజూరుచేశారు. 2014-19 మధ్య తెదేపా హయాంలో చాలావరకు పనులు మొదలై పూర్తికావస్తున్న దశలో వైకాపా ప్రభుత్వం వచ్చింది. అప్పటివరకు ఉన్న పనులు నిలిచిపోయాయి. కేంద్ర నిధులు సైతం మళ్లించేసింది. రాష్ట్ర వాటా చెల్లించలేదు. గుత్తేదారులకు రూ.110 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ప్రస్తుతం మళ్లీ స్మార్ట్ సిటీ పనులను పట్టాలెక్కించాలని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పలుమార్లు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ సైతం ఈసారి పద్దులో రూ.1000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

**'పాడా'కు ప్రాధాన్యం..**

ఉప ముఖమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పిఠాపురం. కొత్తగా పిఠాపురం పట్టణాభివృద్ధి సంస్థ (పాడా) రూపుదాల్చింది. ఇటీవల పవన్ పిఠాపురంలోని కొన్ని ప్రాంతాలను పరిశీలించి పట్టణాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక తయారుచేయాలని ఆదేశించారు. నేతలు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాధాన్యక్రమంలో చేపట్టాల్సిన పనులు గుర్తించారు. వాటిన్నింటికీ సుమారు రూ.100 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఆ మేరకు ప్రాధాన్యం లభిస్తుందని భావిస్తున్నారు.

# బా'భౌ'య్..!

కాకినాడ: జిల్లాలోని చాలా గ్రామాల్లో వీధి కుక్కల బెడద క్రమంగా పెరిగిపోతోంది. పల్లెలు, పట్టణాలు, నగరాల్లో ఎక్కడ చూసినా గుంపులుగా ఉంటున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తుండడంతో వారు గాయాలపాలవుతున్నారు.

కొందరు కుక్కకాటుకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ ఇబ్బంది మరీ ఎక్కువగా ఉంటోంది. పాఠశాలలకు వెళ్తున్న పిల్లల్ని కరుస్తున్నాయని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. శునకాల సంగతి పెరగకుండా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలనే ఆదేశాలున్నా.. రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. పరిస్థితిలో మాత్రం మార్పురావడం లేదు.కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి పలు జిల్లాల నుంచి ఏటా వేల సంఖ్యలో కుక్కకాటు బాధితులు వస్తుంటారు. రేబిస్ బారినపడిన వారి కేసులు ఏటా ఇక్కడికి వస్తుంటాయి. పలువురు మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో పీహెచ్‌సీ స్థాయి నుంచి ఏటా వేల సంఖ్యలో కుక్కకాటు కేసులు నమోదవుతాయి. వీటికి అదనంగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించేవారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది.

**ఘటనలివిగో..**

పిఠాపురం మండలం విరవాడకు చెందిన ఎ.శ్రీను(35) ఆరు నెలల క్రితం ప్రత్తిపాడు మండలం రాచపల్లి పొలాల్లో కుక్క కాటుకు గురయ్యాడు. టీకాలు వేయించుకున్నా అతను తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ప్రథమ చికిత్స అనంతరం ఈ నెల 3న కాకినాడ జీజీహెచ్‌లో చేరారు. రేబిస్ సోకిందని వైద్యులు నిర్ధారించగా చికిత్సపొందుతూ మర్నాడు మృతిచెందాడు. గతేడాది కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన 54



ఏళ్ల మహిళ రేబిస్‌తో జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతిచెందింది. కుక్కకాటుకు గురైన ఆమె పూర్తి స్థాయిలో వ్యాక్సిన్ వేయించుకోకపోవడంతో రేబిస్‌కు బలైంది.

**కరిచిన వెంటనే టీకా వేయించాలి**

కుక్క కరిచినపుడు, శరీరంపై గాయాలున్న చోట కుక్క నాకినపుడు వాటి నోటిలోని చొంగలో ఉండే లిస్సా వైరస్ మన శరీరం లోపలికి వెళ్తే రేబిస్ ముప్పు తప్పదు.కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు నీళ్లతో శుభ్రంగా కడగాలి. వీలైనంత త్వరగా యాంటీ రేబిస్ టీకా వేయించుకోవాలి.రేబిస్ పీడితుల్లో మితిమీరిన భయం, నీటిని చూస్తే బెదరడం, నోటి వెంట లాలాజలం కారడం, ఏమీ మింగలేనంత గొంతునొప్పి, ఇతర లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి ముదిరితే గొంతు కండరాలకు పక్షవాతం సోకి.. ఏమీ తినలేక కోమాలోకి వెళ్లి చనిపోతారని వైద్యులు పేర్కొంటున్నారు.

# ఇక మురుగు.. భూగర్భంలో పరుగు

భీమవరం : తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలకు డ్రెయినేజీ, మురుగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. ఏళ్లుగా నిలిచిపోయిన భూగర్భ మురుగు కాలువ వ్యవస్థ (యూజీడీ), మురుగునీటి నీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ)లకు కూటమి ప్రభుత్వం అమృత్ 2.0లో భాగంగా నిధులు మంజూరు చేయడంతో ఫిబ్రవరి నెలాఖరులో పనులు మొదలు కానున్నాయి.ఇదీ విషయం: తాడేపల్లిగూడెం ఒకటో పట్టణ పరిధిలో 2009లో రూ.61.50 కోట్ల అంచనాతో యూజీడీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్లను ఎక్కడికక్కడ ధ్వంసం చేసి మురుగు నీరు పారేందుకు భూమిలో తూరలు ఏర్పాటు చేశారు. రూ.28 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. పైపులైన్ల అనుసంధాన ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఎన్నికలు వచ్చాయి. తీరా ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత వచ్చిన నేతలెవరూ అటు వైపు కన్నెత్తి చూడలేదు. యూజీడీ గాడిన పడాలంటే మురుగు నీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. దీని కోసం గతంలో కడకట్ల శివారు యానాదుల కాలనీలో 3.98 ఎకరాల భూమిని కేటాయించారు. రూ.32.14 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

ఇదీ ఉపయోగం: 2019లో వైకాపా హామీల్లో భాగంగా భూగర్భ కాలువ పూర్తి చేస్తుందనుకున్నా అడుగు ముందుకు పడలేదు. పైగా



ఎస్టీపీ లేకపోవడంతో మురుగునీటిని శుద్ధి చేయకుండా ఏలూరు కాలువలో కలిపేస్తున్నారు. దాంతో అటు రైతులు, ఇటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు పారక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. కాలువలు, రోడ్లపైకి చేరడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. జిల్లాలో టైఫాయిడ్, డెంగీ బారిన పడుతున్న బాధితులు గూడెంలోనే అధికంగా ఉంటున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రజలకు మురుగునీటి సమస్య తీరుతుంది.

పట్టణ పరిధిలో వార్డులు - 18
నివాసితులు - సుమారు 60 వేల మంది
కేటాయించిన నిధులు - రూ.88.18 కోట్లు

# అనుమతులు కొంత.. తవ్వకాలు కొండంత..!

వజ్రపుకొత్తూరు : జిల్లాలో మట్టి, కంకర తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. భూగర్భ గనులు, రెవెన్యూశాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో దందా 'మూడు పువ్వులు.. ఆరు కాయలు' మాదిరిగా సాగుతోంది. కొండలు, గుట్టలు కళ్లెదుటే కరిగిపోతున్నా పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అనుమతులకు మించి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు కన్నెత్తి చూడట్లేదు. సామాన్యులు అడ్డుకుంటున్నా అక్రమార్కులు లెక్క చేయట్లేదు.

వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాల పరిధి బెండిగేటు-నారాయణపురం మధ్య ప్రభుత్వ భూముల్లో కంకర, మట్టి తవ్వేస్తున్నారు. పూడిలంక రహదారి పనులకు బెండికొండపై కంకర తవ్వకాలకు కొంత అనుమతి ఉంది. దాన్ని ఆసరాగా తీసుకుని అక్రమార్కులు సిండికేటుగా మారి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. రహదారి పనులు పూర్తయినా కంకర తరలించుకుపోతున్నారు. బెండికొండను ఆనుకుని అటవీ భూములున్నాయి. సర్వే నంబరు 1లోని ఈ కొండ చుట్టూ పొక్లెయిన్లతో తవ్వేసి.. రాత్రి వేళ తరలిస్తున్నారు. పీఎంపురం, కొండవూరు, ఉండ్రుకుడియ, తాడివాడ ప్రాంతాల్లోని కొండల్ని సైతం పిండి చేస్తున్నారు.

**వాటినీ వదలట్లేదు..** కవిటి అగ్రహారం వద్ద ప్రైవేట్ వ్యక్తులు సుమారు 40 ఎకరాల భూమి కొనుగోలు చేసి 10 ఏళ్ల కిందట లేఅవుట్ వేసి.. స్థలాలు అమ్మేశారు. ఇందులో అక్రమాలు జరగడంతో అప్పటి నుంచి ఆ భూమి కోర్టు పరిధిలో ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పొక్లెయిన్లతో భారీ ఎత్తున మట్టి తవ్వేస్తున్నారు. ఫలితంగా భారీ గుంతలు ఏర్పడటంతో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ సీతారామయ్యను 'న్యూస్టుడే' సంప్రదించగా బెండికొండ పరిధిలో తవ్వకాలపై దృష్టిసారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# కోట దారిలో దోపిడీ ఎంత!

జమ్మలమడుగు : పర్యాటక ప్రాంతమైన గండికోటలో కొందరు అక్రమార్కులు అడుగు పెట్టారు. కోటకు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో టోల్గేట్ ఏర్పాటు చేసి అవినీతి దందాకు తెర లేపారు. పర్యాటకులు, విహార యాత్రల కు వచ్చే బడి పిల్లల నుంచి ప్రవేశ రుసుము పేరుతో నగదు తీసుకుంటు న్నారు. గతేడాది నుంచి ముక్కు పిండి వసూళు సాగిస్తున్నారు. ఇందులోనూ కొందరు సిబ్బంది అడ్డదారులు తొక్కారు. రుసుమును సందర్శకుల నుంచి నేరుగా వ్యక్తిగత ఖాతాల్లోకి బదిలీ చేసుకుంటూ జేబులు నింపుకొన్నారు. ఈ వ్యవహారాన్ని బహిర్గతం చేసింది. దీంతో కలెక్టర్ శ్రీధర్ స్పందించారు. అక్కడ పనిచేసే సిబ్బంది, సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో అక్కడ పనిచేసే సిబ్బందికి సంబంధిం చిన వ్యక్తిగత ఖాతాల లావాదేవీలను పరిశీలించాలని సూచించారు.

ఆడిందే ఆట.. పాడిందే పాట: 2024లో అధికారులు టోల్గేట్ ఏర్పాటు చేశారు. పర్యాటకుల నుంచి ప్రవేశ రుసుము వసూలు, పారిశుద్ధ్య పనులకు సుమారు 12 మంది సిబ్బందిని నియమించారు. ఆ సమయంలోనే విమర్శలు వెల్లువెత్తాయి. తమకు నచ్చిన వారిని నియమించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

పర్యాటకులతో ఎలా ప్రవర్తించాలో కూడా వీరికి అవగాహన కల్పించలేదు. దీంతో సందర్శకులను ఇబ్బంది పెట్టేలా కొన్నిసా ర్లు దురుసుగా ప్రవర్తించిన ఉదంతాలున్నాయి. గండికోటను చూసేందుకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విదేశాల నుంచి వచ్చే సందర్శకుల నుంచి టోల్గేట్ పేరిట వసూలు చేసిన డబ్బుతో ప్రతి నెల వీరికి రూ. లక్షల్లో వేతనాలు చెల్లించారు. అదే సమయంలో సందర్శకులకు వసతుల కల్పనపై కనీసం దృష్టి పెట్టలేదు. ఈ విషయమై విమర్శలు వచ్చినా అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ కీలక అధికారి పాత్ర ఉండటమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# ముహూర్తం కుదిరినట్టే..



నక్కపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ప్లాంటు ఏర్పాటుకు సంబంధించి అడుగులు శరవేగంగా పడుతున్నాయి. దీని శంకుస్థాపనపై స్వయంగా ముఖ్యమంత్రే కీలక ప్రకటన చేయడంతో జిల్లా వాసుల్లో ఉత్సాహం నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు కానున్న భారీ పరిశ్రమ ఈ స్టీల్ప్లాంటే కావడం విశేషం. దాదాపు ఏడాది కాలంగా సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్ ఈ పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించారు. అవసరమైన భూముల కేటాయింపులో భాగంగా నక్కపల్లి మండలాన్ని సూచించగా, దీనికి పరిశ్రమ యాజమాన్యం అంగీకారం తెలిపింది. ఇక్కడ తొలి విడతలో 2020 ఎకరాలను కేటాయించడం, దీనికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రస్తుతం రూ. 60వేల కోట్లతో పనులు చేపడుతుండగా, ప్లాంటును 2029నాటికి అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంత్రి అనిత జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ స్థానిక రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టారు. భూములు తీసుకున్న ప్రాంతాల్లో నిర్వాసితులకు సంబంధించి ప్యాకేజీ ఖరారు చేయడంతోపాటు, ఇప్పటికే పునరావాస కాలనీని కేటాయించారు. అక్కడ మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా అధికారులు పనులు చేయిస్తున్నారు. మరోవైపు రెండో విడత కింద మరో 3200 ఎకరాలను సేకరించడానికి చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించిన కార్యాచరణ జరుగుతోంది. దీనిపట్ల రైతులనుంచి భిన్న స్పందన ఉంది.

ఇది అందుబాటులోకి వస్తే మరో రూ. 75 వేల కోట్లతో ప్లాంటును విస్తరించనున్నారు. రెండు విడతలుగా రూ. 1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ప్లాంటు ఏర్పాటు కానుంది. ఈ క్రమంలోనే దీని ఏర్పాటుకు రాష్ట్రం తరఫున అవసరమైన అనుమతులు ఇవ్వడం, క్యాబినెట్లో తీర్మానం అన్ని చకాచకా జరిగిపోయాయి. మరోవైపు కేంద్రం నుంచి రావల్సిన అనుమతులను రప్పిస్తున్నారు. దీన్ని వీలైనంత వేగంగా ఏర్పాటు చేయించేందుకు అధికార యంత్రాంగానికి ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించింది. మరోవైపు సంబంధిత ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు భూములు పరిశీలించారు. ప్లాంటు నిర్మాణం జరిగే ముఖ్య ప్రాంతాలన్నింటిలోనూ ఇటీవలే మట్టి పరీక్షలు చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలి విడత పనులను మొదలు పెట్టడానికి వీలుగా వచ్చేనెల రెండో వారం తర్వాత శంకుస్థాపన చేయడానికి నిర్ణయించిన ట్లు దావోస్లో సంస్థ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో సీఎం చంద్రబాబు ప్రకటించడం అన్ని వర్గాల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కంపెనీ ఏర్పాటైతే దీని ద్వారా భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి.

# మరుభూముల్లో భూచోళ్లు!



గుత్తి : గుత్తిలో రూ.కోట్లు విలువైన శ్మశానస్థలాలను అక్రమార్కులు కబ్జా చేశారు. వీరు మరుభూములను సైతం వదలడం లేదు. రెవెన్యూ అధికారులు వారితో కుమ్మక్కై శ్మశానాల్లో ఇంటి పట్టాలు మంజూరు చేశారు. మూడేళ్ల కిందట గుత్తిలోని కర్నూలు రోడ్డులో పాతహైవే పక్కన ఉన్న శ్మశానంలో కొందరు రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇచ్చి ఇంటి పట్టాలు పొందారు. వీరంతా ఇప్పుడు ప్లాట్లు వేయటంతో దొంగ పట్టాల విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 30 సెంట్ల విస్తీర్ణంలో ప్లాట్లు వేసి రాళ్లను పాతారు. దీనిపై సీపీఐ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేస్తున్నారు.

**నోటీసులకే పరిమితం**

సర్వే నంబరు 714లో జారీ అయిన పట్టాలు వెలుగులోకి రావడంతో సంబంధిత వ్యక్తులకు రెవెన్యూ అధికారులు నోటీసులను ఇచ్చారు. 'మీకు జారీ చేసిన పట్టాలను ఎందుకు రద్దు చేయకూడదో సంజాయిషీ' ఇవ్వాలని కోరారు. రెండు సార్లు అనంతపురం ఆర్డీవో సైతం నోటీసులను ఇచ్చారు. పట్టాదారులతో సంజాయిషీ తీసుకున్నారు. ఇప్పటికీ ఆ పట్టాలు రద్దు చేయకపోవడం గమనార్హం.

**ఇటుకల బట్టీ పేరుతో కబ్జా**

ఓ వ్యక్తి శ్మశానవాటికలో కొన్నేళ్ల కిందట ఇటుకల బట్టీ నిర్వహిస్తూ వచ్చారు. తర్వాత బట్టీని ఎత్తేసి ఐదుగురు పేర్లతో పట్టాలు పొందాడు. శ్మశాన వాటిక సమీపంలోనే ఆదర్శ పాఠశాల ఉంది. పక్కనే పాతహైవే రోడ్డు ఉంది. దీంతో ఇక్కడి స్థలాలకు విపణిలో మంచి డిమాండ్ ఉంది. మారుతీ నగర్కు సమీపంలో ఉన్న సర్వేనంబర్ 714లోని శ్మశానవాటిక స్థలంలోనూ 15 మందికి పట్టాలిచ్చారు. ఇక్కడ మరుభూమి కోసమని 3.57 ఎకరాల భూమిని కేటాయించారు. అయితే 2.82 శ్మశానం కాగా, మిగిలిన స్థలాన్ని కబ్జా చేశారు. కొందరు పునాదులు వేయగా, మరికొందరు భవంతులను నిర్మించుకున్నారు.

**శ్మశాన స్థలాలను పరిరక్షిస్తాం** -పుణ్యవతి, తహసీల్దారు, గుత్తి

గుత్తి శ్మశాన స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటాం. కర్నూలు రోడ్డులో పట్టాలు పొంది హద్దురాళ్లను ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం. డిప్యూటీ తహసీల్దారు సూర్యనారాయణకు వీఆర?లతో కలిసి ప్లాట్లు తొలగించాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

# తుది దశకు.. పుష్కర నివేదిక!



రాజమహేంద్రవరం : 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రత్యేక అధికారి పాండ్యన్ నేతృత్వంలోని బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం అధికార యంత్రాంగం అమరావతి బయలుదేరి వెళ్లనుంది. దీంతో పుష్కర పనులు కొలిక్కి వస్తాయని యంత్రాంగం భావిస్తోంది. వచ్చే ఏడాది జూలై నెలాఖరున ప్రారంభమయ్యే పుష్కరాలకు సంబంధించి నిధులు కేటాయించాల్సి ఉంది. పనులు చేపట్టేందుకు ఇంకా ఏడాదిన్నర మాత్రమే మిగిలి ఉంది. దీనిపై అధికార యంత్రాంగం జిల్లాలో మూడుసార్లు సమీక్షించింది. పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తాజాగా ఈ ప్రతిపాదనలు అమరావతిలో పురపాలిక విభాగానికి అందజేశారు. ముఖ్యమంత్రి సమీక్ష తర్వాత పూర్తి స్థాయిలో చేపట్టాల్సిన విధి విధానాలపై నిర్ధారణకు రానున్నారు.

**పర్యాటకంగా అభివృద్ధి చేయాలని..**

మరోవైపు గోదావరి తీరాన్ని పూర్తి స్థాయిలో పర్యాటకంగా తీర్చిదిద్దాలని ఇప్పటికే నిర్ణయించారు. ఈ మేరకు పుష్కరఘాట్ వద్ద పనులు చేపట్టారు. వీటి కోసం నిధులు భారీగానే ఖర్చు చేస్తున్నారు.

గోదావరి తీరం అనుబంధంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించారు.

ఆలయాల అభివృద్ధి, గట్ల పటిష్ఠంపై దృష్టి సారించారు. ఆయా శాఖల పరిధిలో జలవనరులశాఖ, విద్యుత్తు, అగ్నిమాపక, పోలీసు, మత్స్యశాఖల ద్వారా చేపట్టే పనుల వివరాలు నివేదికలో పొందుపర్చారు.

పుష్కరాలకు వచ్చే భక్తులకు అప్పటికప్పుడు ఏర్పాటు చేయాల్సిన పుష్కర నగరాలు, రద్దీ నియంత్రణ, వసతి సౌకర్యాలు, రవాణా వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొంటారు.

**ఘాట్ల విస్తరణపై దృష్టి**

పుష్కరాలకు ఆతిథ్య నగరం రాజమహేంద్రవరంతోపాటు కొవ్వూరు, నిడదవోలులో ఏర్పాట్లు చేయనున్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని నగరంతోపాటు గోదావరి ఆనుకొని ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ ఘాట్లను విస్తరించనున్నారు. వీటి సామర్థ్యాన్ని శాశ్వత ప్రాతిపదికన మెరుగుపర్చనున్నారు. ఇటు ధవళేశ్వరం నుంచి కాతేరు వరకు, అటు తొర్రేడు, సీతానగరం వరకూ ఘాట్లను పటిష్ఠం చేసి పుష్కర స్నానాలకు అనుకూలంగా తీర్చిదిద్దనున్నారు. వేమగిరి నుంచి విజ్జేశ్వరం వరకూ కూడా గట్లు బలోపేతం చేయనున్నారు.

# ట్రిపుల్ ఐ'డీ'..!

ఎచ్చెర్ల: రాజీవ్గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్(ట్రిపుల్ ఐటీ)లో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. డైరెక్టర్ నియామకంలో తీవ్ర జాప్యం కారణంగా పాలన గాడి తప్పింది. ఫలితంగా అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది మధ్య అంతర్గత కుమ్ములాటలు పెరిగిపోతున్నాయి. నిర్ణయాలు తీసుకునేవారు లేక నాణ్యమైన విద్య, సౌకర్యాలకు విద్యార్థులు నోచుకోలేకపోతున్నారు. ఏడాదిన్నర కిందట ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ రాజీనామా చేశారు. కొత్తవారిని నియమించకపోవడంతో ఆయనే ఇంకా కొనసాగుతున్నారు. ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనికి తోడు అంతర్గత కుమ్ములాటలు, ఆధిపత్య పోరు పెద్దఎత్తున నడుస్తున్నాయి. ఇటీవల క్యాంపస్లో క్వాంటమ్ కంప్యూటింగ్పై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఉన్నతాధికారులు హాజరుకాకపోవడమే అందుకు నిదర్శనమనే వాదనలు వినిపిస్తున్నాయి.

విద్యార్థినుల ఫిర్యాదు ఏమైందో..?

క్యాంపస్లో విద్యార్థినులపై జరుగుతున్న వేధింపులపై వర్సిటీ ఉన్నతాధికారులకే నేరుగా ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై రాష్ట్ర మహిళా కమిషన్తో పాటు వర్సిటీ నియమించిన కమిటీ సైతం విచారించి వాస్తవమని నిర్ధారించినా బాధ్యులపై ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ట్రిపుల్ ఐటీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ డాక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.



ఏళ్ల తరబడి పాతుకుపోయారు..

చాలా మంది ఏళ్ల తరబడి క్యాంపస్లోనే పాతుకుపోవడంతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రెగ్యులర్ ఆచార్యులు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటూ ఆర్థిక అక్రమాలకు తెర లేపుతున్నారని ప్రచారం జరుగుతోంది. వారితో పాటు అత్యంత కీలకమైన పరీక్షలు, కొనుగోళ్లు, ఫైనాన్స్, ఇతర విభాగాల్లో కొందరు క్యాంపస్ ప్రారంభం నుంచి అవే బాధ్యతల్లో కొనసాగుతూ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. శ్రీకాకుళం క్యాంపస్లో 5 వేల మందికిపైగా చదువుకుంటున్నారు. వారికి వారానికి మూడు, నాలుగు సార్లు గుడ్డు, ఒకసారి చికెన్తో భోజనం పెట్టాలి. అందుకు ఎలాంటి టెండర్ విధానం లేకుండానే కొనుగోళ్లు జరిపి దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. అడిగేవారు లేకపోవడంతో కొందరు సిబ్బంది బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించట్లేదు.

# ఉపాధికని వస్తారు.. ఉన్నదంతా ఊడ్చేస్తారు..!

శ్రీకాకుళం :గత నెల 12న జిల్లా కేంద్రంలో ఓ విశ్రాంత ఉద్యోగి ఆటోలో ప్రయాణిస్తుండగా.. ఆయన బ్యాగ్ను కత్తిరించి బ్యాంకు నుంచి తీసుకెళ్తున్న రూ.4 లక్షల నగదును దుండగులు దోచేశారు. అంతర్రాష్ట్ర ముఠా పక్కాగా రెక్కీ చేసి ఇలా చేసినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కొన్ని నెలల కిందట వజ్రపుకొత్తూరు మండలం పూండిలోని ఓ బంగారం దుకాణంలో 18 తులాల ఆభరణాలను మధ్యప్రదేశ్కు చెందిన ముఠా ఎత్తుకెళ్లిపోయింది. స్థానికంగా వ్యాపారుల ముసుగులో కొన్ని రోజులు తిరిగి.. ప్రణాళిక ప్రకారం దోచుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పేరుతో ఎక్కడెక్కడి నుంచో జిల్లాకు వస్తారు. పగటి పూట చిరు వ్యాపారుల ముసుగులో వీధుల్లో తిరుగుతారు. ఆ సమయంలో రెక్కీ చేసి.. చీకటి పడిన తర్వాత నేరాలకు పాల్పడుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లు, బంగారు దుకాణాలు, బ్యాంకులే లక్ష్యంగా చోరీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనుమానిత వ్యక్తులు, అపరిచితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా గతేడాది నమోదైన వాటిల్లో 281 కేసులు పరిష్కరించారు. పట్టుబడిన నిందితుల్లో 50 శాతంపైగా అంతరాష్ట్ర దొంగలే ఉన్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా ప్లాస్టిక్ సామగ్రి, దుస్తులు, దుప్పట్లు, విద్యుద్దీకరణ పరికరాలు అమ్మే పేరుతో వీధుల్లో తిరుగుతున్నారు. కొన్ని చోట్ల ఇళ్లల్లోకి వచ్చి పాడైపోయిన టీవీలు, ఫ్రిడ్జ్లు, ఇతర పనికిరాని వస్తువులు కొంటామని చెబుతామని మాటల్లోకి దించి రెక్కీ నిర్వహించి.. రాత్రి వేళ దొంగతనాలకు పాల్పడుతున్నారు.



**వివరాల సేకరణ..**

ఈ ముఠాలపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి జిల్లాలో వ్యాపారాలు చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 360 మంది నుంచి వేలిముద్రలు, ఫొటోలు, ఆధార్ వంటి వివరాలు తీసుకున్నారు. శ్రీకాకుళం డివిజన్ నుంచి 180, పలాస 120, టెక్కలిలో 60 మందికిపైగా అంతర్రాష్ట్ర వ్యక్తులను గుర్తించారు.

**అప్రమత్తంగా ఉండాలి..:** జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాలపై దృష్టి సారించాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి. నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి. రాత్రి పూట బందోబస్తును పటిష్ఠం చేశాం. ఇంటి తాళాలు వేసి దూరప్రాంతాలకు వెళ్లేవారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్హెచ?ంఎస్)ను సద్వినియోగం చేసుకోవాలి.
కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ

చురకలు



# గ్రానైట్ మాయాజాలం

ఒంగోలు : భూమిలో నుంచి ఎంత విలువైన గ్రానైట్ బండలు వెలికితీశారు... వాటిని ఎంతమేర స్లాబులుగా మార్చి మార్కెట్లో విక్రయించారు... ఈ లెక్కలు చూసే బాధ్యత భూగర్భ గనులశాఖ (మైన్స్) అధికారులు పర్యవేక్షించాలి. జిల్లాలో మాత్రం ఎలాంటి బిల్లుల్లేకుండానే గ్రానైట్ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. గ్రానైట్ లావాదేవీలు ఏమాత్రం దస్త్రాల్లోకి ఎక్కడం లేదు. జిల్లాలో గ్రానైట్ ఏమి దొరకలేదనే విధంగా దొడ్డిదారిన జీరో వ్యాపారం సాగిస్తున్నా గనులశాఖ అధికారులు కిమ్మనడంలేదు.

క్వారీ నుంచి తవ్వి తీసిన గ్రానైట్ బండలకు నిబంధనల ప్రకారం సీనరేజీ చెల్లిస్తారు. బండలను కొని వాటిని స్లాబులుగా మార్చిన కర్మాగారం నిర్వాహకులకు క్వారీ యజమానులు అనుమతి పత్రాలు మంజూరు చేస్తారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి స్లాబ్ సిస్టం ప్రకారం నెలకు రూ.70 వేలు చెల్లించిన నిర్వాహకులకు 44 మీటర్ల మేర అంటే దాదాపు 15 వేల చదరపు అడుగుల గ్రానైట్ స్లాబులను విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. మూడు కంటైనర్ల సరకు ఇతర ప్రాంతాలకు రవాణా చేసుకోవచ్చు. ఈ అనుమతుల జారీ ప్రక్రియ అంతా ఆన్లైన్లోనే జరుగుతుంది. తాము స్లాబులు విక్రయించలేదని తమ వద్ద ఇప్పటికే లక్ష చదరపు అడుగుల వరకు గ్రానైట్ స్లాబులు రవాణా చేసేందుకు అనుమతి పత్రాలున్నాయని కర్మాగారాల నిర్వాహకులు చూపుతున్నారు. ప్రస్తుతం రోజూ లావాదేవీలు సాగుతున్నా ఆన్లైన్లో ఎలాంటి పత్రాల తీసుకోకుండా తెల్ల కాగితంపై నంబర్లు రాసుకుని దర్జాగా రవాణా చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్కు ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రెండు కంటైనర్లను జీఎస్టీ అధికారులు యర్ర గొండపాలెం వద్ద స్వాధీనం చేసుకున్నారు. దీంతో అక్రమ రవాణా వ్యవహారం ఎలా సాగుతుందో వెల్లడైంది.

**భారీగా జీఎస్టీ.. ఆదాయానికి గండి**

ఇటీవల హైదరాబాద్లో గ్రానైట్ తరలించిన కంటైనర్లను అక్కడి అధికారులు స్వాధీనం చేసుకోగా, ఓ ప్రైవేటు గుత్తేదారు సంస్థ జారీ చేసిన రసీదులను చూపించారు. అనుమతి పత్రాలు లేకుండానే తరలించినందుకు భారీ జరిమానా విధించారు. గనుల నుంచి వచ్చే ముడిరాయికి, పాలిష్ చేసిన బండలకు జీఎస్టీ చెల్లించాలి. ఇవేమి ప్రభుత్వ దస్త్రాల్లోకి ఎక్కకుండా అంతా తెల్ల కాగితంపై లెక్కలు రాసుకుని



పనులు చక్కబెడుతున్నారు. వాస్తవానికి ఒక కంటైనర్ స్లాబులు రవాణా చేయాలంటే రూ.45 వేలు చెల్లించి రవాణా చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఓ ప్రైవేటు సంస్థ రూ.35 వేలు వసూలు చేసి తరలింపు వ్యవహారం చూసుకుంటామని అక్రమ రవాణాకు తెరలేపింది. తమకు కలిసి వస్తుందని చెప్పి మరికొంతమంది కర్మాగారం యజమానులు ఈ బాటలోనే వెళ్తున్నారు. ఫలితంగా గ్రానైట్ లావాదేవీలు రికార్డుల్లోకి ఎక్కకపోగా, జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. అనధికార వ్యాపారంతో చివరకు గ్రానైట్ పరిశ్రమకు గడ్డుకాలం ఎదురవుతుందని నిజాయతీగా లావాదేవీలు జరిపే కొంతమంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు వాపోతున్నారు.

**అక్రమాలు సాగనివ్వం**

హైదరాబాద్కు బిల్లులు లేకుండా గ్రానైట్ రవాణా చేస్తున్న వ్యవహారం మా దృష్టికి వచ్చింది. దీనిపై నివేదిక ఇవ్వాల్సిందిగా మార్కాపురం గనులశాఖ అధికారులను ఆదేశించాం. జిల్లాలో ఎక్కడైనా అనుమతి పత్రాలు తీసుకునే గ్రానైట్ రవాణా సాగించాలి. లేకుంటే భారీ జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

రాజశేఖర్, జిల్లా గనులశాఖ అధికారి

# ఎక్కడివారు.. ఎవరు వారు?

ఉదయగిరి : ఉదయగిరి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని ఆర్లపడియ అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించేందుకు యత్నించిన వారెవరన్నది ఇంతవరకు గుర్తించలేదు. పోలీసుల చేతిలో ఆధారాలున్నా పట్టుకోలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి ఎర్రచందనం దుంగలను వాహనంలో తరలిస్తుండగా ఆర్లపడియ గ్రామస్థులు అడ్డగించారు. వాహనంలో ఉన్న ముగ్గురిని పట్టుకోబోగా తప్పించుకు న్నారు. ఈ క్రమంలో ఒకరి సెల్ఫోన్ చిక్కింది. పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి దుంగలతో సహా వాహనం, సెల్ఫోన్ స్వాధీనం



చేసుకున్నారు. గ్రామస్థుల చేతికి ఫోన్ చిక్కిన సమయంలో దానికి చాలా ఫోన్కాల్స్ కూడా వచ్చాయి. పోలీసుల అదుపులో ఉన్న వాహనం, సెల్ఫోన్ ఆధారంగా రవాణాలో ఒకరి ప్రమేయమున్నట్లు పోలీసులు గుర్తించి పట్టుకొనేందుకు అతని ఇంటికి వెళ్లగా పరారైనట్లు సమాచారం. ఫోన్ ఆన్ కావడం లేదు. దీన్ని బాగుచేయించి వచ్చిన కాల్స్ ఆధారంగా విచారిస్తే నిందితులెవరన్నది తెలుస్తోంది. ఇందులో పెద్దలు ఉన్నారా.. వారి నుంచి వస్తున్న ఒత్తిళ్లతో విచారణలో జాప్యం చేస్తున్నారా? అన్న సందేహాలు కలుగుతున్నాయి.

**పాతవారి సహకారం ఉందా?**

ఐదేళ్ల క్రితం ఆర్లపడియ బీట్లో దుంగలను స్వాధీనం చేసుకొని.. పలువురిపై కేసులు నమోదు చేశారు. వారి ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. స్థానిక కూలీలతోనే నరికించి తరలించేందుకు యత్నించినట్లు సమాచారం.

**పట్టనట్లుగా అటవీశాఖాధికారులు** సంఘటన జరిగి నాలుగు రోజులు గడిచినా అటవీశాఖాధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆర్లపడియ ప్రాంతంలోనే చెట్లను నరికి తరలిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. అయినా ఇంత వరకు అటవీశాఖాధికారులు ఈ ప్రాంతంలో దర్యాప్తు చేయకపోవడం గమనార్హం.

# జడ్పీ తీరు.. నవ్విపోదురూ



కాకినాడ: ఒకప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకే కీలకంగా ఉన్న జిల్లాపరిషత్తు తీరు ప్రస్తుతం ఆందోళనకర రీతిలో ఉంది. చెప్పుకోవడానికి రూ.వేల కోట్ల విలువైన ఆస్తులున్నా వాటి నుంచి నయాపైసా రావడం లేదు. ఇప్పటికే చాలావరకు అన్యాక్రాంతమైపోయాయి. మరికొన్ని స్థలాలు, భూములు అక్రమణదారుల చెరలో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం వసూలు చేయకుండా మిన్నకుండిపోయారు.

**ఎకరాకు రూ.2వేలే**

జిల్లా పరిషత్తుకు ఉమ్మడి జిల్లాలో 108 ఎకరాలకు పైగా సేద్యపు భూములున్నాయి. వాటిలో వరి, ఆక్వా చెరువులు, కొబ్బరి తోటలు, మెట్ట పంటలున్నాయి. సాధారణంగా ఇతరుల భూములకు కౌలు రైతులు ఎకరాకు కనిష్ఠంగా రూ.20 వేలు చెల్లిస్తున్నారు. జడ్పీ భూములకు ఏడాదికి రూ.21 లక్షల ఆదాయమైనా రావాలి. అధికారులు తాజా బడ్జెట్లో ఈ రాబడిని రూ.2.2 లక్షలుగానే చూపించారు. అంటే ఎకరాకు రూ.2 వేలు మాత్రమే లీజు నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. గతంలో లీజుకు తీసుకున్నవారు పాతుకుపోయారు. కొత్తగా వేలం లేదు. దీంతో భారీగా ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

**బకాయిల వసూలుపై బాధ్యత లేదా..**

జడ్పీ భూములు లీజుకు ఇచ్చి బకాయిలు వసూలు చేయక రూ.32.29 లక్షల ఆదాయాన్ని కోల్పోయింది. ఇందులో కాట్రేనికోన మండలం అడవిపేట పరిధిలో 50.42 ఎకరాల భూములున్నాయి.

68 ప్రాంతాల్లో కొబ్బరి చెట్లున్నాయి. స్థానిక నేతలు, వారి అనుచరులే లీజుదారులు. రూ.33.56 లక్షల వరకు వారు చెల్లించలేదు.

కల్యాణమండపానికి ఏడాదికి రూ.10 లక్షలు చూపారు. నిత్యం శుభకార్యాలు జరుగుతున్నా అంత తక్కువ రాబడి చూపడం విశేషం.

కాకినాడలోని వాణిజ్య సముదాయం నుంచి గత నాలుగేళ్లలో రూ.13.94 లక్షల లీజు బకాయిలు పేరుకుపోయాయి. రెండు దుకాణాలను లీజుకు తీసుకున్న ఓ వ్యక్తి రూ.9.20 లక్షలు చెల్లించలేదు. కడియం జడ్పీ పాఠశాల, మండపేట జడ్పీ కాంప్లెక్స్ నుంచీ లీజు సొమ్ము రాలేదు. **ఆదాయం పెంపు దిశగా చర్యలు..**

–లక్ష్మణరావు, జడ్పీ సీఈవో

జిల్లా పరిషత్తు ఆస్తులను ఆదాయ వనరులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కార్యాలయం ఎదుట ఖాళీ స్థలంలో మరో నిర్మాణం చేపట్టి బ్యాంకుకు అద్దెకు ఇవ్వబోతున్నాం. కల్యాణ మండపాల ధరలను పెంచాల్సి ఉంది. ఆక్రమణల్లో ఉన్న భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటాం.

# గడప లేక.. గడపలేక



విజయనగరం : ఉమ్మడి జిల్లాలో టిడ్కో లబ్ధిదారుల సొంతింటి కల నిజం కావడం లేదు. ఏళ్లుగా ఎదురు చూస్తున్నా.. తాళం చేతికి వస్తున్నా గృహాల్లోకి వెళ్లలేని పరిస్థితి. ఇదిగో అదిగో అంటున్నారే తప్ప.. అధికారులు సైతం చర్యలకు వెనకాడుతున్నారు. గతేడాది అయిదారుసార్లు వాయిదా వేశారు. మొన్నటికి మొన్న సంక్రాంతి నాటికి అందిస్తామని చెప్పినా.. మాట తప్పారు. తాజాగా మార్చినాటికని ప్రకటించారు.

**ఎనిమిదేళ్లుగా సాగదీత..**

పుర, నగరపాలక, నగర పంచాయతీల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కల నెరవేర్చేందుకు 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం టిడ్కో గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మూడు కేటగిరీల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. పనులు పూర్తవుతున్న సమయంలో వైకాపా అధికారంలోకి వచ్చింది. 2022 నాటికి అందిస్తామని జగన్మోహన్రెడ్డి ప్రకటించారు. కొన్నిచోట్ల రివర్స్ టెండరింగ్కు వెళ్లారు. గుత్తేదారులకు బిల్లులు ఇవ్వలేదు. ఈక్రమంలో పనులన్నీ ఆగిపోయాయి. విజయనగరం సమీపంలోని సారిపల్లి, సోనియానగర్లో కొందరికి ఇళ్లు అప్పగించినా, మౌలిక సదుపాయాలు కల్పించలేదు.

**రూ.90 కోట్లు అవసరం..**

వివిధ దశల్లో నిలిచిపోయిన 1536 ఇళ్ల నిర్మాణాలు, పలుచోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు రూ.90 కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఇందులో వసతి కోసమే రూ.20 కోట్లు కావాలి. సాలూరులో 192, బొబ్బిలిలో 432, రాజాంలో 336, నెల్లిమర్లలో 576 గృహాలను పూర్తి చేసేందుకు మరో రూ.70 కోట్లు అవసరం.

**తాగునీరు గగనం..**

సోనియానగర్లో 250 కిలోలీటర్ల నీళ్ల ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించారు. సారిపల్లిలో చంపావతి నది నుంచి 1800 మీటర్ల పైపులైను ఏర్పాటు పనులు చేయాలి

నెల్లిమర్లలో 200 కిలోలీటర్ల సంప్పు ఏర్పాటు చేశారు

బొబ్బిలి, పార్వతీపురం, సాలూరులో ప్రారంభ దశలోనే ఉన్నాయి. రాజాంలో ఇంకా మొదలు పెట్టలేదు.

**త్వరలోనే పూర్తి..** – పి.శ్రీరామ్మూర్తి, టిడ్కో ఈఈ

గృహ నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇటీవల కొంతమేర నిధులిచ్చింది. మరో రూ.2 కోట్లు మాత్రమే రావాలి. అదనంగా రూ.90 కోట్లు అవసరం. సాలూరు, సోనియానగర్లో మార్చి నాటికి పనులు పూర్తవుతాయి. త్వరలోనే మిగిలిన ప్రాంతాల్లో అందుబాటులోకి తెస్తాం.

# సహకారానికా..'స్వాహో'కార్యానికా..

ఏలూరు: వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు సహకార సంఘాలు, బ్యాంకులను ఆర్థికంగా దెబ్బతీసిన సంగతి తెలిసిందే. చివరకు జిల్లా మార్కెటింగ్ సొసైటీనీ (డీసీఎంఎస్) వదల్లేదు. ఎరువులు, సూపర్బజార్, షాపింగ్ కాంప్లెక్సుల ఆదాయాన్ని పప్పుబెల్లాల్లా ఖర్చు పెట్టేసి అందినకాడికి దండుకున్నారు. ఉమ్మడి జిల్లాకు ఏలూరులో ప్రధాన కార్యాలయం ఉంది. ఆ ప్రాంగణంలో ఉన్న ఓ పాత భవనంలో 15 గదులతో మూడేళ్ల క్రితం లాడ్జి నిర్మాణానికి తెరదీశారు. రూ.25 లక్షలకు పైగా ఖర్చు చేశారని చెబుతున్నా పనులు ఆ స్థాయిలో లేవు. పైగా అవి అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. నిర్మాణ సామగ్రి ముందుగానే కొనుగోలు చేసి వదిలేయడంతో దుమ్ము, ధూళి పేరుకుపోయి పాడైపోతోంది.

**ఎలా అనుమతించారు?..** అక్కడ పనిచేసే ఉద్యోగులకే లాడ్జి నిర్మిస్తున్నారనే విషయం తెలియని పరిస్థితి. ఒకవైపు ఆ ప్రాంగణంలో సూపర్బజార్, ఎరువుల గోదాము, జనరిక్ ఫార్మసీ ఇలా అనేకం ఉండటంతో నిత్యం జనం, రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఏరికోరి అక్కడే లాడ్జి ప్రతిపాదించడం ఏమిటి? అసలు డీసీఎంఎస్ చేయాల్సిన పని ఇది కాదని రైతులకు ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ సామగ్రి వంటివి అందజేసి వారికి సహాయపడాలని ఉద్యోగులే అంటున్నారు. మరి లాడ్జి ఎందుకోసం నిర్మిస్తున్నారో అర్థం కాలేదు. దీనిపై విజిలెన్స్ విచారణ కోరతామని నాయకులు తెలిపారు **చేయాల్సిన పనులు బోలెడు..** మూడేళ్ల క్రితం



ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి కాలేదు. గదుల్లో మార్బుల్స్, టైల్స్ వంటివి అతికించాలి. విద్యుత్తు సౌకర్యం, ఇంటీరియర్ పనులు చేయాలి. గదులకు తలుపులు బిగించలేదు. కొంతమేర సున్నాలు వేశారు. నిర్మాణ పనులు కాకుండా సీలింగ్ చేయడం, వైరింగ్ కనెక్షన్ ఇవ్వడం గమనార్హం. ఇదిలా ఉంటే టైల్స్, విద్యుత్తు సామగ్రి, సిమెంట్, ఇటుకలు తదితర సామగ్రి మూలనపడి ఉన్నాయి. దీనిపై విజిలెన్స్ విచారణ చేస్తేనే ప్రభుత్వ ఆదాయానికి ఎంత నష్టం వాటిల్లిందో వెలుగులోకి వస్తుంది. డీసీఎంఎస్ ఇన్ఛార్జి బిజినెస్ మేనేజర్ కృష్ణమోహన్ను వివరణ కోరగా మూడేళ్ల క్రితం రూ.40 లక్షలతో చేపట్టామని, ఇప్పటికే రూ.25 లక్షలు ఖర్చు పెట్టామన్నారు. మరో ఆర్నెళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు.

# కనిగిరి.. ఏదీ జలసిరి?

కనిగిరి : కనిగిరి ప్రాంత ప్రజల ఆశాజ్యోతి... రైతాంగానికి వర ప్రదాయని వెలిగొండ ప్రాజెక్టును నిర్మించి కరువు సీమలో సిరులు పండించాలన్న కోరికకు అడగడుగునా అవాంతరాలు తప్పడం లేదు. రైతుల కడుపు నింపేందుకు స్వాతంత్ర్యం రాక ముందు నుంచే ఇక్కడ ప్రాజెక్టు నిర్మించాలని ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఎన్నో వ్యవప్రయాసల కోర్చి చివరకు ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైనా పనుల్లో జాప్యం జరుగు తుండడం, అంచనా వ్యయం తడిసిమోపెడు కావడంతో అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించగా, అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధుల బూచి చూపి పూర్తిగా వెచ్చించక గాలికొదిలేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు నిత్యం పర్యవేక్షిస్తుండడంతో కనిగిరి ప్రాంత రైతాంగం, ప్రజలు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

**పదేళ్ల కిందట...**

జిల్లా కేంద్రం మార్కాపురం ప్రాంతంలోని కాకర్ల సమీపంలో నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి కనిగిరి నియోజకవర్గం పరిధిలోని హనుమంతునిపాడు మండలంలో సుమారు పదేళ్ల కిందట 50 కిలోమీటర్లకు పైగా కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. లక్ష



ఎకరాలకు పైగా నీరందించే తూర్పు ప్రధాన కాలువ కనిగిరి, పామూరు, హనుమంతునిపాడు, వెలిగండ్ల, సీఎస్పురం మండలాల మీదుగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని పెద్దిరెడ్డిపల్లి మీదుగా వెళ్తుంది. నిధుల లేమితో కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, .జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు పర్యటించి నిధులు వెచ్చిస్తుండడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జూన్, జులై నాటికి వెలుగొండకు నీటిని తరలిస్తామని అధికారులు తెలపడంతో కనిగిరి ప్రజలకు ఫ్లోరైడ్ బాధలు తప్పడంతోపాటు సాగు, తాగునీరు వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటు వలసలకు అడ్డుకట్ట పడుతుంది.

**శిథిలావస్థలో కాలువలు...**

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వెలుగొండ ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులు గత పదేళ్లుగా నిలిచిపోయాయి. దీంతో కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి పూడుకుపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మేజరు కాలువతోపాటు మైనరు కాలువలు సైతం దెబ్బతిన్నాయి. కాలువల తవ్వకాలతో భూములు కోల్పోయిన రైతులకు ఇంతవరకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందలేదు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని కూడా చేర్చాలని రైతులు, ప్రజల నుంచి డిమాండు ఉంది. ప్రాజెక్టు నుంచి పూర్తిస్థాయిలో నీరందిస్తే సస్యశ్యామలం కావడంతోపాటు పరిశ్రమలకు సైతం నీరందించేందుకు అవకాశం ఉంటుంది.

# జలమే గరళం.. దిన దిన గండం!

మర్రిపాడు : పాలకుల పాపం.. ఏళ్ల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపమైంది. చిన్నపిల్లల మొదలు పెద్దల వరకు ఫ్లోరైడ్ గుల్ల చేస్తోంది. రెండు దశాబ్దాల్లో తాగునీరు విష తుల్యమై సుమారు 20 మంది ఆ రక్కసికి బలయ్యారని గ్రామస్థులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇప్పుడు కూడా కొందరు కిడ్నీ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఇప్పటికీ ప్రత్యామ్నాయం లేక.. ఆ గరళాన్నే తాగుతున్నామని చెబుతున్నారు. ఇదీ మర్రిపాడు మండలం కంపసముద్రం ఎస్సీ కాలనీవాసుల కన్నీటిగాథ.

మంత్రి ఆనం రామానారాయణరెడ్డి ఆదేశాలతో గురువారం జిల్లా వైద్య బృందం కాలనీలో పర్యటించింది. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారిని పరీక్షించింది. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో చేతి పంపులు, కుళాయిల వద్ద తాగునీటిని సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్కు పంపింది. గ్రామంలో 16 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించి.. వారి ఇళ్లకు వెళ్లి రక్త నమూనాలు సేకరించి.. నెల్లూరులోని ల్యాబ్కు పంపించారు.

**62 కుటుంబాలు.. 322 మంది**

కాలనీలో సుమారు 69 కుటుంబాలు ఉండగా– 332 మంది నివాసం ఉంటున్నారు. 16 మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతుండగా– వీరిలో ముగ్గురు డయాలసిస్ చేయించుకుంటున్నారు. అందరూ పేదలే. కాలనీ ఏర్పడి 50 ఏళ్లకుపైగా అవుతున్నా.. సురక్షిత తాగునీరు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో అయిదుగురు మృతి చెందారని.. కిడ్నీ సమస్యతోనే బుధవారం రాత్రి సైతం ఓ మహిళ తనువు చాలించగా.. మరో బాలుడు తిరుపతిలోని ఆసుపత్రిలో చేరాడని తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సరైన చికిత్స, మందులు తీసుకోక కిడ్నీ సమస్యలు తెచ్చుకున్నట్లు గుర్తించాం. కాళ్లు, చేతులు, నడుము నొప్పులు వంటివి వచ్చినప్పుడు ఆర?ంపీల వద్దకు వెళ్లి అధిక మోతాదు మాత్రలు, ఇంజక్షన్లు వేయించుకోవడం మరో కారణంగా తెలుస్తోంది. ఆహార నియమాలు పాటిస్తూ.. సరైన మందులు వాడితే వ్యాధి అదుపులో ఉంటుంది. రక్త పరీక్షల ఫలితాలు వచ్చిన వెంటనే మందులు పంపిణీ చేస్తాం భయాందోళన చెందాల్సిన పని లేదని జిల్లా సర్వైలెన్స్ అధికారి భాస్కర్ తెలిపారు.

నా పేరు చెన్నయ్య. వయసు 26 ఏళ్లు. నాలుగేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. యుక్త వయసులోనే ఏ పని చేయలేకపోతున్నా. నెలకు 8 సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. ఆ బాధ భరించలేకనే ప్రాణం పోతోంది. మా నాన్నకూ కిడ్నీలు దెబ్బతిన్నాయి. మంచానికే పరిమితమయ్యాడు. మందులు, ఆసుపత్రి ఖర్చులకు పింఛను రూ. పది వేలు పోను.. మరో రూ. 7వేలు అదనంగా ఖర్చవుతోంది. మా నాన్నకు పింఛను సొమ్ము రూ. 4వేలు పోను.. మరో రూ.అయిదు వేలు మందులకు ఖర్చవుతోంది. ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్లే ఈ సమస్య వచ్చింది.

## గ్లామర్ తో మతులు పోగొడుతున్న సుందరవల్లి!

సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఎంతోమంది సెలబ్రిటీలు పాపులారిటీని సంపాదించుకోవడమే కాకుండా.. తమ సినిమాలను కూడా ప్రమోట్ చేసుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ తమ పాత్రలను రివీల్ చేస్తూ తమ సినిమాలకు వస్తున్న రెస్పాన్స్ కి.. ఆడియన్స్ కి కృతజ్ఞతలు కూడా తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక హీరోయిన్ తన పాత్ర పేరుతో అభిమానులకు కృతజ్ఞతలు చెప్పుకొచ్చింది. తన సినిమా టీజర్ కి ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు మంత్రముగ్ధులైన ఆమె.. ఈ వాలెంటైన్స్ డే సందర్భంగా స్పెషల్ ఫోటోలతో పాటు స్పెషల్ గా ధన్యవాదాలు కూడా తెలియజేయడం ఇప్పుడు వైరల్ గా మారింది. ఆమె ఎవరో కాదు ప్రముఖ యంగ్ బ్యూటీ నభా నటేష్. తాజాగా ఈమె నిఖిల్ సిద్దార్థ 'స్వయంభు' సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాలో సుందరవల్లి పాత్రలో నటిస్తున్నట్లు ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా మేకర్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. భరత్ కృష్ణమాచార్య దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నభా నటేష్ తో పాటు సంయుక్త మీనన్ కూడా నటిస్తోంది. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఈ సినిమా టీజర్ ని మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ టీజర్ కి విశేష స్పందన లభిస్తున్న నేపథ్యంలో పైగా ఈరోజు వాలెంటైన్స్ డే సందర్భంగా



కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ మీ సుందరవల్లి వాలెంటైన్స్ డే సందర్భంగా మీకు స్పెషల్ విషెస్ తెలియజేస్తోంది. స్వయంభు టీజర్ కి అందించిన ఆదరణకు ధన్యవాదాలు అంటూ తెలియజేసింది. ఇకపోతే తాజాగా సుందరవల్లి గెటప్ లో తన అందంతో మరోసారి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. గ్రీన్ అండ్ రెడ్ కలర్ లెహంగా ధరించి టాప్ స్లీవ్ లెస్ అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. గ్లామర్ విందు వడ్డిస్తూ యువతకు ఊపిరాడకుండా చేసింది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికైతే వాలెంటైన్స్ డే సందర్భంగా నభా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే ఈ సినిమా ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా వీఎఫ్ఎక్స్ కారణంగా ఈ సినిమాను వాయిదా వేశారు. ఇదే విషయంపై చిత్ర బృందం స్పందిస్తూ.. ఈ రోజుల్లో ఒక్క సీన్ పర్ఫెక్ట్ గా లేకపోయినా ప్రేక్షకులు క్షమించడం లేదు. విఎఫ్ఎక్స్ లో జరిగే ఒక్క తప్పు స్నోబాల్ ఎఫెక్ట్ లా సినిమాని చుట్టేస్తోంది. ఇటీవల పోస్ట్ ప్రొడక్షన్ అనేది అటు నిర్మాత.. ఇటు నిర్మాణ సంస్థ చేతుల్లో ఉండడం లేదు .. అందరూ కూడా హిట్ సినిమానే కోరుకుంటున్నారు కాబట్టి ప్రతి ఒక్కరూ కష్టపడి సీజీ షాట్స్ సరిగ్గా చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా సినిమాను ఎన్ని ఏళ్ళు తీశామన్నది ప్రేక్షకులు చూడరు ఎంత బాగా తీశామన్నదే చూస్తారు.. అందుకే సినిమాను ఆలస్యంగా విడుదల చేస్తాం అంటూ చెప్పుకొచ్చారు. ఏది ఏమైనా సినిమాపై అంచనాలను పెంచుతూ వి ఎఫ్ ఎక్స్ పై భారీగా కష్టపడుతున్నట్లు చెప్పుకొచ్చింది చిత్ర బృందం. మరి నబా నటేష్ సుందరవల్లి పాత్రలో ఏ విధంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి.

## మొన్న అనిల్.. నేడు క్రిష్

స్టార్ డైరెక్టర్ల నుంచి ఒక సినిమా రాగానే.. ఇంకో సినిమా గురించి ఊహాగానాలు మొదలైపోతాయి. కొందరు తెలిసిన సమాచారాలకు కొంచెం మసాలా అద్దితే.. కొందరు అబద్ధపు వార్తల్ని పుట్టించి నిజాలుగా ప్రచారం చేస్తుంటారు. దర్శకుల్లో కొందరు వీటిని పట్టించుకుంటారు. కొందరు ఖండిస్తారు. ఇటీవలే 'మన శంకర వరప్రసాద్ గారు'తో భారీ విజయాన్నందుకున్న అనిల్ రావిపూడి నుంచి రాబోయే కొత్త చిత్రం గురించి మీడియాలో, సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరగ్గా.. ఆ దర్శకుడు స్పందించాడు. ఈ ఫ్లోలో యాక్షన్, కట్ కూడా చెప్పేస్తారా అంటూ సెటైర్ వేసిన అనిల్.. తనే స్వయంగా కొత్త సినిమా వివరాలు ప్రకటించే వరకు కాస్త ఆగమన్నాడు. తాజాగా మరో స్టార్ డైరెక్టర్ క్రిష్ సైతం తన కొత్త సినిమా గురించి జరుగుతున్న ప్రచారాన్ని ఖండించాడు. ఏడుగురు హీరోయిన్లను పెట్టి క్రిష్ ఒక సినిమా తీయబోతున్నాడని.. అది ట్రెక్కింగ్ నేపథ్యంలో



సాగే అడ్వెంచరస్ థ్రిల్లర్ అని ఒక వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. తన ప్రతి చిత్రంలోనూ కథానాయికకు బలమైన పాత్రలు ఇచ్చే క్రిష్.. ఏడుగురు హీరోయిన్లతో సినిమా చేస్తున్నాడనగానే చాలామంది ఎగ్జైట్ అయ్యారు. కానీ ఈ ప్రచారం నిజం కాదని క్రిష్ తేల్చేశాడు. "ఏడుగురు హీరోయిన్లు, ట్రెక్కింగ్ అడ్వెంచర్.. ఐడియా బాగుంది. కానీ అది నిజం కాదు. సోషల్ మీడియాలో రూపొందిన మరో స్క్రిప్టు" అంటూ సెటైరికల్‌గా స్పందించాడు క్రిష్. తన కొత్త సినిమా వివరాలను త్వరలోనే తనే అధికారికంగా ప్రకటిస్తానని క్రిష్ తెలిపాడు. ఒకప్పుడు గమ్యం, వేదం, కృష్ణం వందే జగద్గురుం, గౌతమీపుత్ర శాతకర్ణి లాంటి గొప్ప సినిమాలు అందించిన క్రిష్.. చాలా ఏళ్లుగా సరైన విజయం లేక ఇబ్బంది పడుతున్నాడు. యన్.టి.ఆర్: కథానాయకుడు, యన్.టి.ఆర్: మహానాయకుడు, హరిహర వీరమల్లు, ఘాటి చిత్రాలు ఆయనకు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ముఖ్యంగా గత ఏడాది 'ఘాటి'తో పెద్ద షాకే తిన్నాడు క్రిష్. మరి కొత్త సినిమాతో అయినా పుంజుకుంటాడేమో చూడాలి. ఎప్పట్లాగే సొంత బేనర్లోనే తన కొత్త సినిమాను క్రిష్ చేయబోతున్నట్లు తెలుస్తోంది.




## ఫెయిల్యూర్ సినిమా డేట్ పై కన్నేసిన రజినీకాంత్.. తెలిసీ తప్పు చేస్తున్నారా?



సాధారణంగా చిన్న సినిమాలు తెరపైకి వస్తున్నాయి అంటే రిలీజ్ డేట్ విషయంలో అటు.. ఇటు.. ఎటువంటి సినిమాలు లేకపోవడం, హాలిడేస్ ఉండడం లాంటి విషయాలను పరిగణలోకి తీసుకొని మరీ సినిమాను రిలీజ్ చేస్తూ ఉంటారు అంతేకాదు విడుదలవుతున్న సినిమా డేట్ ముహూర్తం చూసుకొని మరీ రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. చిన్న సినిమాలే సినిమా విడుదల సమయంలో ఇన్ని జాగ్రత్తలు పాటిస్తుంటే.. ఇక పెద్ద హీరోలు..పైగా భారీ బడ్జెట్ చిత్రాలు ఏ రేంజ్ లో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా గతంలో తమ సినిమాలు ఏవైనా బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాయి అంటే దాదాపు అదే రోజున మళ్లీ తమ ఇంకో సినిమాను రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. ఉదాహరణకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్.. ప్రస్తుతం పెద్ది సినిమాతో ఏప్రిల్ 30వ తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో ఆయన నటించిన మగధీర సినిమా 2009 జూలై 30వ తేదీన రిలీజ్ అయింది. ఇక రంగస్థలం సినిమా 2018 మార్చి 30వ తేదీన విడుదలయ్యింది. ఇప్పుడు మళ్లీ పెద్ది సినిమా కూడా ఏప్రిల్ 30వ తేదీన రిలీజ్ చేయాలని చూస్తున్నారు. ఎందుకంటే ఆ రెండు చిత్రాలు 30న విడుదలయ్యి బ్లాక్ బస్టర్ ని అందుకున్నాయి .ఇప్పుడు భారీ బడ్జెట్ తో వస్తున్న ఈ సినిమా కూడా ఏప్రిల్ 30న విడుదల అయితే మళ్లీ అలాంటి రికార్డ్స్ క్రియేట్ చేయడం ఖాయం అనే ఆలోచనలో ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు. అయితే ఇక్కడ ఒక స్టార్ హీరో మాత్రం ఫెయిల్యూర్ ను అందించిన సినిమా విడుదల తేదీపై కన్నేయడంతో అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే కోలీవుడ్ స్టార్ హీరోగా, సౌత్ సూపర్ స్టార్ గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్నారు రజినీకాంత్. ఈయన 70 సంవత్సరాల వయసులో కూడా వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. అయితే 'జైలర్' సినిమా కంటే ముందు ఈయన సినిమాలు వరుసగా డిజాస్టర్ అవడంతో రజినీకాంత్ పని అయిపోయింది.. ఇక రిటైర్ అయ్యే సమయం వచ్చేసింది అని కొంతమంది యాంటీ ఫ్యాన్స్ కామెంట్లు చేశారు. కానీ జైలర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి అందరి నోళ్లు మూయించారు రజినీకాంత్. తర్వాత లోకేష్ కనగరాజు దర్శకత్వంలో కూలీ సినిమా చేశారు. ఇకపోతే జైలర్ సినిమా ఆగస్టు రెండవ వారం అనగా 2023 ఆగస్టు 10వ తేదీన విడుదలయి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. అదే తేదీలలో విడుదల చేస్తే కూలీ కూడా బ్లాక్ బాస్టర్ అందుకుంటుందని ఆగస్టు 14న ఏరికోరి మరీ సినిమాను రిలీజ్ చేశారు.కానీ సినిమా బొక్క బోర్లా పడింది. అయితే ఇప్పుడు మళ్లీ తనను తాను ప్రూవ్ చేసుకోవడానికి జైలర్ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు రజినీకాంత్. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కూడా దాదాపు పూర్తి కావస్తోంది. అటు చెన్నై మీడియా వర్గాలు జూన్ విడుదల అని ఊదరగొడుతున్నా.. రజనీకాంత్ టీమ్ మాత్రం సెంటిమెంటుకే ఓటు వేయనుంది అని4 సమాచారం. దీంతో అభిమానులలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రజనీకాంత్ బృందం ఆలోచిస్తున్న డేట్ మేరకు ఆగస్టు 2వ వారంలో ఇండిపెండెన్స్ డే ని లక్ష్యంగా చేసుకొని ఆగస్టు 12 లేదా 14వ తేదీన రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు .ఆగస్టు 10వ తేదీన జైలర్ వచ్చి మంచి విజయం అందుకుంది. అందుకే ఆగస్టు 14న ఈ సినిమాను రిలీజ్ చేయాలని చూస్తున్నారు. కానీ అదే రోజున కూలీ వచ్చి డిజాస్టర్ గా నిలిచింది. కాబట్టి అసలు ఈ డేట్ వర్కౌట్ అవుతుందా? ఎందుకు ఈ డేట్ ను ఫిక్స్ చేసుకుంటున్నారు అనే కామెంట్ లు వ్యక్తం చేస్తున్నారు అభిమానులు. మరి కనీసం ఇప్పటికైనా రజినీ టీం ఆలోచించి విడుదల తేదీని వాయిదా వేసుకుంటే బెటర్ అని తమ అభిప్రాయాలను వ్యక్త పరుస్తున్నారు. ఈ సినిమాలో షారుక్ ఖాన్ క్యామియో పాత్ర తాలూకు షూట్ ఇంకా పూర్తి కాలేదు.. విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్, మోహన్ లాల్ కు సంబంధించిన కొన్ని సీన్స్ కూడా బ్యాలెన్స్ ఉన్నాయట. ఇక అవన్నీ పూర్తి చేసేలోపు వేసవి కూడా అయిపోతుంది. అందుకే కాస్త ఆలస్యమైనా సరే విడుదల తేదీ విషయంలో జాగ్రత్త పడాలని సలహా ఇస్తున్నారు అభిమానులు.

## టాలీవుడ్ లో రోషన్ లు..ఎంతమంది హృతిక్ అయ్యేను?



హృతిక్ రోషన్ బాలీవుడ్ లో ఎంత పెద్ద హీరోనో చెప్పాల్సిన పనిలేదు. కోట్లాది మంది అభిమానించే స్టార్. హృతిక్ డాన్సింగ్ స్కిల్స్ తో ఎంతో మంది స్టార్ హీరోలకు స్పూర్తిగా నిలిచారు. తారక్ మెచ్చిన ఉత్తమ డాన్సర్ ఎవరు అంటే హృతిక్ పేరు మాత్రమే చెబుతారు. ఇండియాలో నెంబర్ డాన్సర్ ఎవరు? అంటే ఎవరు కాదన్నా? అవుననా అది కేవలం హృతిక్ సర్ మాత్రమేనని బల్ల గుద్దీ మరి చెప్పాడు. సూపర్ స్టార్ మహేష్ కూడా హృతిక్ డాన్స్ కు అభిమానే. రామ్ చరణ్ సహా చాలా మంది స్టార్లు హృతిక్ కి అభిమానులుగా ఉన్నారు. హృతిక్ నటన సహా లుక్ కి ప్రత్యేకమైన అభిమానులెంతో మంది ఉన్నారు. ఇండియాలో ఎవరు పాన్ ఇండియాలో సినిమాలు రిలీజ్ చేయకముందే హృతిక్ సినిమాలు వివిధ భాషల్లో అనువాదమయ్యాయి. అలా రోషన్ పేరు ఇండియా అంతటా ఇప్పటికీ మారుమ్రోగుతోంది. మరి అలాంటి రోషన్ క్రేజ్ ని అందుకునే సత్తా నవతరం రోషన్స్ లో ఎంత మందికి సాధ్యం. ప్రత్యేకించి టాలీవుడ్ లో ఉన్న రోషన్స్ హృతిక్ రోషన్ లా సినిమా రంగంలో సక్సెస్ అవుతారా? అన్నది చూడాలి. వివరాల్లోకి వెళ్తే టాలీవు డ్ లో ఓ నలుగురు రోషన్ లు ఉన్నారు. వారే శ్రీకాంత్ తనయుడు రోషన్ మేక. ఈ యువ హీరో గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. లుక్ పరంగా అచ్చంగా హృతిక్ రోషన్ కి తలపిస్తాడు. హైట్..వెయిట్..హెయిర్ స్టైల్ ప్రతీది హృతిక్ రోషన్ని పోలి ఉంటుంది. యూరోపియన్ స్టార్ లా ఉన్నాడని రామ్ చరణ్ సైతం కితాబిచ్చాడు. అలాగే చాలా మంది టాలీవుడ్ ప్రముఖులు హృతిక్ రోషన్ తో పోలిక చేసిన సందర్భాలెన్నో. సరైన సినిమా పడితే? రోషన్ హృతిక్ రోషన్ లా ఇండస్ట్రీలో సక్సెస్ అవుతాడని చాలా మంది నమ్ముతున్నారు. అతడిపై 1000 కోట్లుపెట్టి పాన్ సరైన సబ్జెక్ట్ తో ఓ పాన్ ఇండియా సినిమా తీస్తే? ఇండియాను అల్లాడించేస్తాడు అన్నది విశ్లేషకుల మాట. అలాగే యాంకర్ సుమ-రాజీవ్ కనకల కుమారుడు రోషన్ కనకాల సుపరిచితమే. ఇప్పటికే రెండు..మూడు సినిమాల్లో కూడా హీరోగా నటించాడు. హైట్..వెయిట్ తో..ఉంగరాల జుట్టుతో బాగానే ఉంటాడు. కానీ స్టోరీ సెలక్షన్ రోషన్ ని వెనక్కి నెట్టుతుంది. స్టోరీల విషయంలో మరింత వైవిధ్యంగా ఉండాలి. సరైన హిట్ పడితే? భవిష్యత్ బాగుంటుందన్నది విమర్శకుల అభిప్రాయం. అలాగే -కోర్టు- విజయంతో హర్ష రోషన్ అనే కొత్త కుర్రాడు కూడా బాగానే ఫేమస్ అవుతున్నాడు. తొలి సినిమాతో ఈజ్ ఉన్న నటుడిగా ప్రూవ్ చేసాడు. -కోర్టు- మంచి విజయం సాధించడంతో మంచి పేరొచ్చింది. అవకాశాలు కూడా బాగానే వస్తున్నాయి. బాల నటుడిగానే ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి సినిమాలపై తన ఫ్యాషన్ చాటుకున్నాడు. రియాల్టీ, డాన్సు షోలతోనూ రాణిస్తున్నాడు. రోషన్ బషీర్ అనే మరో నటుడు ఉన్నాడు. ఇతడు మలయాళ నటుడు అయినప్పటికీ తెలుగులో ఎక్కువ సినిమాలు చేస్తున్నాడు. విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన -దృశ్యం- సినిమాలో నెగటివ్ షేడ్ ఉన్న వరుణ్ ప్రభాకర్ పాత్రతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యాడు. అటుపై -డర్టీ హరి-, -మళ్ళీ పెళ్లి- లాంటి చిత్రాలతో బాగా ఫేమస్ అయ్యాడు. ఇలా టాలీవుడ్ లో నలుగురు రోషన్ లు ఉన్నారు. మరి వీళ్లలో హృతిక్ రోషన్ లా సక్సెస్ అయ్యేది ఎంతమందో చూద్దాం.

## అమాయకపు చూపులతో యువతను మాయ చేస్తున్న అనన్య!

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో గ్లామర్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది తెలుగమ్మాయి అనన్య నాగళ్ల. సోషల్ మీడియా వేదికగా ఈమె చేసే గ్లామర్ రచ్చ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పొట్టి బట్టల్లో స్కిన్ షో చేయడం అమ్మడికి అలవాటుగా మారిపోయిందనే కామెంట్స్ కూడా వినిపిస్తూ ఉంటాయి. అలా ఇప్పుడు వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ బ్యూటీ షార్ట్ స్కర్ట్ లో గ్లామర్ ట్రీట్ ఇచ్చింది. తన అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది . కొంటె చూపులతో కసిగా కవ్విస్తూ యువత గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. తాజాగా యాష్ కలర్ మినీ స్కర్ట్ ధరించిన ఈమె అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో మంట రాజేస్తున్నాయి. వాలెంటైన్స్ డే వేళా యువతకు స్పెషల్ ట్రీట్ ఇచ్చింది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అనన్య నాగళ్ళ షేర్ చేసిన ఈ మినీ స్కర్ట్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది ఆమె అభిమానులు. ఈ ఫోటోలకు తెగ లైక్ షేర్ చేస్తూ కామెంట్ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జన్మించిన ఈ తెలుగమ్మాయి.. ఒక వ్యాపారవేత్త కుటుంబం నుంచి వచ్చింది. చదువు కోసం హైదరాబాద్ వెళ్ళిన ఈ ఇబ్రహీంపట్నంలోనే రాజా మహేంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో బీటెక్ పూర్తి



చేసి ఇండస్ట్రీలోకి రాకముందే ఇన్ఫోసిస్ లో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా ఉద్యోగం కూడా చేసింది. 2019లో ప్రియదర్శితో కలిసి మల్లేశం సినిమాకి హీరోయిన్ గా ఎంపికైంది. మొదటి సినిమాతోనే అందరూ దృష్టిని ఆకట్టుకుంది. చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా రాజు రాచకొండ రచించి , దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనన్య నాగళ్ల పాత్రకు మంచి పేరు లభించింది. నిజానికి ఈమె పేరు అనూష నాగళ్ల అయితే ఈ చిత్రం ద్వారానే ఈమెకు అనన్య నాగళ్ళ అని పేరు మార్చారు. ఇక ఇందులో మల్లేశం భార్య పద్మా పాత్రలో ఒదిగిపోయింది. సహజమైన అమాయకత్వంతో నటనతోలోకి చొచ్చుకుపోయింది. అలాంటి అనన్య నాగళ్ళ ఆ తర్వాత ప్లే బ్యాక్, వకీల్ సాబ్, మాస్ట్రో వంటి చిత్రాలలో నటిగా నటించి.. ఊర్వశివో రాక్షసివో సినిమాలో దివ్య అనే పాత్రలో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చి అందరిని ఆకట్టుకుంది. అన్వేషి, తంత్రం, డార్లింగ్ వంటి చిత్రాలలో కీలక పాత్రలు పోషించిన అనన్య 2024 లో వచ్చిన డార్లింగ్ సినిమాలో డాక్టర్ నందిని పాత్ర పోషించి ఆకట్టుకుంది. ఇక చివరిగా శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ లో నటించింది అనన్య నాగళ్ళ. తెలుగు భాషా కామెడీ థ్రిల్లర్గా విడుదలైన ఈ చిత్రం ద్వారా రచయిత మోహన్ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. శ్రీ గణపతి సినిమాస్ పతాకం పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్ టైటిల్ పాత్ర పోషించారు. ప్రస్తుతం అవకాశాలు అందుకునే పనిలో పడ్డ అనన్య అందులో భాగంగానే ఇటు సోషల్ మీడియా ద్వారా కూడా అభిమానులను అలరిస్తోంది.

## రష్మిక - విజయ్ పెళ్లి.. రాబోతున్న ముఖ్య అతిథులు వీరే!

టాలీవుడ్‌లో గత కొన్నాళ్లుగా ఊరిస్తున్న రష్మిక మందన్న - విజయ్ దేవరకొండ పెళ్లి వార్త ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది. ఎప్పుడు అడిగినా మేము కేవలం స్నేహితులం అని దాటవేస్తూ వచ్చిన ఈ జంట, ఇప్పుడు ఏకంగా ఏడడుగులు వేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి వివాహ వేడుక జరగనుందనే వార్త సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. దీనికి తోడు తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయ్ దేవరకొండ కలవడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఈ మోస్ట్ వాంటెడ్ సెలబ్రిటీ వెడ్డింగ్‌కు సంబంధించిన అతిథుల వివరాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. వివరాలలోకి వెళితే.. ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో పెళ్లి: విజయ్, రష్మికల పెళ్లి ముహూర్తం ఫిబ్రవరి 26న ఖరారైనట్లు సమాచారం. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న ఒక రాజభవనంలో అత్యంత సన్నిహితుల మధ్య ఈ వేడుక జరగనుంది. అయితే, అసలైన హంగామా మాత్రం హైదరాబాద్‌లో ఉండబోతోంది. మార్చి 4న నగరంలోని ఒక ప్రముఖ కన్వెన్షన్ సెంటర్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్‌ను ప్లాన్ చేశారు. తాజాగా విజయ్ దేవరకొండ స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేయడం ఈ పెళ్లి వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది. 2025 అక్టోబర్‌లోనే వీరిద్దరికీ సీక్రెట్‌గా



నిశ్చితార్థం జరిగిందని, అప్పటి నుంచే ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయని ఇండస్ట్రీ టాక్. గెస్ట్ లిస్ట్‌లో దిగ్గజాలు.. రాబోతున్న అతిథులు వీరే: ఈ క్రేజీ జంట రిసెప్షన్‌కు సౌత్ ఇండియా నుంచి బాలీవుడ్ వరకు స్టార్ల సందడి ఉండబోతోంది. ముఖ్యంగా విజయ్‌కు అత్యంత సన్నిహితుడైన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనున్నారు. రష్మిక, విజయ్‌లతో కలిసి పనిచేసిన ప్రముఖ దర్శకులు, నిర్మాతలు ఈ వేడుకకు హాజరుకానున్నారు. బాలీవుడ్ నుంచి కూడా కొందరు స్టార్ హీరోలు, హీరోయిన్లు ఈ వేడుకలో మెరిసే అవకాశం ఉంది. ఉదయ్‌పూర్ పెళ్లిని ఎంత సీక్రెట్‌గా ఉంచాలని చూసినా, హైదరాబాద్ రిసెప్షన్ మాత్రం కంటికి పండుగలా, తారల మెరుపులతో అట్టహాసంగా సాగనుందని తెలుస్తోంది.

**ఫ్యాన్స్ ఎదురుచూస్తున్న శుభఘడియలు:** 'గీత గోవిందం' సినిమా నుంచి మొదలైన వీరిద్దరి కెమిస్ట్రీ, ఇప్పుడు నిజ జీవితంలోనూ ఒక్కటవుతుండటం అభిమానులకు కడుపు నిండినంత ఆనందాన్ని ఇస్తోంది. ఇప్పటికీ ఈ జంట అధికారికంగా నోరు విప్పకపోయినా, పెళ్లి ఖాయం అని అందరికి తెలిసిందే, మరి ఉదయ్‌పూర్ కోటలో ఈ రౌడీ హీరో, నేషనల్ క్రష్ రష్మికల పెళ్లి ఫోటోలు ఎప్పుడు బయటకు వస్తాయా అని నెటిజన్లు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. మార్చి మొదటి వారం కల్ల టాలీవుడ్ మరో అద్భుతమైన జంటను తన ఖాతాలో వేసుకోనుంది. ఈ వార్త ఫాన్స్ కు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536